ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

57415

Entered

జనవరి 31, 2010



గుమ్మడి
పెద్దరికానికి ఒరవడి

హ్యాపీ బర్త్‌డే

(2010 జనవరి 31 నుంచి
2010 ఫిబ్రవరి 6 వరకు)

శ్రీ సాయి చరణ్ ముదిరాజ్
1సం॥,ఫిబ్రవరి-1
అనురాధ-గణేష్
గోషామహల్-హైదరాబాద్

జి. చరణ్‌రాజ్
1సం॥, జనవరి-2009
అంజలి-నరసింహ
న్యూ గాంధీనగర్-హైదరాబాద్

సాయిసుప్రియ
ఫిబ్రవరి-4
మురళీకృష్ణ
పశ్చిమగోదావరి

యం.లోహితశ్రీ
1సం॥,ఫిబ్రవరి-3
లక్ష్మీశివకుమారి-శ్రీనివాస్‌రెడ్డి
మాదల-గుంటూరు

వి.ధాత్రి
ఫిబ్రవరి-2
ప్రగతి-రామిరెడ్డి
అనంతపురం

వర్షిణి
1సం॥,ఫిబ్రవరి-4
నిర్మల-వెంకటేష్
రామాంతపూర్-హైదరాబాద్

గంగోత్రి
4సం॥, జనవరి-2006
భాగ్యమ్మ-కొండయ్య
డోర్నకల్-వరంగల్

ఖాజా మొహినుద్దీన్
1సం॥, జనవరి-31
నజియాబేగం-మెహరాజ్ ఉద్దిన్
గుండ్లపోచంపల్లి-రంగారెడ్డి

వంశి
1సం॥, జనవరి-5
లత-శ్రీను
జడ్చర్ల-మ॥నగర్

రక్షిత
1సం॥, జనవరి-2009
అనూష-భీష్మ
చంద్రుగూడ-వరంగల్

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు, పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు, తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email- venkateshcartoon@gmail.com

ENTERED

మనలో మాట

మానవుడా...మజాకానా...

ధరల్లాగే మన దేశంలో భక్తి రసం కూడా రాకెట్ వేగంతో పెరుగుతోంది. ఉత్సవాలు, జాతర్లు ఎక్కడ చూసినా తండోపతండాల జనం. మేడారం జాతరదీ అదే తీరు. మేడారం వైపు దారులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. జంపన్నవాగు, స్నానఘట్టాలు కిటకిటలాడాయి. గత జాతరకు 80 లక్షల మంది తరలివచ్చారు. ఈసారి కోటిమందికి పైగా వచ్చుంటారని అంచనా. కర్నాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా... నుంచీ జనం తరలివచ్చారు. రాజకీయ నేతల సందర్శన సరేసరి. జనం వస్తున్నారంటేచాలు మన నేతలు అవకాశం వదులుకోరు. దానికి తోడు పోటీలు పడిపోయే మీడియా అంతా ఒక విష వలయం. మొక్కు తీర్చుకొంటే కోరికలు సిద్ధిస్తాయన్న భావన ఎక్కడో లోలోపల మినుకుమినుకుమనే జనానికి కూడా ఇవన్నీ చూసి... మనమెందుకు ప్రయత్నించరాదన్న ధోరణి పెరిగిపోతోంది. జనం దేన్నీ వదులుకోవడానికి సిద్ధంగా లేరు.

అయ్యప్ప దీక్షలు, దుర్గా మాల, హనుమాన్ మాల (దీన్నే చిరంజీవి మాల అని కూడా అంటున్నారైండి).... ఇలా ఎన్ని లేవు. ఒక్కో రకం దీక్షకు, మాలకు ఒక్కో రంగు డ్రెస్సు. ఆయా దీక్షల సమయంలో ఆయా రంగుల బట్టలకు చెప్పలేని గిరాకీ.

వినాయకచవితి అంటే పదిరోజుల హడావిడి. ఇక గణేశుడి ఊరేగింపు, నిమజ్జనం హంగామా అంతా ఇంత కాదు. రాజధానిలో అయితే అపార్టుమెంటుకో గణపతి విగ్రహం వెలుస్తుంది. సందుగొందుకో పందిరి లేస్తుంది. ఎవరి చందాలు వారివి (వారు 'అడిగినంత' చేతిలో పెట్టాల్సిందే). ఎవరి ఏర్పాట్లు, పూజలు, ప్రసాదాలు, భజనలు వారివే.

తిరుపతి వెంకన్న గురించి చెప్పేదేముంది? మోస్టు పాపులర్. కాలినడకన వెళ్లే ఎన్ఆర్ఐల సంఖ్య పెరగడం విశేషం. ఎన్ఆర్ఐ కావడానికి వీసాల కోసం హైదరాబాదు, చిల్కూరులో బాలాజీ సందర్శన. అక్కడ రద్దీ పెరిగిపోయి ప్రదక్షిణకు టైమ్ కేటాయిస్తూ ముందే చీటీలు ఇచ్చేస్తున్నారుమరి.

ఇంక పుష్కర స్నానాల గురించి చెప్పేదేముంది! ఎక్కడెక్కడి నుంచో లక్షలాది మది భక్తులొచ్చి మురికినీళ్లలో మునిగి వెళ్తుంటారు.

వేలాదిగా భక్తులు వస్తున్నారంటే అందుకు తగ్గ ఏర్పాట్లు చూడాలి. తాగునీరు, పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలి. శాంతిభద్రతలు పర్యవేక్షించాలి. మరి ఇవన్నీ సవ్యంగా జరగాలంటే మాటలా! అధికారులు, పోలీసులు, ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంకావాల్సిందే. ఎంతో శ్రమ. ఎంతో ఖర్చు. అయినా తప్పదు. ఇందులో ఎన్ని లొసుగులు? ఎన్ని అమ్యామ్యాలు? ఎన్ని స్వాహాలు? ఎన్ని మాయలు? ఎన్ని హాంఫట్లు? ఎన్ని పిక్‌ప్యాకెట్లు? ఎంత వ్యాపారం? కొందరికైతే భక్తి రసమే భుక్తి ప్రదాత. అదీ కోట్లలో అంటే ఆశ్చర్యం కలుగుతుంది.

ఇదంతా ఎందుకనుకున్నారో ఏమో! కొందరు ఈమధ్య వెబ్‌సైట్లలోనే 'అన్నీ' కానిచ్చేస్తున్నారు. "అక్కడిదాకా వెళ్లక్కర్లేదు! మా సైట్లలోనే పూజలు, వ్రతాలు, సహస్రనామార్చనలు కానిచ్చేస్తామంటూ నెట్ ప్రకటనలు, హైటెక్ ఏర్పాట్లు. నోరులేని దేవుళ్లనూ, దేవతలనూ గొప్ప వ్యాపార వనరులుగా మార్చేశాడు మానవుడు. మరి మానవుడంటే మజాకానా...ఏంటి?

★

ఈ సంచికలో....

టపా	...	2
ఆ తెల్లదొరసాని		
కుందేటికొమ్ము	...	3
కవిత్వమ్	...	6
విజ్ఞాన వీచిక	...	7
కథ	...	8
ఆరోగ్యం	...	10
అట్టమీది కథ	...	14
రుచి	...	17
సీరియల్	...	18
చూద్దామా	...	22
క్రైమ్‌కథ	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

గర్జించిన శ్రామిక సింహం 'ఉక్కుపాదం'

బాలనేస్తాలు ... 12

సాహసం చేయరా అంబారీ ఎక్కరా

సినిమా కబుర్లు ... 20

బాలీవుడ్‌కు అవార్డుల పంట తమిళం కూడా రొంబ సంతోష... తెలుగే... ప్చ్...



చక్కటి

చిక్కటి కథ

ఈ వారం కవర్‌స్టోరీ 'చరితార్థుడు... అరుణార్కుడు' చాలా బాగుంది. పశ్చిమ బెంగాల్ ధ్రువతార జ్యోతిబసు జీవిత ప్రస్థానం, వారి కమ్యూనిస్టు ఉద్యమాలు – విజయాలు, కార్యక్రమాలు ఎందరికో మార్గదర్శకాలు. ఇది చక్కటి చిక్కటి కవర్‌స్టోరీ. జ్యోతిబసు మరణం దేశానికి సంతాపం కలిగించింది.

ఆచార్య నూతి నారాయణరావు, గడ్డిఅన్నారం, హైదరాబాద్.

విలువైన కవర్

జనవరి 17నాటి స్నేహలో తెలకపల్లి రవి గారు అందించిన జ్యోతిబసు 'అట్టమీది కథ' చాలా విలువైనది. జ్యోతిబసు ఉన్నత వ్యక్తిత్వం, మహనీయత్వాన్ని గ్రహించగలిగాం. 21వ పేజీలో కార్టూన్లన్నీ చాలా చక్కగా వున్నాయి. "కేకో... కేక" కేకుల కళాకారుడు.. 'స్కాట్‌హోప్' ప్రతిభకు హ్యాట్సాఫ్. అమ్మిన శ్రీనివాసరాజు గారి 'బంగారుగిన్నె' కథ చాలా బాగుంది. 'వికాసం' శీర్షిక సంధ్యగారి స్కెచ్ ప్రయోజనకర అంశాలను స్పృశించింది. డా॥బి.వి.ఎస్.స్వామి గారి 'పాకుడు బండలు" కథ ఆద్యంతం ఆసక్తికరంగా వుంది. ఇటలీ అందాలను స్వయంగా చూశామా అన్నంత వివరంగా 'చూద్దామా' ద్వారా సందర్శించగలిగాం. "వియత్నాం గెరిల్లా" సీరియల్ కూడా పాఠకులందరికీ సాహిత్యవిందు చేయ ప్రయత్నిస్తుందని విశ్వసిస్తున్నాం. 'సామాన్యుడి డైరి' ద్వారా 'మనలోమాట' గుండె చప్పుళ్లను వినిపింపజేయడం గమనార్హం.

నేమాన సుభాష్ చంద్రబోస్, ఇలిసిపురం, శ్రీకాకుళం.

మంచి కథనం

17 జనవరి సంచికలో 'అట్టమీది కథ' 'చరితార్థుడు... అరుణార్కుడు' చదివాం. అయితే ఆరోజే జ్యోతిబసు మరణించాడనే వార్త విని చాలా బాధపడ్డాను. కాకలు తీరిన కమ్యూనిస్టు యోధునిగా, అనేక పర్యాయాలు ఎన్నికైన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అన్ని రంగాలలోనూ ముందుకు తీసుకెళ్లిన ఘనత ఆయనదే. ఆయన మరణం యావత్ దేశానికి తీరని లోటు. మంచి నేతను కోల్పోయాం. ఆయన వ్యక్తిత్వం అజరామరం. విలక్షణశైలి, తీయని మాటలు మదిలో మెదులుతాయి. ఎంత ఎదిగినా ఒదిగిన మనస్తత్వం గల జ్యోతిబసు 1977లో మొదటిసారిగా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకున్నాడు. పదవీ విరమణ వుండదు అని ప్రకటించి తన వారసుడిగా బుద్ధదేవ్ భట్టాచార్యను 2000 సంవత్సరంలో సిఎం పదవిని అప్పగించిన రాజకీయ దురంధురుడుగా బసును పేర్కొనవచ్చు. ఆయన మరణించాడనే వార్తను నమ్మలేకపోతున్నాం. ఆదివారం అట్టమీది కథ చదువుతున్నప్పుడే జ్యోతిబసు మరణవార్తను వినాల్సిరావడం నిజంగా బాధాకరం. ఆయనకు మా ప్రగాఢ నివాళిని అర్పిస్తున్నాం. మంచి కథనాన్ని అందించిన ప్రజాశక్తికి అభినందనలు.

కామిడి సతీష్‌రెడ్డి, కాటూరు

శ్రీధరాచార్య, పరకాల, వరంగల్.

సందర్భోచితంగా ఉంది

సత్యాజీ గారి 'ఊరూరా సంక్రాంతి' రచన సందర్భోచితంగా వుంది. 'రేగు భళా...!' వ్యాసం రేగుపళ్లంటే ఇష్టపడేవారికి కచ్చితంగా నచ్చుతుంది. భారతదేశంలో ప్రణాళిక ప్రకారం నిర్మించిన మొట్ట మొదటి నగరం 'పింక్ సిటీ' అని తెలుసుకునే అవకాశం చూద్దామా ఫీచర్ ద్వారా మాకు లభించింది. ఏడు అగుడుల కుక్క త్వరలోనే గిన్నిస్ బుక్‌లో అడుగుపెట్టబోతున్నందుకు అభినందనలు. వి.రామకృష్ణ కార్టూన్లు చాలా చక్కగా వున్నాయి. గాలిపటాలను ఎగురవేసే సమయంలో గైకొనాల్సిన జాగ్రత్తలు ఉపయోగకరంగా ఉన్నాయి. 'బాలనేస్తాలు'లో చిత్ర విచిత్రం కాలమ్ అంటే మాకు భలే ఇష్టం. మొత్తానికి గురక మారాజుల కోసం జర్మనీలో 'గురక మ్యూజియం' ఏర్పరచారని తెలుస్తోంది. ప్రపంచానికి ఆర్థిక సంక్షోభాన్నిచ్చి 'ఫార్వర్డ్ ట్రేడింగ్' పేరుతో నాటకాలాడే అమెరికా 'మనలో మాట'లో ఎంతో చేదునిజం దాగుంది.

ఎన్.ఎస్.బి, శ్రీకాకుళం.

మనందరి మాట

వియత్నాం గెరిల్లా సీరియల్ మొదటి వారమే తర్వాత ఏమౌతుందా అని ఆతృతతో ఎదురు చూసేలా వుంది. జ్యోతిబసు గురించి ఈ ఆదివారమే రావడం యాదృచ్ఛికమే అయినా ఆ వార్త విన్నతర్వాత బాధనిపించింది. సంవత్సరానికొక మంత్రి మారుతున్న కాలంలో ఏకంగా 23 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేయడమంటే ఆయన్ని ప్రజలు ఎంతగా ఆదరించారో అర్థమౌతుంది. 'బంగారు గిన్నె' కథ బాగుంది. పెద్దవయసు వారిని చిన్నచూపు చూసే ప్రతి ఒక్కరూ చదవాల్సిన కథ అనిపించింది.



'సినిమా కబుర్లు'లో చెప్పినట్లుగా ఎలాంటి ప్రయోగాలు చేయాలన్నా మన తెలుగువారు వెనకడుగు వేస్తారు. మూసపోసినట్లుగా ఎప్పుడూ ఒకే రకంగా, ఎంత వయసొచ్చినా ఇంకా చిన్నవాళ్లలా హీరోలుగానే వుండిపోదామనుకుంటారు. ప్రేక్షకులకు మొహం మొత్తేదాకా ఇంతే చేస్తుంటారు. ఎప్పుడు బాలీవుడ్‌ని ఆదర్శంగా తీసుకుంటారో తెలీదు. 'సామాన్యుడి డైరీ'ని మనలో మాట అనేకంటే మనందరి మాట అంటే బాగుంటుందేమో! మధ్య తరగతిలో బతుకుతున్న అందరిదీ అదేమాట.

రాధిక, వరంగల్.

స్ఫూర్తి బాగుంది

ఈవారం వాసిరెడ్డి సత్యనారాయణ గారి స్ఫూర్తి శీర్షిక బాగుంది. జ్యోతిబసు గారి గురించి వివరణ నచ్చింది. బాలీవుడ్‌లోని బిగ్ బి, అమీర్‌ఖాన్‌లా మన తెలుగు వారు ఎప్పటికీ చేయరేమో? కథ, విజ్ఞానవీచిక శీర్షికలు బాగున్నాయి. చూద్దామా ద్వారా వారం వారం ఒక్కో ప్రదేశానికి మమ్ములను తీసుకెళ్తున్నారు. కలర్ పేజీలో వచ్చిన 'కేకో... కేక' చూడగానే నోరూరించింది. కేకులు ఇలా కలపతోనూ, అట్టలతోనూ చేస్తే ఎలాగండీ? కేకు ప్రియులు ఏమైపోవాలి చెప్పండి.

రాణి, హైదరాబాద్.

★

ఆ తెల్లదొరసాని కుందేటి కొమ్ము

ఏం చెప్పమంటారు మా సుపుత్రుడు చేసిన పని గురించి చెప్పుకుంటే సిగ్గుపోతుంది చెప్పకుంటే ప్రాణం పోతుంది అన్నట్లుగా ఉంది, హవ్వ ఎన్నడైనా మా ఇంటా వంటా ఇలాంటివి ఎరగం, పిదపకాలం పిదప బుద్ధులు, అయినా ఒకర్ని లాభం ఏమిటిలే మన బంగారం మంచిదై ఉండాలి గాని.....అదెవతో తెల్లదొరసానట, ఇండియా వస్తుందట, దానికి హోటల్ రూము, విమానఖర్చులకోసమని రెండులక్షల రూపాయలు రామార్పణం చేశాడు, ఎన్నిరోజులు కష్టపడితే అంత సొమ్ము కూడపెట్టుకోవాలి, దాని ముఖానపోశాడు, దిక్కుమాలిన ముండ.అది కష్టాల్లో ఉందట, సొమ్మంతా బ్యాంకులో ఇరుక్కుపోయిందట, దాన్ని తీసుకోవాలంటే వేరే దేశం వాళ్లెవరైనా కావాలట, దానికి మా వాడే దొరకాలా, అయినా దాన్నని లాభం ఏముంది, వీడి బుద్ధి ఏమైంది? చచ్చిన దాని ఆఫ్రికా తండ్రికి అది అక్రమంగా పుట్టిన సంతానమట. దానికోసం 50లక్షల డాలర్లు డిపాజిట్ చేశాడట. దాన్ని బ్యాంకు నుంచి తీసుకొనేందుకు సహాయం చేసే వారికి పదిహేను లక్షల డాలర్లు ఇస్తానందట, దాన్ని వీడు నమ్మాడు, ముందు మీ దేశం వచ్చి అసలు మీరు ఉన్నారో లేదో నిర్ధారించుకొని తరువాత బ్యాంకు నుంచి తీసుకుందాం అందట, అందుకుగాను అది రావటానికి రెండులక్షల రూపాయలు పంపమంటే చెప్పాపెట్టకుండా ఇంట్లో ఉన్న డబ్బు పట్టుకుపోయి దాని పేరుతో పంపాడు. వాళ్ల నాన్నకు తెలిస్తే ఇంకేమైనా ఉందా, ముందు నా పనైపోతుంది, వాడూ ఆయనా బాగానే ఉంటారు, నీకారణంగానే వాడిలా తయారయ్యాడని మధ్యలో నన్నంటారు. పంపితే విమాన ఖర్చులు పంపాడు, వచ్చిన తరువాత హెూటల్ వీడే బుక్ చేయవచ్చు కదా, దానికి కూడా అక్కడికే డబ్బు పంపాలా అమాయకుడు గాకపోతే?

ఎప్పుడో పెళ్లయిన కొత్తలో జరిగిందానికి ఇప్పటికీ నన్ను దెప్పుతూనే ఉంటారు, అదేంటంటారా? దాన్ని గురించి ఎందుకు లెండి....ఎవరు తక్కువ తిన్నారు, అందరికీ ఏదో ఒకసారి అలా జరిగే ఉంటుంది, నేను పిచ్చిదాన్ని గనుక పైకి చెప్పుకొని భోరు మన్నాను, మిగిలిన వారు తేలుకుట్టిన దొంగల్లాగా బయటికి చెప్పుకోరు. చెప్పకతప్పదా, అయినా ఈ వయసులో చెబితే మాత్రం తప్పేముందిలే. నా పెళ్లయిన కొత్తలో ఒక రోజు వీధిలో నడిచి వస్తున్నాను. ఒకచోట పచ్చగా మెరిసిపోతూ ఒకవస్తువు కనపడింది, వంగి తీసి చూడబోయేలోగా మరొకామె కూడా దానిపై చేయి వేసింది. తీరా చూస్తే అది బంగారపు చైను. బరువుగా ఉంది. అది నాదని ఆమె అంది, నా బుద్ధి గడ్డితిని కాదు అది నాదే అని నేనూ అన్నాను. గొలుసును నా చేతిలోనే ఉంచి రోడ్డుమీద గొడవెందుకు పక్కకు రండని లాక్కుపోయింది. అప్పటి రేటు ప్రకారం దాని ఖరీదు సుమారు 20వేల రూపాయలుంటుంది. ఇద్దరం ఒకేసారి చూశాము గనుక సగం ధర అంటే పదివేలు నాకు ఇచ్చి తాను ఉంచుకుంటానంది. అప్పనంగా 20వేల గొలుసు పదివేలకు వస్తుంటే దానికి ఎందుకు ఇవ్వాలని ఆ పదివేలు నేనే ఇచ్చి తీసుకుంటా అని చెప్పా. కాసేపు మొరాయించి చివరకు ఒప్పుకుంది. తీరా ఇంట్లో పదివేలకు ఎనిమిదే ఉన్నాయి. దాందేముంది రేపు మిగతాది తీసుకుంటా ఇవ్వండని తీసుకుపోయింది. రాత్రి ఆయన ఇంటికి రాగానే 20వేల గొలుసును ఎనిమిదివేలకే తీసుకున్నానని చెప్పా. అంతే అది కాకి బంగారమని ఆయన చెప్పటంతో... ఆ తరువాతేం జరిగిందో చెప్పుకోవటం ఎందుకులే.

నాకు బుద్ధి చెప్పి ఆయన మాత్రం చేసిందేమిటి? యూరో లాటరీ తగిలిందని చెప్పగానే కోలా కృష్ణమోహన్‌కు లక్ష రూపాయలు అప్పుగా ఇచ్చాడు. అదంతా ఉట్టిదే అని తెలియగానే ఆయన్ను మనిషిగా చేయటానికి నాకు నెలరోజులు పట్టింది. తరువాత అనుకోకుండా రియలెస్టేట్ వ్యాపారం పెరిగి ఏదో నాలుగు రాళ్లు మిగిలాయి గనుక సరిపోయింది లేకుంటేనా....

ఇప్పుడు వీడు రెండులక్షలు తగలేశాడు.... అందర్నీ మంచివారిగా భావించే మాకు మంచే జరుగుతోంది. నిజంగా ఆ ముండ ఇండియా వచ్చి పదిహేను లక్షల డాలర్లు ఇస్తే మంచిదే లేకుంటే కనీసం మా రెండులక్షలైనా మాకు ఇస్తుందా?

ఇవ్వదంటే ఇవ్వదు తల్లీ, ఆ తెల్లదొరసాని కుందేటి కొమ్ములాంటిది. అయినా గోడకు కొట్టిన సున్నము, మోసగాడికి ఇచ్చిన సొమ్మును తిరిగి తీసుకోగలమా? కొన్ని సంవత్సరాల క్రితం పత్రికల్లో కొన్ని రకాల ప్రకటనలు వచ్చేవి. కరాచీకి ఎగుమతి కావాల్సిన వస్త్రముల ఆర్డరు అక్కడి అల్లర్ల కారణంగా రద్దయినది, అందువలన ఆ వస్త్రాలను అమ్ముతున్నాము. వెయ్యి రూపాయల చీర కేవలం రెండువందలు మాత్రమే. ఇలాంటివి పాతబడిన తరువాత భాగస్వాముల మధ్య విభేదాల కారణంగా వస్త్రములను తెగనమ్మి సొమ్ము చేసుకోవాలని నిర్ణయించినందున వందరూపాయలకే పది చీరలు. మార్కెట్‌లో ఆర్థిక మాంద్యం ఉంది ఇప్పుడుకొత్తవి తయారు చేయాల్సి ఉన్నందున గోడౌన్ల కోసం పాత స్టాకును వదిలించుకొనేందుకు అయిన కాడికి అమ్మేస్తున్నాం అని చెబుతున్నారు. కాలానుగుణ్యంగా మోసాలు కూడా కొత్త రూపాలు సంతరించుకుంటున్నాయి.సెల్‌ఫోన్, ఇంటర్నెట్ రోజులు కనుక మోసాలు కూడా వాటితోనే జరుగుతున్నాయి.

నా వయస్సు 24, ఒంటరి దాన్ని నా తండ్రికి ర్వాండా దేశంలో కాఫీ తోట ఉంది. బంగారం వ్యాపారం చేసేందుకు అబిడ్జాన్-కోట్ డిల్వాయిర్ వెళ్లి అక్కడ ఆకస్మికంగా మరణించాడు. అక్కడి ఒక బ్యాంకులో ఐదులక్షల డాలర్లు డిపాజిట్ చేసినట్లు అంతకు ముందు నాతో చెప్పారు. ఇప్పుడు దాన్ని తీసుకోవాలంటే స్నేహితుడు లేదా భర్త అవసరం. మీరు మంచివారని నమ్మి మీకు రాస్తున్నాను. మీరు సాయం చేయగలరా? అందుకు మీరు ఎంత తీసుకుంటారో చెప్పగలరు.

ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్నుంచి ఆదుకొనేందుకుగాను ఐక్యరాజ్యసమితి నిధుల నుంచి బాగా నష్టపోయిన వారికి ఐదులక్షల డాలర్లను ఇవ్వాలని నిర్ణయించినట్లు సెక్రటరీ జనరల్ బాన్ కీ మూన్ బరాక్ ఒబామా పేరుతో ఉన్న ఒక సంస్థకు లేఖ రాశారు. నిజానికి అది కొంతమందికి మాత్రమే పరిమితం అయితే ఆ సంగతి తెలియక ఆ ఇమెయిల్‌ను ప్రపంచానికంతటికీ పంపారు. అయితే అందరికీ ఇవ్వటం సాధ్యపడదు కనుక దాదాపు వందదేశాల నుంచి లాటరీ ద్వారా కొందరిని ఎంపిక చేశారు. వారిలో మీరూ ఒకరు కనుక మీరు ఈ దిగువ చిరునామాకు వెంటనే వర్తమానం పంపితే మీకు ఒక ఏటిఎం కార్డు పంపుతాము. గరిష్ఠంగా ఇరవైవేల డాలర్లు మాత్రమే మీరు తీసుకోవాలి.

నేను ఆ మధ్య గ్రీస్‌లోని ఒక బ్యాంకు తనిఖీకి వెళ్లాను అక్కడ లెక్కల్లో చూపని సొమ్ము 45.5 మిలియన్ డాలర్లు ఉన్నట్లు తేలింది. అయితే ఇది అమెరికాకు చెందిన ఒక వృద్ధుడి ఖాతాలోనిదని, అతను మరణించాడని తెలిసింది. ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలియపరచదలచలేదు. ప్రభుత్వానికి అప్పగిస్తే పనికిమాలిన పథకాలకు ఖర్చు చేస్తారని మీకు తెలిసినదే. నేను బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడాను. నమ్మకమైన విదేశీయుడు దొరికితే ఆ సొమ్మును బదిలీ చేసి ఖాతాదారు వారసులకు చెల్లించవచ్చని చెప్పారు. మీతో మొహమాటం ఎందుకు మీకు దీనిలో ఎంతకావాలో చెప్పండి. ఖర్చుల పేరుతో మనం పదిశాతం వరకు ఆ సొమ్ములో తీసుకోవచ్చు. ఈ వ్యవహారాన్ని మీరు అత్యంత రహస్యంగా ఉంచాలి.

ఇలాంటి ఇ మెయిల్స్ ఈ మధ్య పుంఖాను పుంఖానులుగా వస్తున్నాయి. తస్మాత్ జాగ్రత్త !!

- సత్య

స్ఫూర్తి

టి. సాగర్,
సి.పి.ఎం.రాష్ట్రకమిటీ సభ్యులు.

గర్జించిన శ్రామిక సింహం 'ఉక్కుపాదం'

అరుణపతాక నీడలో నిరంతరంగా కార్మిక, కర్షక, పీడిత తాడిత ప్రజల కష్టాల విముక్తి కోసం పోరాటం కొనసాగిస్తూ, సమాజ చైతన్యం కోసం, ఉద్యమ వ్యాప్తి కోసం మార్క్సిస్టు కార్యకర్తగా పని చేయడానికి ప్రతి క్షణం మెదడులో లక్షలాది కదలికలు కలిగించడానికి ఇలాంటి సిరా చుక్కలు ప్రతి కార్యకర్తకు అవసరం.

ఈ పుస్తకం చదివిన తర్వాత రెట్టింపు ఉత్సాహంతో పని చేయడమే కాదు. పూర్తికాలం కార్యకర్తగా దృఢంగా నిలబడాలని, కష్టాలు వచ్చినా, ఓటమి సంభవించినా నిలబడగలిగే స్థైర్యాన్నిచ్చింది.

1997 నుండి రాష్ట్ర స్థాయిలో విద్యార్థి, యువజన సంఘాల్లో వివిధ బాధ్యతలు నిర్వహించాను. ఈ స్ఫూర్తితోనే ఎవరైనా కార్యకర్త కొద్దిగా నిరుత్సాహంగా కనిపించినా 'ఏ పుస్తకాలు చదువుతున్నావు? ఉక్కుపాదం, ఉదయగీతిక, ఎర్రమందారాలు చదివావా? చదవకపోతే మరోసారి చదువు' అని చెబుతుంటాను.

నేను రాష్ట్ర కార్యకర్తగా పనిచేసేటప్పుడు జిల్లా స్థాయిలో స్టడీ క్యాంపులు నిర్వహించేవాళ్లం. ఈ సందర్భంగా 'ఉదయ గీతిక' పుస్తకం లిస్టులో తప్పక వుండేది. అస్సాంలో జరిగిన ఎస్.ఎఫ్.ఐ ప్రత్యేక మహా సభలకు వెళ్తున్నప్పుడు ఎక్కువ మంది డెలిగేట్స్‌తో మాట్లాడాను. నేనడిగిన ప్రతి ఒక్కరు నేను చదివాను, ఇంకొకరికి ఇచ్చానని చెప్పినప్పుడు నాకు చాలా సంతోషమనిపించింది. ఈ కాలంలో విద్యార్థిరంగంలో 127 మంది పూర్తికాలం కార్యకర్తలుగా వచ్చారు. మనం చేసిన ప్రయత్నం ఉపయోగపడిందనిపించింది.

ప్రాథమిక విద్యాభ్యాసం నుండే వామపక్ష ఉద్యమాల పట్ల ఆకర్షితుణ్ణి అయ్యాను. అందుకు పుట్టిన గ్రామ (మహబూబ్‌నగర్‌జిల్లా, నారాయణ పేట మండలం, కోటకొండ గ్రామం) వాతావరణం కారణం. నేను ఐదవ తరగతి చదువుతున్నప్పుడు.... ఒకరోజు రాత్రి గ్రామంలో బహిరంగ సభ జరిగింది. మా అన్నలతో కలిసి వెళ్లాను. తీరా అక్కడికి వెళ్లేసరికే ఆర్.ఎస్.ఎస్ మూకలు బహిరంగ సభమీద లాఠీలతో దాడి చేశాయి. దాన్ని ఎదుర్కోవడానికి గ్రామంలోని చాలామంది యువకులు లాఠీలతోనే సిద్ధమయ్యారు. దాడికి వచ్చిన వారిని తరిమికొట్టి బహిరంగసభను విజయవంతంగా నిర్వహించారు. "విప్లవం వర్ధిల్లాలి","మతోన్మాద కుక్కల్లారా! ఖబడ్దార్" అనే నినాదాలు అప్పుడే విన్నాను.

7వ తరగతిలో వుండగా గ్రామంలో జిల్లా స్థాయి విద్యార్థి సంఘ కార్యకర్తలకు శిక్షణా తరగతులు జరిగాయి. అక్కడ వాలంటీర్‌గా పనిచేశాను. ఆ తర్వాత సంవత్సరానికే వామపక్ష భావాలుగల విద్యార్థులతో భగత్‌సింగ్ యువజన సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నాం. ఆ సందర్భంగా నా అభిప్రాయాన్ని కూడా తీసుకున్నారు. సంఘంలో పని చేయడం వరకు సమ్మతించాను. పూర్తిగా పని చేయడానికి మాత్రం 10వ తరగతి అయిన తర్వాతనే అని చెప్పాను. 9వ తరగతి చదువుతున్నప్పుడే యువజనసంఘం గ్రామ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నాను. అప్పుడు మూడు ప్రధానమైన కార్యక్రమాలు నిర్వహించాము. 1. రాత్రి బడి నిర్వహించడం, 2. శ్రమదాన కార్యక్రమం చేపట్టడం, 3. గ్రామ భూస్వామికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం.

మా ఊరి ప్రధాన రోడ్డు సరిగ్గా వుండేదికాదు. ప్రజల సహకారంతో 15 ఎడ్లబళ్లతో మట్టి తీసుకొచ్చి రోజంతా శ్రమించి ఆ పని పూర్తి చేశాం. గ్రామ భూస్వామితో సంబంధం లేకుండా నిర్వహించిన మొట్టమొదటి కార్యక్రమం అది. ఆ దశలోనే పుస్తకాలవైపు దృష్టి మళ్ళించారు. ఇందుకు ప్రధాన కారణం ఇద్దరు. ఒకరు మా ప్రాంతానికే వామపక్ష ఉద్యమాన్ని పరిచయం చేసిన దామోదరరావు (అడ్వకేట్), తర్వాత మాకు విద్యనందించిన, స్వంతంగా లైబ్రరీ నిర్వహిస్తూ ప్రోత్సహించిన రామకృష్ణ పంతులు. చార్వాక, నాస్తికయుగం పత్రికలు చదివించేవారు. నేను చదివిన మొదటి పుస్తకం మాత్రం "జైలు" అనే చతుర నవల. ఆ తర్వాత "లెనిన్ జీవిత చరిత్ర" చదివాను.

10వ తరగతి చదువుతున్న సమయంలోనే ఈ భావాలు కలిగిన వారందరు పి.డి.ఎస్.యు విద్యార్థి సంఘంలో చేరితే మంచిదని నిర్ణయించారు. 1989లో పి.డి.ఎస్.యు 9వ రాష్ట్ర మహాసభలకు (హైదరాబాద్ సంఘం థియేటర్లో) ప్రతినిధిగా హాజరయ్యాను. వేసవి సెలవుల్లో మూఢనమ్మకాలకు, అంటరాని తనానికి వ్యతిరేకంగా గ్రామాల్లో ప్రచారం నిర్వహించాం (భగత్‌సింగ్ యువజన సంఘంగా). మా గ్రామంతో పాటు చుట్టు పక్కల 10 గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించాము. చివరి రోజు మా గ్రామంలో పాటలు పాడుతూ ప్రచారం నిర్వహిస్తుండగా ఆర్.ఎస్.ఎస్ వారు గొడవకు దిగారు. గ్రామ భూస్వామి ప్రోత్సాహం, పలుకుబడితో అంటరానితనానికి వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తే మాపై (12మంది) అట్రాసిటీ చట్టం కింద అక్రమ కేసు బనాయించారు. ఫలితంగా పోలీస్ స్టేషన్లో దెబ్బలు తినడం - బేడీలతో కోర్టుకు తీసుకెళ్లడం జరిగాయి. భూస్వామిని ఎదిరించి నిలబడడం కష్టం. ఇక సంఘం లేదు, ఏమీ లేదు అనే చర్చ జరిగింది. కానీ మేము బెయిల్ తీసుకుని వస్తూనే గ్రామంలో నినాదాలు చేస్తూ - ప్రదర్శన సభ జరిపాము. కొద్దిమంది భయపడి, ఊగిసలాడినా సంఘం కొనసాగింది.

మహబూబ్ నగర్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్నా గ్రామంలో కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో పంచాయతీలో జరుగుతున్న అవినీతిపై ప్రశ్నించడం- అధికారులకు మెమోరాండాలు ఇవ్వడం వంటివి జరిగాయి. ఎలాగైనా సంఘం లేకుండా చేయాలని భావించిన భూస్వామి మేము రాసిన గోడరాతల్ని ఆసరా చేసుకుని గ్రామంలో నక్సలైట్లు ఉన్నారని పోలీసులకు చెప్పాడు. పోలీసులు గ్రామంలోకి వచ్చి మా కోసం వెతికారు. అందరం గ్రామం నుండి వెళ్లిపోయాం. అందువల్ల మాకు పాఠాలు నేర్పిన రామకృష్ణ పంతులును బెదిరించి వెళ్లారు పోలీసులు. మేము ముఖ్యులం 8 రోజులు గ్రామంలోకి రాకుండా వెళ్లాం. దీనితో భూస్వామికి భయం పట్టుకుంది.

నిజంగానే నక్సలైట్ల దగ్గరకు వెళతారేమోనని. మా తల్లిదండ్రులను, రామకృష్ణ పంతులును బతిమిలాడి "కేసులు ఏమీ పెట్టించం. సంఘం పిల్లల్ని గ్రామానికి రమ్మనండి" అని కబురు పెట్టారు. ఆ తర్వాత వచ్చాము. మాపై పెట్టిన కేసు వాయిదాలకు హాజరవుతున్నాము. నేను ఒక్కడినే (రూల్ 37 ద్వారా) కేసుకు అటెండ్ అవుతున్నాను. సాక్షులు సాక్ష్యం చెప్పారు. మా అడ్వకేట్ (మా ప్రాంతానికి వామపక్ష భావజాలాన్ని పరిచయం చేసిన దామోదర్‌రావు గారే మా అడ్వకేట్) రాలేదు. సాక్షుల్ని క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తావా? అన్నారు మెజిస్ట్రేట్. ఇప్పుడు క్రాస్ ఎగ్జామినేషన్ చేయకపోతే సాక్షుల్ని మళ్లీ పిలిపిస్తారేమోనని అందుకు అంగీకరించాను. నేను క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తుంటే బి.జె.పి న్యాయవాదులు సాక్షుల తరపున చెప్పే ప్రయత్నం చేశారు. సీనియర్ న్యాయవాదులు నన్ను ప్రోత్సహించారు. మా కార్యక్రమమే అంటరాని తనానికి వ్యతిరేకంగా చేశామని వాదించాను. చివరికి "యాలరో ఈ మాదిగ బతుకు" పాటను కోర్టులో పాడాము. కేసు కొట్టేశారు. ఇక్కడ మెజిస్ట్రేట్ అడిగిన వెంటనే అంగీకరించడానికి కారణమేమిటంటే నేను అప్పటికే "ఫాసిస్టు కోర్టులో డిమిట్రోవ్ సింహగర్జన", భగత్ సింగ్ గురించి చదివి వుండడమే.

ఈ కాలంలో "ఎక్కడికీ ప్రస్థానం, అసమర్థుని జీవయాత్ర, ఉదయగీతిక, ఉప్పెన, ఎర్రమందారాలు, ఇంద్రధనస్సు, చిరస్మరణ, రాకాసికోన, విముక్తి" నవలలు చదివాను. మిత్రుడు శేషాద్రి రంగనాయకమ్మ పుస్తకాలు ఎక్కువగా తీసుకొచ్చేవారు. అతని వల్ల 'జానకి విముక్తి' నవల 3భాగాలు అప్పుడే చదివాను. వ్యక్తిగత జీవితంలో ఏరకంగా మెలగాలి? వ్యక్తిగత విలువలు - స్త్రీల పట్ల ఎలా వ్యవహరించాలి అనే విషయాలు నేర్చుకోవడానికి బాగా తోడ్పడింది. హిమజ్వాల గారి ప్రోత్సాహంతో సి.పి.ఐ - సి.పి.ఎం - ఎం.ఎల్ పార్టీల మధ్య ఉన్న తేడాలు తెలుసుకోవడంలో సరియైన దారి నిర్ణయించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అనేక పుస్తకాలు బుక్‌లెట్స్ చదివాను.

మా ప్రాంతంలోనే సి.పి.ఎం విద్యార్థి రంగంలో పనిచేస్తున్న క్రమంలో ఉద్యమంలో స్తబ్ధత (1996) ఏర్పడింది. ఏం చేయాలి? ఎలా చేయాలి? అని ఆలోచిస్తూ నిరుత్సాహంగా ఉన్నప్పుడు పుస్తకాలు బాగా ఉపయోగపడతాయనే భావన నాకు ఉంది. అందునా నవలలు బాగా వుపయోగపడతాయనే వుద్దేశ్యం వుంది. ఎందుకంటే గతంలో రెండు సార్లు జైల్లో ఉన్నప్పుడు పుస్తకాలు తెప్పించుకుని చదివాను. అందుకే ఉన్న నవలల్లో "ఉక్కుపాదం" చదివాను. నాకు ఈ నవల పునరుత్తేజం ఇచ్చింది. ఈ నవల సైద్ధాంతిక, రాజకీయ నవల కావడం - జాక్‌లండన్ దాన్ని వర్ణించిన తీరు, హీరో ఎర్నెస్ట్ ఆత్మస్థైర్యం. ఒక్కడే పెట్టుబడిదారీ ఏజెంట్లను ఎండగట్టడం, వారు నిర్వహించిన మీటింగ్‌లోనే వారి ముఖాల్లో నెత్తుటి చుక్క లేకుండా చేయడం, వారి ముఖాల్లో రంగులు మారేటట్లు చేయడం నాకు బాగా నచ్చాయి. రచయిత జాక్‌లండన్ తన స్వీయ అనుభవాను హీరో ఎర్నెస్ట్ రూపంలో చెప్పినట్లుంటుంది. కాబట్టి ఇది కల్పిత నవల కంటే వాస్తవాల్ని ప్రతిబింబించినట్లనిపించింది.

హీరో ఎర్నెస్ట్ ధన స్వామ్యంపై గెలుపుకై అధికారం శ్రామిక వర్గం కైవసం చేసుకోవడం మార్గంగా చెబుతారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు అతను చెప్పిన సమాధానం ఇలా ఉంటుంది.

"మీరు మా నుంచి తప్పించుకోలేరు. మీరు చరిత్ర సరిగ్గానే చదువుతున్నారు. చరిత్ర ప్రారంభం నుంచి కూలీలు బురదలోనే వున్నారు. నిజమే మీరు, మీ వాళ్లు, మీ వారసులని అధికారంలో ఉన్నన్నాళ్లూ కార్మిక వర్గం బురదలోనే గడుపుతున్నారన్నది కూడా నిజమే...

అధికారమే ఇప్పుడూ, ఎప్పుడూ నిర్ణయాత్మకమైనది. ఇది వర్గ పోరాటం. మీ వర్గం భూస్వామ్య వర్గాన్ని కూలదోసినట్టే. మా శ్రామికవర్గం, మీ వర్గాన్ని కూలదోస్తుంది. నేను చెప్పే చరిత్రగతి అనివార్యం. ఇదంతా జరగడానికి ఒక సంవత్సరం పడుతుందా? వెయ్యేళ్లు పడుతుందా? అన్నది ముఖ్యం కాదు. మీ వర్గం పతనం కావడం తథ్యం" అని.

సోషలిస్టులు అంటే... హేతు విరుద్ధమైన ఈ ప్రస్తుత వ్యవస్థను కూలదోసి, హేతువాద పునాదితో భవిష్యత్ వ్యవస్థను నిర్మించాలనుకునే విప్లవకారులే సోషలిస్టులు అని చెప్పాడు.

పెట్టుబడిదారి వ్యవస్థ నిజస్వరూపాన్ని వివరిస్తూ 'మన సంఘవ్యవస్థ అంతా పరస్పర దోపిడీ మీదే ఆధారపడింది' అంటాడు. ఇలా పెట్టుబడిదారులు తమ వ్యాపారంలో ఓ పనంటూ చెయ్యాలనుకున్నప్పుడు ఆ ప్రత్యేకమైన పనిని మతపంగారో, సైన్సు పరంగానో, నైతికంగానో లేదా వేదాంతపరంగానో రైటేనని ఎందుకు నిర్ధారణ చేయిస్తారు. ఎటువంటి ధార్మిక, తాత్విక సిద్ధాంతాలైనా తమకు అనుకూలంగా మలుచుకోగల కృతక, కుహనా సిద్ధాంతులు వీళ్లు. మానవతను గురించి, సంఘాన్ని గురించి ఓనమాలు కూడా తెలియని వీళ్ల లక్షలాది క్షుధితులు, కోట్లాది కష్టజీవుల అదృష్టాలను నిర్ణయించడానికి కూర్చుంటారా? పగ తీర్చుకునే సమయం వచ్చినప్పుడే చరిత్ర వీళ్లను చూసి పగలపడి నవ్వుతుంది".

ఎర్నెస్ట్ బలమైన వ్యక్తిత్వం, మేధస్సు, చర్చతో, హేతువాదబద్ధమైన వాదనతో పెట్టుబడిదారి వ్యవస్థపై గెలుపు సాధించడం నాపై ప్రగాఢమైన ప్రభావాన్ని చూపించాయి. విప్లవంలో, ఉద్యమంలో, కార్మిక వర్గ పోరాట నిర్మాణంలో హేతుబద్ధత, మేధస్సు ప్రాముఖ్యతను, ఆవశ్యకతను నొక్కి చెబుతుంది.

శ్రామికవర్గ తుదిపోరును కొనసాగించటానికి ప్రేరణ కలిగిస్తూ ఎర్నెస్ట్ ఇలా అంటాడు... మన భవిష్యత్తును మనం చేజేతులా జారవిడుచుకోవద్దు. అది మనది. మన స్వంతం. ధనికస్వామ్యం నశించక తప్పదు. వర్గ సమాజాల్లోని అన్ని ప్రభుత్వాలు నశించినట్లుగానే అది కూడా నశిస్తుంది. అన్యాయపరులు, అధర్మ వాదులూ, అధికార మధాంధులూ అక్కడ ఉంటారు కనుక అది నశిస్తుంది. బానిసత్వమూ, భూస్వామ్య విధానమూ నశించినట్టుగానే అది కూడా నశిస్తుంది అంటాడు.

అరుణపతాక నీడలో నిరంతరంగా కార్మిక, కర్షక, పీడిత తాడిత ప్రజల కష్టాల విముక్తి కోసం పోరాటం కొనసాగిస్తూ, సమాజ చైతన్యం కోసం, ఉద్యమ వ్యాప్తి కోసం మార్క్సిస్టు కార్యకర్తగా పని చేయడానికి ప్రతి క్షణం మెదడులో లక్షలాది కదలికలు కలిగించడానికి ఇలాంటి సిరా చుక్కలు ప్రతి కార్యకర్తకు అవసరం.

ఈ పుస్తకం చదివిన తర్వాత రెట్టింపు ఉత్సాహంతో పని చేయడమే కాదు. పూర్తికాలం కార్యకర్తగా దృఢంగా నిలబడాలని, కష్టాలు వచ్చినా, ఓటమి సంభవించినా నిలబడగలిగే స్థైర్యాన్నిచ్చింది.

1997 నుండి రాష్ట్ర స్థాయిలో విద్యార్థి, యువజన సంఘాల్లో వివిధ బాధ్యతలు నిర్వహించాను. ఈ స్ఫూర్తితోనే ఎవరైనా కార్యకర్త కొద్దిగా నిరుత్సాహంగా కనిపించినా 'ఏ పుస్తకాలు చదువుతున్నావు? ఉక్కుపాదం, ఉదయగీతిక, ఎర్రమందారాలు చదివావా? చదవకపోతే మరోసారి చదువు' అని చెబుతుంటాను.

నేను రాష్ట్ర కార్యకర్తగా పనిచేసేటప్పుడు జిల్లా స్థాయిలో స్టడీ క్యాంపులు నిర్వహించేవాళ్లం. ఈ సందర్భంగా 'ఉదయ గీతిక' పుస్తకం లిస్టులో తప్పక వుండేది. అస్సాంలో జరిగిన ఎస్.ఎఫ్.ఐ ప్రత్యేక మహా సభలకు వెళ్తున్నప్పుడు ఎక్కువ మంది డెలిగేట్స్‌తో మాట్లాడాను. నేనడిగిన ప్రతి ఒక్కరు నేను చదివాను, ఇంకొకరికి ఇచ్చానని చెప్పినప్పుడు నాకు చాలా సంతోషమనిపించింది. ఈ కాలంలో విద్యార్థిరంగంలో 127 మంది పూర్తికాలం కార్యకర్తలుగా వచ్చారు. మనం చేసిన ప్రయత్నం ఉపయోగపడిందనిపించింది.

చివరిగా చెప్పేదేమంటే వామపక్ష భావాలు పరిచయం కాకపోతే నేను ఏ 10 తరగతిలోనో చదువు ఆపేసేవాణ్ణి. ఎందుకంటే మా గ్రామంలో 10వ తరగతి వరకే పాఠశాల వుంది. కాబట్టి అంతేకాక అనేక మంది ఈ రకంగానే ఆపేశారు. కర్నాటక బోర్డర్‌లో వెనుకబడిన ప్రాంతంలో మాకుటుంబంలో అంతకంటే అవకాశం లేదు. మా తర్వాత అనేక మంది పైచదువులు చవడడం కానీ, లేదా వృత్తి విప్లవకారులుగా మా ప్రాంతంలో మారడం కానీ, ఇప్పటికీ రాత్రిబడి, శ్రమదానం లాంటి కార్యక్రమాలు నిర్వహించడం కొనసాగుతున్నాయి. ★

కవిత్వమ్

ఆరని అరుణ జ్యోతి

మట్టిగుండెల సింహనాదాన్ని
ముప్పై రాష్ట్రాల కందించిన కామ్రేడా!
రైలు కార్మికుణ్ణి తెభాగా రైతును
కమ్యూనిజం వైపు కదిలించిన విప్లవ యోధా! మీకు
వందనం!
భారత ఎన్నికల మాగాణంలో గెలుపు
మొక్కల నాట్లు నాటిన మీకు
ప్రధాని కుర్చీయే స్వాగతం పలికింది!
సైద్ధాంతిక నిబద్ధుడా! సామ్యవాద ప్రేమికుడా! మీకు రెడ్
సెల్యూట్!
నిమ్నోన్నతాలెరుగని హిమోన్నతం
మీ విశిష్ట వ్యక్తిత్వం!
అందుకే అరుణారుణ భాష్పాంజలందించింది
ఆసేతు హిమాచలం!
సామ్యవాద మార్గం ఎంచి, సుఖమయ జీవితం త్యజించి
విప్లవోద్యమానికి ఊపిరులూదిన ఆదర్శ నేతా! మీకు అభివందనం!!
బడుగు జీవులకు భూసంస్కరణలలో భూములు పంచి
దేశంలోనే అగ్ర స్థానంలో ఆహారోత్పత్తులు పెంచి
అధర్మతేజాల్ని! సిద్ధార్థశంకరరేల్ని! మమత సమతల ఘీషింగ్‌ల

ఘీంకారాన్ని శంకరగిరి మాన్యాలకు
పంపిన
బాసు చతురతను తూచలేదే త్రాసు!
కొడియాడిన కష్టజీవుల హృదయాల్లో
విప్లవ వెలుగులు నింపిన జ్యోతిదాదా....
తుపాకులకు అందని జన చైతన్యాన్ని
గ్రామీణ బెంగాల్ కందించిన కామ్రేడా!!
నీ మరణం పోరు రణానికి విరామం!
ఆరిన జ్యోతితో చీకటైన రాయిటర్స్ - రైటర్స్ భవంతులు
దైవం లేని మందిరాలే! రాజులేని కోటలే!!
సాల్ట్‌లేక్‌నే కాదు సకల భారత భువిని శోకసంద్రంలో
నెట్టిన.... మృత్యువు గెలుపును క్షణికం చేస్తూ!
నీ ఆశయ - ఆలోచనా సైద్ధాంతిక ఝుంఝూ మారుతం...
విశాల భారతిని విప్లవ భారతి గావిస్తుంది!!
రోగ గ్రస్థ రాజకీయ వ్యవస్థను పరిశీలించే మీ దేహం
అరుణ పతాక రెపరెపలు తాకి తీరుతుంది-
ఎర్రకోటపై ఎర్రజెండా రెపరెప నీ నయనాలు వీక్షిస్తాయ్!!
మరణం తెలియని పోరు సమరాన్ని సదా సాగిస్తాం!!
మీ పార్థివ శరీర సాక్షిగా మీ ఆశయాల్ని కొనసాగిస్తాం!
అందుకోండి... మా ఎర్రెర్రని పోరుదండాలు!!!
అందుకోండి... మా ఎర్రెర్రని పోరుదండాలు!!!

- తంగిరాల చక్రవర్తి

విప్లవ 'జ్యోతి'కి లాల్ సలామ్

ఉద్యమాల తోటవై మొగ్గ తొడిగీ
అభ్యుదయ భావాలై వికసించీ
విప్లవ పరిమళమై విస్తరించీ
అస్తమించిన అరుణ 'జ్యోతీ'
నీకు లాల్ సలామ్

అవినీతి రాజకీయాలను వ్యతిరేకించీ
అంతరాల వ్యవస్థను ప్రశ్నించీ
రాజకీయ రంగంలో
కొత్త ఒరవడిని సృష్టించీ
సమసమాజ స్థాపనకై
పాటు పడిన ధీశాలీ
నీకు లాల్ సలామ్

పెట్టుబడిదారుల కట్టుకథల గుట్టు విప్పీ
'ఎల్పీజీ' విధానాలను తిప్పి కొట్టీ
ఎర్రజెండా నీడకింద
కార్మిక లోకాన్ని ఏకం జేసిన సవ్యసాచి
నీకు లాల్ సలామ్

భూస్వాముల దోపిడీని ఎదిరించీ
దున్నే వాడికే భూమిని పంచి
కాలే కడుపుల ఆకలి తీర్చిన అమరజీవీ
నీకు లాల్ సలామ్

మార్క్సిస్టు మహా నేతగా ఎదిగీ
వర్గపోరు దారిలోనే నడిచీ
జనం గుండె చప్పుడై విన్పించీ
ప్రజా క్షేమం కోసం పరితపించీ
ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన
అరుణ ప్రభాతమా
నీకు లాల్ సలామ్



సుత్తి కొడవలి చుక్కవై
సైరన్ మోతల చప్పుడై
జన చైతన్య దీప్తివై
స్ఫూర్తినిచ్చిన ఎర్రమందారమా
నీకు లాల్ సలామ్

నీ ఆశయాల ఆశలు
నెరవేరే వరకూ
ప్రభవించిన విప్లవ చైతన్యం
ప్రపంచమంతా
ప్రజ్వరిల్లే వరకూ
మా కలాల కవాతు
కొనసాగుతూనే వుంటుంది
మా గళాల గర్జనలు
విన్పిస్తూనే వుంటాయి
వర్గరహిత సమాజ నిర్మాణం వైపు
మా అడుగులు కదులుతూనే ఉంటాయి
అదే బాటలో పయనించీ
ఒడిదుడుకుల నధిగమించీ
విప్లవ ప్రతీఘాతుకాలకు ఎదురొడ్డీ
ప్రజా నాయకుడివై పరిఢవిల్లిన
జ్యోతి బాబూ నీకు మరోసారి
లాల్ సలామ్

-జావెద్

భూ ధృవాలు మారబోతున్నాయా?



ఇప్పుడు జరుగుతున్న మార్పులు భూమధ్య రేఖ దగ్గర ఎక్కువగా వుంటాయి. ఈ క్రమంలో ఓ శతాబ్దం పాటు అయస్కాంత శక్తి శూన్యమైపోవచ్చు. అ తరువాత అంటార్కిటికా ఉత్తరంగానూ, ఆర్కిటికా దక్షిణంగానూ మారుతుంది. అయితే అయస్కాంత శక్తి శూన్యమైనప్పుడు కాస్మిక్ కిరణాలు విచ్చలవిడిగా భూ వాతావరణంలోకి చొచ్చుకువచ్చి అనేక అవాంఛనీయ ప్రభావాలను కలిగించే ప్రమాదం వుందని అంచనా. అటువంటి ప్రమాదంలో మ్యుటేషన్లు... ఉత్పరివర్తనాలు... ముఖ్యమైనవి. కానీ ఇటువంటి మార్పు చాలా కాలం క్రితం జరగడం వల్ల అసలు ఎటువంటి ప్రభావాలు ఉత్పన్నమౌతాయో మనకు ఇదమిద్ధంగా తెలియదు.

భూమికి అయస్కాంతతత్త్వం వుందని మనకు తెలుసు. కానీ తత్త్వం మారుతూ వుంటుందని బహుశా చాలా మందికి తెలియకపోవచ్చు.

భూ అయస్కాంతతత్త్వం బలంతో పాటు దిశ కూడా చాలా నెమ్మదిగా కానీ నిరంతరాయంగా మారుతూ వుంది. ప్రస్తుతం భూమి ఉపరితలం పైన అయస్కాంత శక్తి 0.6 గాస్‌గా నమోదైంది. దీర్ఘ కాల అధ్యయనాలు ఈ శక్తి సంవత్సరానికి 0.07 శాతం తగ్గుతోందని తెలియజేస్తున్నాయి. అంటే మరో పదిహేను వందల ఏళ్ల తరువాత భూ అయస్కాంత శక్తి ఇప్పటికంటే ముప్పై అయిదు శాతం తక్కువగా వుంటుంది. నాలుగు వేల సంవత్సరాల తరువాత ఆ శక్తి సంపూర్ణంగా శూన్యమైపోతుంది.

దీనివల్ల ఎటువంటి ప్రభావాలున్నాయో చూద్దాం. భూ అయస్కాంత శక్తి సూర్యుడి నుండి వచ్చే కాస్మిక్ కిరణాల నుండి జీవావరణానికి రక్షణ ఇస్తుంది. ఒకవేళ ఆ శక్తి తగ్గినా, లోపించినా, మారినా, తద్వారా వచ్చే ఆరోగ్య సమస్యలు అవగాహనకు అందనివి.

భూ అయస్కాంత శక్తి ఒకవైపు నుండి మరొక వైపుకు మారడం భూ చరిత్రలో అనేక సార్లు జరిగింది. ఇలా ఎందుకు జరుగుతుందో సంపూర్ణంగా తెలియదు కానీ, ద్రవ రూపంలో ఉన్న భూమి పొర వల్ల అవి చూచాయగా తెలుసు. భూమి బాహ్యాపొరలలో ఒకటైన ద్రవపు పొర తిరుగుతూ వుండడం వల్ల అది ఒక భారీ విద్యుదయస్కాంతంలా పనిచేస్తుంది. దానికి తోడు, లోపలి ఘనపు పొర కూడా అయస్కాంత క్షేత్రానికి ఊతమిస్తుంది. ఒక ప్రత్యేకమైన సందర్భంలో ఈ రెండు పొరల చలనం వల్ల అయస్కాంత క్షేత్రం వ్యతిరేక దిశలో మారిపోతాయి.

ఉదాహరణకు ముప్పైవేల ఏళ్ల క్రితం ఘనీభవించిన లావా ద్వారా అప్పట్లో భూమి అయస్కాంత క్షేత్రం మరో దిశలో ఉండేదని తెలుస్తోంది. ఎందుకంటే సముద్రాల లోపల అగ్ని పర్వతాలు విస్ఫోటనం చెందినప్పుడు విడుదలైన లావాలోని ఇనుము భూమి అయస్కాంత క్షేత్ర రేఖలపైన ఘనీభవిస్తాయి. అలాగే సముద్ర తలం కూడా ఈ అయస్కాంత దిశామార్పుకి మంచి నిదర్శనాలు.

భూమి అయస్కాంత క్షేత్రం దాదాపు ప్రతి రెండు లక్షల ఏళ్లకు ఒకసారి వ్యతిరేక దిశలో మార్పు చెందుతుంది. అయితే ఈ మార్పుల మధ్య కాలంలో చాలా వ్యత్యాసాలున్నాయి. పోయిన సారి ఇలా జరిగింది ఏడువందల ఎనభై వేల ఏళ్ల క్రితం. ప్రస్తుతం మరోసారి ఇలా మారే దిశలో అయస్కాంత శక్తి మారుతూ వుంది. అప్పుడు అలా అయస్కాంత దిశలు మారినపుడు మనం వాడే దిక్సూచిలు వ్యతిరేకంగా సూచిస్తాయి.

ఇప్పుడు జరుగుతున్న మార్పులు భూమధ్య రేఖ దగ్గర ఎక్కువగా వుంటాయి. ఈ క్రమంలో ఓ శతాబ్దం పాటు అయస్కాంత శక్తి శూన్యమై పోవచ్చు. అ తరువాత అంటార్కిటికా ఉత్తరంగానూ, ఆర్కిటికా దక్షిణంగానూ మారుతుంది. అయితే అయస్కాంత శక్తి శూన్యమైనప్పుడు కాస్మిక్ కిరణాలు విచ్చలవిడిగా భూ వాతావరణంలోకి చొచ్చుకువచ్చి అనేక అవాంఛనీయ ప్రభావాలను కలిగించే ప్రమాదం వుందని అంచనా. అటువంటి ప్రమాదంలో మ్యుటేషన్లు... ఉత్పరివర్తనాలు... ముఖ్యమైనవి. కానీ ఇటువంటి మార్పు చాలా కాలం క్రితం జరగడం వల్ల అసలు ఎటువంటి ప్రభావాలు ఉత్పన్నమౌతాయో మనకు ఇదమిద్ధంగా తెలియదు.

అయితే ఒక ఆసక్తికరమైన విషయం... జీవులపై అయస్కాంత క్షేత్ర మార్పు ప్రభావం ఎలా వుంటుందనేది పక్షులు ఇంకా ఇతర జీవులు భూ అయస్కాంత శక్తినే తమ గమనానికి, వలసకు ఆసరాగా తీసుకుంటాయి. కొన్ని పక్షులైతే ఆ శక్తిపైనే ఆధారపడి వుంటాయి. అటువంటి జీవులు కచ్చితంగా ఇబ్బంది పడే అవకాశం వుంది. తికమక పడడం, దారితప్పి పోవడం, వలసలు మారిపోవడం వంటివి కనిపించవచ్చు. కానీ కొన్ని వేల ఏళ్లపాటు ఈ మార్పులు కొనసాగుతూ వుండడం వల్ల జీవులు వాటికి అనుగుణంగా మారిపోవచ్చు.

ఏది ఏమైనా భూమి తన అయస్కాంత క్షేత్రాలను మార్చుకునే సమయానికి మనం వుండకపోవచ్చు. అయినా ఈ ప్రక్రియ విశేషమైనదే కదా!

- కాకర్లమూడి విజయ్

పెంపుడు కుక్క

మూల కథ : **అలెగ్జాండర్ కుప్రిన్**

స్వేచ్ఛానువాదం : **డి.ఆర్.కె.రెడ్డి.**

లోడిజెకిన్ వృద్ధుడు. సెర్జీ ఆయన పెంచుకున్న బాలుడు. ఆర్టో వారి శునకం. ఆయనకు నాది అంటూ ఎలాంటి ఆస్తీ లేదు. బతుకుదెరువు కోసం ఊరూరా తిరుగుతూ తన వద్ద వున్న అతి పురాతనమైన తంత్రీ వాయిద్యాన్ని మీటుతూ, సెర్జీ గారడీ విద్యలతోనూ, ఆర్టో విన్యాసాలతోనూ ప్రదర్శనలిచ్చి బిచ్చమెత్తుకుని దేశాటనం చేసే దేశదిమ్మరులు.

అలా ఒకనాడు ఒక భవనం వద్దకు చేరతారు. "సెర్జీ, ఈ భవనంలో నివసించే వారు చాలా మంచివారు. మనల్ని ఆదరిస్తారు. పదండి" అంటూ ముందుకు కొన్ని అడుగులు వేశారు. ఎవరూ వారికేసి చూడలేదు. భంగపాటు తప్పలేదు. కొన్ని ఇళ్లముందు వారిని ముందుగానే పసిగట్టి తరిమికొట్టారు. కొన్ని చోట్ల తన తంత్రీ వాయిద్యాన్ని వాయించడం మొదలు పెడుతుండగానే బాల్కనీలో నుండి వ్యక్తులు అసహ్యంగా తమ అసహాయాన్ని బయటపెట్టారు. అయితే రెండు బంగళాల్లో మాత్రం తమ ప్రదర్శనలకు కొంత ముట్టింది. దాన్ని తృప్తిగా ఆ వృద్ధుడు లెక్కపెట్టి జేబులో వేసుకున్నాడు.

"సెర్జీ రెండూ, ఐదు కలిపితే ఏడు కోపెక్కులు. ఏడు ఏడు కలిపితే సగం రూబుల్ కింద లెక్క. అంతయితే గానీ, ఈ పూట మనకు, ఆర్టీకి సరిపడా తిండి దొరికినట్లు లెక్క. కానీ ఈ భవనాల్లో నివసించే వారికి అది అర్థం కాదు. ఒక ఇరవై కోపెక్కులిస్తే వారికి ఏమైతది?" అంటూ తన ఆవేదన వ్యక్తం చేశాడు.

లోడిజెకిన్ చాలా నెమ్మదైన వ్యక్తి. తనను తరిమేసినా గొణిగే రకం కాదు. అలాంటి వాడికి ఒకరోజు ఒక చేదు అనుభవమైంది. ఆనాడు చుట్టూ పూలచెట్లతో నిగనిగలాడే ఉద్యానవనం మధ్యనున్న అందమైన భవనం. ఆ భవనం ముందు తన వాయిద్య సంగీతాన్ని, సెర్జీ తన గారడీ విద్యలను, ఆర్టీ తన విన్యాసాలను ప్రదర్శించారు. ఆ భవనంలోని ఇల్లాలు ఎంతో శ్రద్ధతో, ఆనందంతో తిలకించి వారిని వుండమని చెప్పి ఇంట్లోకి వెళ్లింది. అయితే వెంటనే తిరిగి రాలేదు. కొంత కాలయాపన జరిగింది. దాంతో లోడిజెకిన్‌లో దృఢమైన ఆశలు చిగురించాయి.

సెర్జీతో "నన్ను నమ్ము. మనం అదృష్టవంతులం. ఆమె మనకు కొన్ని బట్టలు, చెప్పులు ఇస్తుంది. అది గ్యారెంటీ" అని అంటాడు. ఆఖరుకు ఆ ఇల్లాలు బయటికి వచ్చి, సెర్జీ ముందుకు చాపిన టోపీలో ఒక తెల్లని చిన్న నాణేన్ని విదిల్చి వెంటనే లోపలికెళ్లిపోయింది. ఆ నాణెం పది కోపెక్కుల విలువ కలది. రెండు వైపులా బాగా అరిగిపోయి, మధ్యలో రంధ్రం వున్న నాణెం. ఆ వృద్ధుడు ఆశ్చర్యంతో దానికేసి చూస్తూ చాలాసేపు నిలబడిపోయాడు.

"ఎంత మోసం. మనకే దాన్ని ఇవ్వాలా? ఈ పనికిరాని దాన్ని మనం ఏం చేయాలి? మనం కూడా రాత్రి పూట చీకట్లో ఎవరో ఒకరికి ఇచ్చి మోసపుచ్చాలని ఆమె అనుకుని వుంటుంది. ఛ, ఆమె నన్ను తప్పుగా అర్థం చేసుకుంది. లోడిజెకిన్ అలాంటి వాడు కాదు అంటూ "తీసుకో ఈ అమూల్యమైన పది కోపెక్కుల నాణెం" అని రోడ్డు పక్క మట్టిలో పూడ్చిపెట్టాడు.

ఆ విధంగా వారు అన్ని భవనాల చుట్టూ తిరిగి ఆఖరుకు ఇంకొక భవనం ముందుకొచ్చారు. విశాలమైన పూలతోటల మధ్య వున్న ఆ భవనానికి ముందు ఒక గేటు వుంది. ఆ గేటు మధ్యలో "స్నేహపూర్వక భవనం" అంటూ ఒక ప్లేటుపై చెక్కి వుంది.

"స్నేహం ఎంత మంచి పదం. ఇంతవరకు మనకు అదృష్టం కలగలేదు. ఇప్పుడు అదృష్టం కలిసి వచ్చింది. సెర్జీ, ఆర్టో లోపలికి పదండి" అంటూ ఆ వృద్ధుడు పురమాయించాడు.

ఆ భవనం ముందు సెర్జీ తన గొంగళిని పరిచాడు. ఆ ముసలాయన తన వాయిద్యాన్ని వాయించేందుకు తయారయ్యాడు. అప్పుడే వారు అనుకోని ప్రతిబంధకం ఏర్పడింది. అకస్మాత్తుగా ఒక బాలుడు గొంతు సవరించుకుని అరుస్తూ వరండాలోకి వచ్చాడు. ఆరుగురు ఒక్కసారిగా ఆ బాలుని వైపు పరిగెత్తుకుంటూ వచ్చారు. వారిలో ఇద్దరు మహిళలు వున్నారు. ఒకామె చాలా అందంగా వుంది. ఆ పిల్లవాడు ఏడుస్తూనే నేలపై అటూ ఇటూ దొర్లుతున్నాడు.

అంతలోనే "ఈ మందు తాగు బాబూ. చాలా తీయగా వుంటుంది. లెగుబాబూ" అంటూ ఒక సేవకుడు బతిమాలుతున్నాడు. సేవకురాళ్లు భయంతో గుసగుసలాడుకుంటున్నారు. బంగారు కళ్లద్దాల యజమాని ఆ పిల్లవాణ్ని పైకి లేపేందుకు ప్రయత్నిస్తున్నాడు. తల్లి ఏడుపు ముఖంతో సిల్కు చేతిగుడ్డతో కళ్లద్దుకుంటూ వుంది.

"ట్రిల్లీ! మా బుజ్జివి కదూ! లే నాయనా! ఒక బంగారు నాణెం ఇమ్మంటావా? రెండు లేక ఐదు కావాలా? చెప్పు బుజ్జీ" అంటూ సేవకుడు బతిమాలాడు. అయినా ఆ పిల్లవాడు తన పాదాలతో దగ్గరికొచ్చిన వారందరినీ తన్నడం మొదలెట్టాడు.

ఈ దృశ్యాన్ని చాలాసేపు వింతగానూ, ఆశ్చర్యంగానూ గమనిస్తూ వచ్చిన సెర్జీ నెమ్మదిగా తాత నడుం గిల్లి "ఆ పిల్లవాడికేమైంది తాతా? వాణ్ణి కొట్టారా?" అని అడిగాడు.

"వాడే అందర్నీ తంతాడు. వాడు చెడగొట్టబడ్డ గుంటడు. వ్యాధిగ్రస్థుడు కూడా!" అని "మనం మొదలుపెడ్దాం" అంటూ తన తంత్రీ వాయిద్యాన్ని వాయించడం ప్రారంభించాడు.

ఆ ధ్వని చుట్టుపక్కలంతా పాకింది. వరండాలో వున్న వారందరూ ఆశ్చర్యంగా చూశారు. పిల్లవాడు కొన్ని సెకండ్లపాటు ఏడుపు ఆపాడు. "దేవుడా, మన ట్రిల్లీని వారు ఇంకా ఎక్కువ బాధపెడ్తారు. వెంటనే వారిని పంపించేయండి. పైగా ఆ కుక్కకు భయంకరమైన వ్యాధులుంటాయి. అలా విగ్రహం లాగా నిలబడతావేంటి ఇవాన్?" అంటూ యజమానురాలు చీవాట్లు పెట్టింది.

"ఏంటిదంతా? మిమ్మల్ని ఎవరు లోనికి రానిచ్చారు? వెంటనే వెళ్లిపోండి" అంటూ ఇవాన్ హుంకరించాడు. వాయిద్య సంగీతం చప్పున ఆగిపోయింది.

"అయ్యగారూ నేను విన్నవించుకునేది వినండి" అంటూ ముసలాయన

వేడుకున్నాడు.

"మీ సంజాయిషీలు ఏమీ అక్కర్లేదు. వెళ్లండి" అంటూ వున్న ఇవాన్ ముఖం కందిపోయి కళ్లు ఎరుపెక్కాయి. అది చూసి భయపడి "సెర్జీ! పోదాం పద" అంటూ ఆ ముసలాయన బాలుని చేయి పట్టుకుని వెనక్కి కదిలాడు. వారు కొన్ని గజాలు నడుస్తూనే, వరండా నుండి పెద్దగా ఆ పిల్లవాని ఏడుపు వినిపించింది.

"నాకు అది కావాలి" అంటూ ఏడుపు లంకించుకున్నాడు. వెంటనే తల్లి భర్తతో "ఇవాన్ వాళ్లను వెంటనే వెనక్కి పిలిపించు" అనేసరికి "మీరు వెనక్కి రండి" అంటూ వరండా నుండి చాలా గొంతులు వినిపించాయి.

ఒక దుక్కలాంటి సేవకుడు పరిగెత్తి "ఆ మర్యాదస్తులు మీ ప్రదర్శనను చూడాలనుకుంటున్నారు. వెనక్కి రండి" అని బతిమాలాడాడు.

ఆ ముసలాయన తలవూపి, ఒక నిట్టూర్పు విడిచి, వరండా వరకు వచ్చి తంత్రీ వాయిద్యాన్ని వాయించడం మొదలు పెట్టాడు. సెర్జీ తన గారడీ విద్యలను ప్రదర్శించాడు. ఆర్టో తన రెండు కాళ్లపై నిలబడి తన యజమాని అందించిన టోపీని నోటితో కరుచుకొని వరండా వరకు నడిచింది. ఆ పిల్లవాని తల్లి చేతిలో ముత్యాలతో కూడిన పర్సు తళతళలాడింది. ఆమె చుట్టూవున్న వారంతా నగుమోములతో చూశారు. ముసలాయన సంతోషంతో "సెర్జీ! చూడు నేను చెప్తున్నాను. ఆమె ఒక రూబుల్ కంటే తక్కువ ఇవ్వరు" అంటాడు.

అప్పుడే కీచుగొంతుతో ఒక విధమైన గట్టి శబ్దం వరండా నుంచి వచ్చింది. "నాకు ఆ కుక్క కావాలి. నాకు అదే కావాలి" అంటూ ఆ పిల్లవాడు ఏడుపు లంకించుకున్నాడు. "ఓ ముసలాయనా, ఆ కుక్కను ఇక్కడకు తీసుకురా. భయపడకు, డబ్బులిస్తాము" తల్లి అంది.

"నేను దాంతో ఎల్లప్పుడూ ఆడుకోవాలి" అంటూ పిల్లవాడు మళ్లీ ఏడుపు ఎక్కువ చేశాడు. "నీ కుక్కను ఎంతకిస్తావు? పది, పదిహేను, ఇరవై! ఎంత?" అని అడిగింది.

"నేను కుక్కల వ్యాపారం చేయడం లేదు మహారాణిగారూ! ఈ కుక్క మాకు ఆహారాన్ని, దుస్తులను అందిస్తుంది. దాన్ని అమ్మడం అసాధ్యం" అంటూ చెప్పుకొచ్చాడు.

"నువ్వు పిచ్చివాడిలాగున్నావే! అమ్మడానికి, కొనడానికి ఏదీ అసాధ్యం కాదు. బహుశా నీ కుక్క వంద రూబుళ్లు, లేక రెండుమూడొందల రూబుళ్ల విలువ వుంటుందా? చెప్పు".

"వాళ్లకు ఆర్టో కావాలంట! సెర్జీ బయలుదేరుదాం పదా" అనేసరికి బంగారు కళ్లద్దాల వ్యక్తి "దురాశకు పోవద్దు, పది రూబుళ్లిస్తాం. అది చాలా ఎక్కువ" అంటూ చెప్పడం మొదలెట్టాడు. "సారూ మీకు ధన్యవాదాలు. నేను ఈ కుక్కను అమ్మను. ఇంకొక దాన్ని చూచుకోండి" అంటూ ముసలాయన, సెర్జీ శునకంతో వెనక్కిమళ్లాడు.

అకస్మాత్తుగా, డాక్టర్ "నీకు పాస్‌పోర్టు వుందా? అంటూ గట్టిగా అరిచాడు. ముసలాయనకు భయం వేసింది. నడక వేగం పెరిగింది.

"వాళ్లను బయటికి నెట్టివేసెయ్" అంటూ డాక్టర్ సేవకుణ్ణి ఆదేశించాడు. ఆ సేవకుడు వాళ్లను తరిమేస్తూ "మళ్లీ ఈ పక్కకు వస్తే తలకాయలు పగిలిపోతాయి" అంటూ బయటికి తోసేశాడు. వారు నది ఒడ్డుకు చేరి స్నానం చేసి విశ్రాంతి తీసుకున్నారు.

అక్కడ పిల్లవాడు తిరిగి ఏడుపు లంకించుకొని ఆ కుటుంబం మొత్తాన్ని తికమక పెట్టాడు. దాంతో వారు వాచ్‌మెన్‌ను ముసలాయన వద్దకు పంపించారు. అతన్ని చూస్తూనే ఆర్టో కోసమే వచ్చాడని లోడిజెకిన్ అనుకున్నాడు. వస్తూనే "ఆ బాబు ఆ కుక్కే కావాలని అల్లరి చేస్తున్నాడు ఎంత ధరైనా చెల్లించి కుక్కను కొనాలని యజమానురాలు చెప్పింది" అని పలికాడు.

"ఆ యజమానురాలు అలా చెప్పడం తెలివి తక్కువ, అయినా ఆమె ఎవరికి యజమానురాలు? మమ్మల్ని ఇలా వదిలేసెయ్యి" అంటూ ముసలాయన జవాబు చెప్పాడు.

"నేను కుక్కల వ్యాపారం చేయడం లేదు మహారాణిగారూ! ఈ కుక్క మాకు ఆహారాన్ని, దుస్తులను అందిస్తుంది. దాన్ని అమ్మడం అసాధ్యం"

అంతటితో ఆ వాచ్‌మెన్ వదిలిపెట్టలేదు. అక్కడే బీచ్‌లో కూర్చుని "ఆ పిల్లవానికి ఏది తోస్తే అదే కావాలంటాడు. అతని తండ్రి ఒక కోటీశ్వరుడు. రష్యా పొడవుతా రైల్వేలను నిర్మించాడు. ఆయన ఎంతైనా చెల్లిస్తాడు" అని చెప్పిన వెంటనే "అయితే ఆకాశం నుండి చంద్రుణ్ణి అయినా తెచ్చిస్తాడా?" అని అడిగిన ముసలాయన, వాచ్‌మెన్ తెచ్చిన బ్రెడ్‌ను కుక్కకు ఇవ్వాలని చేసే ప్రయత్నాన్ని పసిగట్టి "ఆ బ్రెడ్‌ను దానికివ్వొద్దు. నువ్వే తిను" అంటూ నది వద్దకు చేరాడు.

ముసలాయన, సెర్జీ తమ వద్దనున్న ఆహారాన్ని తిని పచ్చుగడ్డిలో మేను వాల్చారు. కాసేపైన తర్వాత సెర్జీ మేల్కొని ఆర్టోకోసం చూశాడు. కనిపించలేదు. తాతను లేపి 'ఆర్టో లేదు. అది వెళ్లిపోయింది.

దాన్ని మనం పోగొట్టుకున్నాం" అని చెప్పడంతో ముసలాయన గొల్లుమన్నాడు. వెదకేందుకు బయలుదేరి కొంచెం ముందుకు వస్తూనే మట్టిలో బ్రెడ్ ముక్కలు కనిపించాయి.

"వాడు ఎర వేశాడు. అది స్పష్టంగానే కనిపిస్తుంది. ఇప్పుడు మనం ఏం చేయాలి" తర్జన భర్జన పడ్డారు.

సెర్జీకి విపరీతమైన కోపం వచ్చింది. "బయలుదేరు పోదాం. అప్పటికే చీకటి పడడంతో ఒక సత్రం చేరి పడుకున్నారు. అర్ధరాత్రి సమయంలో సెర్జీ చప్పుడు కాకుండా బయలుదేరాడు. పరిగెత్తి ఆ భవనాన్ని చేరాడు. మెల్లగా గేటు ఎక్కి అవతలి వైపు దిగాడు. అంతా చీకటిగా వుంది. తోటలో నిశ్శబ్దం తాండవించింది. ఆ భవనం చుట్టూ తిరిగాడు. కిటికీల నుండి కూడా వెలుతురు రావడంలేదు.

"ఆర్టో, ఆర్టో" అంటూ కంపించే గొంతుతో పిలిచాడు. వెంటనే బాధతో నిస్పృహతో కూడిన అరుపు వినిపించింది. ఆర్టో దేన్నుంచో విడిపించుకునేందుకు ప్రయత్నం చేస్తూ వుందని అతనికి అనిపించింది.

"అరవకు! పాడుగోల!! అంటూ సెల్లార్ నుండి వాచ్‌మెన్ తలుపు తెరుచుకుని బయటికొచ్చాడు.

ఎవడో వచ్చాడనుకుని "ఎవరు వాడు! కాల్చేస్తా. పట్టుకోండి దొంగను" అంటూ అరవడం మొదలుపెట్టాడు.

అదే సమయంలో ఆర్టో గంతులేస్తూ ఒక తెల్లని బంతిలా ఒక చీకటి గది నుండి మొరుగుతూ బయటికొచ్చి పరిగెత్తింది. దాని మెడకు తాడు వేలాడుతూనే వుంది. ఆ సమయంలోనే వాచ్‌మెన్‌ను తప్పించుకునేందుకు సెర్జీ ప్రహరీ గోడ వెంట అమిత వేగంగా పరిగెడుతున్నాడు. ఎత్తైన గోడను ఎలా ఎక్కి దూకాలో అర్థం కావడంలేదు. బాగా అలసిపోయి ఒక చెట్టు కింద కూర్చొని కళ్లు మూసుకుని వుండిపోయాడు. అప్పుడే ఆర్టో తన పాదాలను నాకడంతో తను కళ్లు తెరిచి చూసి అమితానందభరితుడయ్యాడు. తప్పించుకునేందుకు మార్గాన్ని వెతకసాగాడు. తాను కూర్చున్నచోట ఎదురుగా వున్న గోడ ఎత్తు మూడు అడుగుల కంటే ఎత్తు లేదు. సంతోషంతో ఆర్టోను ఎత్తుకుని పోయి గోడపైకి చేర్చాడు. ఆర్టోకు అర్థమైపోయింది. తాను కూడా ఎక్కి కుక్కతోపాటు గోడ అవతలకు దూకాడు. గోడ లోపల తిట్ల పురాణం వినబడుతూనే వుంది. పరిగెత్తుకుంటూ ఆఖరుకు తాము వున్న స్థావరం చేరుకున్నారు. సెర్జీ తన తాతను లేపదలచుకోలేదు. అయినా ఆర్టో మాత్రం తన యజమాని ముఖమంతా ఎంతో ఆహ్లాదంగా నాకడం మొదలుపెట్టింది. దాంతో ఆ ముసలాయన కళ్లు తెరిచి ఆర్టోను దాని మెడకు వేలాడుతున్న తాడును, పక్కన శరీరమంతా కమ్ముకున్న మట్టితో వున్న సెర్జీని చూసి అంతా అర్థం చేసుకున్నాడు.

"ఎలా జరిగింది?" అని సెర్జీని అడగాలనుకున్నాడు. కానీ అప్పటికే సెర్జీ నోరు తెరిచి నిద్రాదేవి కౌగిట్లో ఒదిగిపోయాడు.

★

ఆరోగ్యం





క్యాన్సర్ మహమ్మారిని సమిష్టిగా ఎదుర్కొందాం

- డా॥కె. శివబాబు
ప్రగతి నర్సింగ్ హోమ్,
ఆర్.టి.సి.బస్టాండ్ పక్కన,
మెయిన్ రోడ్, ఎన్.హెచ్.9,
జహీరాబాద్, మెదక్.
సెల్ : 9246277022.

ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4వ తేదీని ప్రపంచ క్యాన్సర్ దినంగా పాటిస్తాం. క్యాన్సర్ మహమ్మారిపై పోరాడడానికి ప్రపంచ దేశాల్ని సన్నద్ధం చేసేందుకు, ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ, పలు అంతర్జాతీయ క్యాన్సర్ వ్యతిరేక కార్యాచరణ సంస్థలు సంయుక్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న మరణాలకు కారణాల్లో ఒకానొక ప్రధాన కారణంగా క్యాన్సర్ పరిణమిస్తోంది. క్యాన్సర్ వలన మరణాలు అంతకంతకు అధికమౌతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 2005లో 76 లక్షల మంది అంటే మొత్తం మరణాల్లో 13 శాతం మంది క్యాన్సర్‌తో మరణించారు. ఈ సంఖ్య 2030నాటికి 1కోటి 20 లక్షలకు చేరుకోవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా. ప్రధానంగా ఊపిరితిత్తులు, జీర్ణాశయం, కాలేయం, పెద్దపేగు, రొమ్ము క్యాన్సర్ల వల్ల అత్యధికంగా క్యాన్సర్ మరణాలు సంభవిస్తున్నాయి. మొత్తం క్యాన్సర్ మరణాల్లో 70 శాతం పైగా మరణాలు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సంభవిస్తున్నాయి. మొత్తం క్యాన్సర్ మరణాల్లో సుమారు 40 శాతం నివారించదగ్గవే కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో మహమ్మారిని ఎదుర్కొనేందుకు ప్రపంచ ప్రజానీకం సన్నద్ధం కావాల్సివుంది.

అందుకుగాను వ్యాధి లక్షణాలు, నిర్ధారణ, చికిత్స తదితర విషయాల పరిజ్ఞానాన్ని విస్తృతంగా ప్రజలలోకి వ్యాప్తి చేయాల్సి వుంది. ఈ సందర్భంగా క్యాన్సర్ గురించిన కొన్ని విషయాలు తెలుసుకుందాం.

క్యాన్సర్ అంటే ఏమిటి?

శరీరంలో ఏ భాగాన్నైనా ప్రభావం చేయగల వ్యాధుల సమూహాన్నే క్యాన్సర్ అని పిలుస్తున్నాం. దీన్నే మాలిగ్నంట్ నియోప్లాజమ్ అనికూడా అంటాం. మన శరీరంలో అవయవాలన్నీ ఆయా సంబంధిత కణాలతో నిర్మితమైవుంటాయి. ఏ అవయవంలోనైనా అసాధారణ కణాలు ఏర్పడి, అవి అతివేగంగా విభజించబడి, వాటి మామూలు పరిధులకు మించి అసంఖ్యాకంగా పెరిగి పరిసర అవయవాల్లోకి చొరబడి శరీరంలోని మిగతా అవయవాలకు కూడా వ్యాపించడం క్యాన్సర్ వ్యాధి ప్రాథమిక లక్షణంగా చెప్పుకోవచ్చు. శరీరంలోని మిగతా అవయవాల్లోకి వ్యాపించడాన్నే మెటాస్టేసిస్ అంటాం. క్యాన్సర్ వల్ల కలిగే మరణానికి ఈ మెటాస్టేసిస్ అనేది ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు.

క్యాన్సర్ దేనివల్ల వస్తుంది?

క్యాన్సర్ ఒక కణంలో మొదలవుతుంది. ఒక సాధారణ కణం క్యాన్సర్ కణంగా దశలవారీ మార్పు చెందుతుంది. ఈ మార్పులు ఆ వ్యక్తి జన్యుపరమైన కారకాలకూ, ఈ కింద చెప్పిన బాహ్యకారకాలకూ మధ్య జరిగే పరస్పర చర్యలతో మొదలవుతాయి.

భౌతిక కారకాలు : అల్ట్రావయొలెట్, అయొనైజింగ్ కిరణాలు

రసాయన కారకాలు : ఆస్బెస్టాస్, పొగాకు, అఫ్లాటాక్సిన్ (ఆహారసంబంధ కాలుష్యం), ఆర్సెనిక్ (తాగునీటి కాలుష్యం).

జీవ సంబంధ కారకాలు : కొన్ని రకాల వైరస్, బ్యాక్టీరియా లేదా పరాన్న జీవుల ఇన్‌ఫెక్షన్లు.

కొన్ని రకాల క్యాన్సర్‌తో సంబంధం కల్గిన ఇన్‌ఫెక్షన్లు

వైరస్ : హెపటైటిస్.బి - లివర్ క్యాన్సర్, హెచ్.పి.వి - సెర్వైకల్ క్యాన్సర్, హె.ఐ.వి - కపోసి సార్కోమా

బ్యాక్టీరియా : హెలికోబాక్టర్ పైలోరి - జీర్ణాశయ క్యాన్సర్.

పరాన్న జీవులు : సిస్టసోమియా - మూత్రాశయ క్యాన్సర్.

వృద్ధాప్యం అనేది క్యాన్సర్ అభివృద్ధి చెందడానికి దారితీయగల మరొక ప్రాథమిక అంశం. వయసుతో పాటు కొన్ని రకాల క్యాన్సర్‌కు దారితీయగల రిస్క్ కారకాలు పెరగడం ఇందుకు కారణం. వయసు పెరిగేకొద్ది కణాల్లో సహజ రక్షక వ్యవస్థ క్రమంగా విఫలం చెందడం కూడా మొత్తం రిస్క్‌కు తోడవుతుంది.

పొగాకు వాడకం, మద్యపానం, ఆహారంలో పండ్లు, కూరగాయల వినియోగం తక్కువగా వుండడం, హెపటైటిస్-బి, హెపటైటిస్-సి, హెచ్.పి.వి వంటి వైరస్ ఇన్‌ఫెక్షన్లు దీర్ఘకాలం వుండడం వంటివి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో క్యాన్సర్‌కు ప్రధాన రిస్క్ కారకాలుగా వుంటున్నాయి.

ప్రత్యేకించి పొగాకు వాడకాన్ని అనేక రకాల క్యాన్సర్లతో సంబంధం కల్గిన అతి సాధారణ రిస్క్‌గా పరిగణిస్తారు. వివిధ రూపాల్లో పొగాకు వాడకం (పొగ తాగడం, పొగాకు నమలడం వంటివి)తో ఊపిరితిత్తులు, అన్నవాహిక, స్వరపేటిక, నోరు, జీర్ణాశయం, మూత్రాశయం, పెద్దపేగు, మలాశయం, కిడ్నీ, సెర్విక్స్ వంటి అవయవాల క్యాన్సర్‌కు సంబంధం వున్నట్లు అధ్యయనాలు తెలియజేస్తున్నాయి.

కొన్ని రకాల వృత్తిపనులు చేసేవారికి కొన్ని రకాల క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువగా వుంటుంది. ఉదాహరణకు తారుతో పనిచేసేవారు, ఎక్స్‌రే మిషన్లవద్ద పనిచేసేవారు, కృత్రిమ రంగుల తయారీ పరిశ్రమల్లో పనిచేసేవారు.

దీర్ఘకాలం రాపిడికి గురైన శరీర భాగాలలో క్యాన్సర్ జనించవచ్చు. ఉదాహరణకు విరిగిన దంతం అంచుతో

దీర్ఘకాలం రాపిడికి గురైన నాలుకపై క్యాన్సర్ రావచ్చు.

కొన్ని దేశాల్లో కొన్ని ప్రాంతాల్లో ఆయా ప్రాంతాల్లో నెలకొనివున్న కొన్ని అలవాట్ల వల్ల కొన్ని రకాల క్యాన్సర్లు రావచ్చు. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లోని గోదావరి, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల్లో స్త్రీ, పురుషులు చుట్ట కాలే చివర నోట్లో పెట్టుకుని పీలుస్తూ వుంటారు. దీనివల్ల వీరిలో నోటి క్యాన్సర్ ఎక్కువగా వస్తుంది.

వ్యాధి చికిత్స, సంరక్షణ

♦వ్యాధిని నియంత్రించి, జీవితకాలాన్ని పొడిగించి, మెరుగైన జీవితం గడిపేలా చేయడం చికిత్స ప్రధాన లక్ష్యం. రొమ్ము క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్, పేగు క్యాన్సర్ వంటి క్యాన్సర్లు తొలిదశలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే నయమయ్యే అవకాశం ఎక్కువగా వుంటుంది. శస్త్రచికిత్స, రేడియోథెరపి, కీమోథెరపీలు క్యాన్సర్‌కు ప్రధానమైన చికిత్సాపద్ధతులు. సరైన చికిత్సకు కచ్చితమైన వ్యాధినిర్ధారణ ప్రామాణికం. ఇందుకు ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, మెమ్మోగ్రఫీ, సి.టి.స్కాన్, ఎండోస్కోపి వంటి ఇమేజింగ్ టెక్నిక్‌లు, మైక్రోస్కోపి, సైకాలజి, హిస్టోపాథాలజీ వంటి లేబొరేటరి టెక్నిక్స్ ఉపయోగపడతాయి.

♦90 శాతం పైగా క్యాన్సర్ రోగుల్లో నొప్పి, ఇతర సమస్యలకు ఉపశమన చికిత్స ద్వారా స్వాంతన కలుగుతుంది. దీనిని తక్కువ వనరులతో అందించేందుకు పలు పద్ధతులున్నాయి.

క్యాన్సర్‌ను ఎలా ఎదుర్కోవచ్చు?

క్యాన్సర్ కారణాలు, నివారణ, చికిత్స గురించిన అవగాహన విస్తృతమైంది. అటువంటి అవగాహనను జనసామాన్యంలో పెంపొందించడం ద్వారా క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కోవచ్చు. క్యాన్సర్ నివారణ, తొలిదశలో వ్యాధినిర్ధారణ, వ్యాధికి తగిన చికిత్స వంటి పద్ధతులను విస్తృతంగా అవలంబించాలి.

సుమారు 40 శాతం క్యాన్సర్ వ్యాధులను రిస్క్ కారకాల్ని తొలగించుకోవడం లేదా తగ్గించుకోవడం ద్వారా నివారించవచ్చు.





అలాంటి రిస్క్ కారణాలు

1. పొగాకు వాడడం
2. అధిక బరువు లేదా స్థూలకాయం కల్గివుండడం
3. ఆహారంలో పండ్లు, కూరగాయల వినియోగం తక్కువగా వుండడం
4. శారీరక శ్రమ లేకపోవడం
5. మద్యపానం
6. లైంగికంగా సంక్రమించే హెచ్.ఐ.వి. ఇన్‌ఫెక్షన్
7. పట్టణాల్లో వాయుకాలుష్యం
8. ఇళ్లల్లో వాడే ఘనరూపంలోని ఇంధనాల వల్ల ఉత్పత్తి అయ్యే పొగ

పైన పేర్కొన్న రిస్క్ కారకాల్ని వీలైనంత తొలగించుకోవడం, వైరస్ ఇన్‌ఫెక్షన్లు రాకుండా వ్యాక్సిన్ తీసుకోవడం, వృత్తి రుగ్మతల్ని నియంత్రించడం, సూర్యరశ్మికి హానికరమైన స్థాయిలో గురికాకుండా చూసుకోవడం వంటి పద్ధతుల ద్వారా క్యాన్సర్ నివారించేందుకు కృషిచేయాలి.

క్యాన్సర్‌ను ఎదుర్కొనేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్య సమితి సూచనలు

♦క్యాన్సర్ నివారణ, నియంత్రణకు మరింత రాజకీయ సంకల్పం

♦ఇప్పటికే ఉన్న వ్యాధి సంబంధిత పరిజ్ఞానాన్ని జనసామాన్యంలోకి విస్తృతంగా ప్రచారం గావించడం, నూతన పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం.

♦నివారణ, తొలిదశలోనే వ్యాధి నిర్ధారణ, చికిత్స, సంరక్షణలకోసం విధానాలను రూపొందించి అమలు చేసేందుకు ప్రపంచదేశాలు వనరులను సమీకరించడం

♦అంతర్జాతీయ, జాతీయ మరియు ప్రాంతీయ స్థాయిల్లో క్యాన్సర్‌ను ఎదుర్కొనేందుకు పనిచేసే భాగస్వామ్యం నెట్‌వర్క్‌లను అనుసంధానం చేసి విస్తృతపరచడం

♦జాతీయ, స్థానిక ఆరోగ్య సంరక్షణా వ్యవస్థల్ని బలోపేతం చేయడం

♦అభివృద్ధి చెందుతున్న దేశాలకు వ్యాధినివారణ, చికిత్సా పద్ధతులకు సంబంధించిన అత్యాధునిక సాంకేతిక సహకారం బదలాయించడం

ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా క్యాన్సర్‌పై పోరాడేందుకు ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాల్సిన కర్తవ్యం మేధావులు, ఆరోగ్యరంగంలో పనిచేస్తున్న వ్యక్తులు, సంస్థలపై వుంది. అలాగే క్యాన్సర్‌ని నివారించేందుకు ఒక సమగ్ర విధానాన్ని రూపొందించి ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వుంది. ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా అటువంటి కృషి జరగాలని ఆశిద్దాం.

✱

అభివృద్ధి చెందుతున్న దేశాలలో క్యాన్సర్ నిర్ధారణ, చికిత్స

ప్రాథమిక స్థాయి సంరక్షణ

అనుమానిత కేసుల్ని రిఫర్ చేయడం, చిన్నపాటి శస్త్రచికిత్సలు (ఉదా: సర్విక్స్ వ్రణానికి క్రయోథెరపి). పేషెంట్ సపోర్టు గ్రూపుల ఏర్పాటు, పేషెంట్లకు అవగాహన - పునరావాసం, ఆరోగ్య కార్యకర్తల శిక్షణ ప్రాథమిక స్థాయి సంరక్షణ.

ద్వితీయస్థాయి సంరక్షణ

వ్యాధి నిర్ధారణ : ఇమేజింగ్ టెక్నిక్స్ - ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, మెమ్మోగ్రఫీ, ఎండోస్కోపి.



లేబొరేటరి టెక్నిక్స్ : మైక్రోస్కోపి, సైటాలజి, హిస్టోపాథాలజి.

చికిత్స : మధ్యమస్థాయి శస్త్ర చికిత్స, కీమోథెరపి, పునరావాసం, మానసిక - సాంఘీక మద్దతు, స్వయం సహాయక గ్రూపుల ఏర్పాటు, రోగులకు అవగాహనా కార్యక్రమాలు.

తృతీయస్థాయి సంరక్షణ

వ్యాధి నిర్ధారణ : ఇమేజింగ్ టెక్నిక్స్ - ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, మెమ్మోగ్రఫి, ఎండోస్కోపి, సి.టి.స్కాన్

లేబొరేటరి టెక్నిక్స్ - మైక్రోస్కోపి, సైటాలజి, హిస్టోపాథాలజి, ట్యూమర్ మార్కర్స్, ఇమ్యునోకెమిస్ట్రి.

చికిత్స : సంక్లిష్టమైన శస్త్రచికిత్సలు, రేడియోథెరపి, కీమోథెరపి, పునరావాసం, మానసిక - సాంఘీక మద్దతు, స్వయంసహాయక గ్రూపుల ఏర్పాటు, రోగులకు అవగాహనా కార్యక్రమాలు.

సాహసం చే
అంబ

హాయ్ నేస్తాలూ! మీ ముందుకు ఇవాళ సాహసబాలలు వచ్చారు. చప్పట్లతో ఆహ్వానిద్దామా! అయినా వచ్చింది ఒకరో ఇద్దరో కాదు. ఏకంగా 21 మంది. వీళ్లలో 8 మంది అమ్మాయిలు, 13 మంది అబ్బాయిలు. 2009 జాతీయ సాహస బాలల అవార్డులు వీరికి దక్కాయి. ఈ అవార్డులను అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించిన వారికి ఇస్తారు. ప్రాణాలకు తెగించి ఏదైనా సాహసం చేయాలి. ఎవరినైనా ప్రాణాపాయం నుంచి కాపాడాలి. అప్పుడే ఇస్తారు. ఇంతకీ ఈ పిడుగులు ఏం చేశారనేగా మీ ప్రశ్న? వీరిలో

2009 సా

నాన్నతో ధోయి

మునిగిపోయేవాణ్ణి కాపాడింది

ఊ... మొట్టమొదట ఎవరి గురించి చెప్పుకుందాం! లేడీస్ ఫస్ట్ అంటారుకదా. అందుకని సాహసబాలికతో మొదలెడదాం. తన పేరు ధోయి ధోయి ఖుమంతెం. వయసు ఆరు సంవత్సరాలు. రెండవ తరగతి చదువుతోంది. వీళ్లది మణిపూర్. ఓసారి ధోయి ఓ తటాకం వైపుగా వస్తోంది. అప్పుడు ఓ చిన్నారి ఆ నీళ్లలో పడి మునిగిపోసాగాడు. వాడు వేసుకున్న రెండు చెప్పులూ నీళ్లలో తేలుతూ కనిపించాయి. నీళ్లలో బుడగల శబ్దం వినిపించసాగింది. అంతే... వెనకా ముందూ ఆలోచించకుండా దబుక్కున 5 అడుగుల లోతున్న తటాకంలోకి దూకింది ధోయి. అంతేకాదు! ఎంతో తెలివిగా నాలుగేళ్ల పసివాడిని కాపాడి ఒడ్డుకు చేర్చింది. అలా ఈ ఏడాది సాహసబాలల అవార్డు అందుకున్న 21 మందిలో స్థానం సంపాదించింది. తను పెద్దయ్యాక డాక్టర్ కావాలనుకుంటోంది. తమాషా ఏంటంటే... సాహస బాలల అవార్డు అందుకున్న వారందరిలోకి చిన్నది ధోయి.

బాంబు నుంచి రక్షించింది

మామూలుగా మనం సీమటపాకాయలు కాలుస్తుంటేనే అంత దూరం పరిగెడతాం కదా. కానీ మణిపూర్‌కి చెందిన ప్రీతి దేవికి గ్రెనేడ్ అన్నా భయం లేదు తెల్సా! ఓసారి ప్రీతి తల్లితో కలిసి తమ కిరాణా కొట్టులో కూర్చుని వుంది. సరిగ్గా అప్పుడు కొందరు దుండగులు ఒక గ్రెనేడ్‌ను ఈ షాపులోకి విసిరి పారిపోయారు. ఈ సీన్‌లో వుంటే ఎవరైనా ఏం చేస్తారు? భయంతో అరుస్తూ పారిపోతారు. కానీ ప్రీతి మాత్రం బుర్రకు పదును పెట్టింది. గ్రెనేడ్ షాపులో పేలితే అక్కడ వున్న వారందరికీ ప్రమాదం. కాబట్టి దాన్ని అక్కడినుంచి విసిరివేయాలనుకుంది. అనుకోవడమే కాదు! చేత్తో పట్టుకుని మనుషులు లేని వైపు చూచి విసిరివేసింది. ప్రీతి చేతిలోంచి పైకి ఎగిరిన కొద్ది సేపటికే అది పెద్ద శబ్దం చేస్తూ పేలింది. దాని ముక్కలు ప్రీతికి కూడా తగిలాయి. ఇప్పటికీ ఆమె రెండు మోకాళ్లలో గ్రెనేడ్ శకలాలున్నాయి. సమీపంలో వున్న కొద్ది మందికి చిన్న చిన్న గాయాలయ్యాయి. అయినప్పటికీ పాప చాలా సంతోషంగా వుంది. ప్రమాదం నుంచి అక్కడ వున్న వారిని కాపాడినందుకు ఆనందమే కదా. ఎప్పటికైనా పోలీస్ ఆఫీసర్ కావాలన్నది ప్రీతి ఆశ. కాకపోతే ప్రీతి తల్లి ఏమంటోందంటే... అవార్డు కింద ఇచ్చే డబ్బులు పాపకు ఆపరేషన్ చేయించడానికి కూడా సరిపోవు. అధికారులను అడిగాం కానీ సమాధానం రాలేదు అని. ప్రతిఫలం ఆశించకుండా చిన్నారి చేసిన సాహసం చూసైనా అధికారుల మనసు కరగలేదు. ప్చ్...!!

కాపాడబోయి... కనుమరుగైపోయె

ఉత్తరప్రదేశ్‌కు చెందిన దీపక్ కుమార్ కోరి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఎందుకంటే ప్రమాదంలో వున్న పాపను కాపాడబోయి తన ప్రాణాలనే కోల్పోయాడు. ఓసారి ఒక పాప నీళ్లల్లో మునిగిపోవడం చూశాడు దీపక్. ఎలాగైనా సరే కాపాడాలన్నదే ఆ పిడుగు మనసులో పడింది. వెంటనే జలాశయంలోకి దూకేశాడు. కానీ నీళ్లు బాగా లోతుగా వున్నాయి. దాంతో పాపను బయటికి లాగలేకపోయాడు. ఇదంతా జనాలు చుట్టూ గుమిగూడి చూస్తుండగానే జరిగిందంటే కూసింత ఆశ్చర్యం కలగకమానదు. పెద్దపెద్ద వాళ్లంతా అలా సినిమాలా చూస్తూ వుంటే... పన్నెండేళ్ల తన కుమారుడు పాపను కాపాడడానికి ప్రయత్నించినందుకు దీపక్ తల్లి ఊర్మిళా దేవి గర్వపడుతోంది. దీపక్ చేసిన సాహసం ఎప్పటికీ నిలిచివుంటుందని గర్వంగా చెప్తోంది. ఇదే రాష్ట్రానికి చెందిన రాణు మిశ్రా కూడా నీళ్లలో మునిగిపోతున్న వారిని కాపాడబోయి ప్రాణాలను కోల్పోయింది. వీరిరువురూ మరణానంతరం సాహస బాలల అవార్డు దక్కించుకున్నారు. అన్నట్టు గోవా పిల్లాడు ఏడ్డేష్ రతన్‌కర్ రామనాథకర్ గురించి చెప్పలేదు కదూ. తను ఆరవ తరగతి చదువుతున్నాడు. ఓసారి నదిలో మునిగిపోతున్న ఇద్దరు పిల్లలను కాపాడి అవార్డు సంపాదించాడు.

60 మందిని కాపాడిన గౌరవ్

గౌరవ్ సింగ్ సైని హర్యానా చిన్నారి. 2008వ సంవత్సరంలో కుటుంబంతో కలిసి హిమాచల్ ప్రదేశ్‌లోని నైనా దేవి ఆలయానికి వెళ్లాడు. అప్పుడు అకస్మాత్తుగా మట్టి చరియలు విరిగిపడ్డాయన్న ప్రచారం బయలుదేరింది. దాంతో అంతా భయపడిపోయి ప్రాణాలు కాపాడుకోవడం కోసం దిక్కుతోచిన విధంగా పరుగెత్తసాగారు. తొక్కిసలాట మొదలైంది. అప్పుడు మన గౌరవ్ తెలివిగా ఆలోచించాడు. పరుగులు తీయకుండా తొక్కిసలాటలో చిక్కుకున్న వారిని కాపాడసాగాడు. పైగా తనలాగే చేయండని చుట్టూ వున్నవారికి కూడా చెప్పసాగాడు. అక్కడ కనిపించిన వైరు సాయంతో 60 మందిని కాపాడాడు. అయితే దురదృష్టవశాత్తు ఇదే తొక్కిసలాటలో గౌరవ్ తన అక్కను, అన్నను కోల్పోయాడు. ఇందుకు బాధగా వున్నా అంతమందిని కాపాడగలిగినందుకు ఎంతగానో సంతోషించాడా చిన్నారి. పెద్దయ్యాక సైన్యంలో చేరాలనుందని చెప్తున్నాడు.

పెళ్లొద్దు బాబోయ్ ... చదువుకుంటాం

బాల్య వివాహ బంధనాలనుంచి

ేయరా
ారీ ఎక్కరా

ఎక్కువమంది నీళ్లలో మునిగిపోతున్న వారిని కాపాడారు. ఒకచిన్నారి ఏం చేశాడో తెల్సా! ఓ ఆలయంలో జరిగిన తొక్కిసలాట నుంచి 60 మందిని కాపాడి ప్రాణభిక్ష పెట్టాడు. ముగ్గురు చిన్నారులు బాల్య వివాహాలను ఎదిరించినందుకు ఈ అవార్డును దక్కించుకున్నారు. వీరందరికి మెడల్, సర్టిఫికెట్, నగదు బహూకరించారు. కాకపోతే మన రాష్ట్రం నుంచే ఒక్కరు కూడా ఈ అవార్డుకు ఎంపిక కాలేదని కొం...చెం... బాధ. మరి ఈ సాహస బాలలు చేసిన సాహసాలేంటో వివరంగా చెప్పేసుకుందాం!

- చూటీ

స బాలలు

తప్పించుకున్న చిన్నారులను సాహసబాలల అవార్డులు వరించడం కొత్త కాదు. మన రాష్ట్రంలో కూడా సుశీల అనే పాప తనకు పెళ్లి వద్దని చదువుకుంటానని అధికారుల సాయంతో బయటపడింది. తనకు కూడా అప్పుడు సాహస బాలల అవార్డు ఇచ్చారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన రేఖా కాళింది (11 సంవత్సరాలు), సునీతా మహతో (11), అఫ్సానా ఖౌతున్ (12) కు పెళ్లి కుదిరింది. కానీ వారికేమో పద్దెనిమిది సంవత్సరాలు నిండకుండా పెళ్లి చేసుకోకూడదని చెప్పిన తమ టీచర్ మాటలే గుర్తురాసాగాయి. బాగా ఆలోచించి పెళ్లి వద్దన్నారు. ఇప్పట్లో వివాహం చేసుకోబోమన్నారు. పైగా స్కూలుకు వెళ్లి ఎంచక్కా చదువుకుంటామన్నారు. అందుకుగాను తమ టీచర్లు, స్నేహితుల సాయం తీసుకున్నారు. మరి సామాజిక రుగ్మతను ఎక్కడ వున్నా వ్యతిరేకించాలికదా. అందుకే మన రాష్ట్రపతి ప్రతిభాసింగ్ పాటిల్ కూడా వారి సాహసాన్ని అభినందించారు. పైగా పసిప్రాయంలోనే ఒకరికి జరిగిన వివాహం వల్ల కనీసం పదిమంది జీవితాలు వ్యర్థమౌతాయని కూడా అన్నారామె. పెళ్లయిన పాప చిన్న వయసులోనే తల్లవుతుంది. అలా పసితనంలోనే పిల్లల్ని కనడం, పౌష్టికాహారం తీసుకోకపోవడంతో రోగాలు, రొష్టులు వెంటాడతాయి. దాని ప్రభావం పిల్లల ఆరోగ్యం మీద కూడా పడుతుంది. పేదరికం పెరుగుతుంది. ఇంక ఇదొక సైకిల్ అన్నమాట. అలాంటి వలయం నుంచి బయటపడాలంటే చిన్న విషయమా. సాహసం చేయాల్సిందే.

గుజరాత్‌కు చెందిన నరేంద్రసిన్హ నట్వార్ సిన్హ సోలంకి ఏం చేశాడో తెల్సా. మొసలి బారి నుంచి తన తండ్రిని కాపాడాడు. కేరళ కుట్టి విజిత్ మునిగిపోతున్న నలుగురు పిల్లలను కాపాడాడు. మిజోరమ్ పిల్లవాడు మంటల్లో చిక్కుకున్న బాబుని కాపాడాడు.

నేస్తాలూ! చదివారుకదా చిన్నారుల సాహసగాథలు. ధైర్యం చేయాలి. కాపాడాలి. అంతే! అదే అప్పటికి వారి మనసులో వున్నది. అదే ప్రమాదంలో వున్న వారి ప్రాణాలను కాపాడింది. అదే వారికి ప్రస్తుతం అవార్డులు సాధించి పెట్టింది. ఎంచక్కా ప్రధానమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రాష్ట్రపతిని కలిశారు. ఉపరాష్ట్రపతి ఇంటికి వెళ్లి తమ సాహసకృత్యాలు వినిపించారు. రిపబ్లిక్‌డే రోజు జరిగిన పెరేడ్‌లో పాల్గొన్నారు. ఏనుగు మీద ఊరేగారు.

సాహస బాలల అవార్డు అందుకున్న హర్యానా, మణిపూర్, ఉత్తర ప్రదేశ్, కేరళ, గుజరాత్, గోవా, మేఘాలయ, మిజోరమ్, రాజస్థాన్, పశ్చిమబెంగాల్ చిన్నారులందరికీ అభినందనలు చెప్పేద్దామా.

♦

జాతీయ సాహస బాలల అవార్డు - వివరాలు

ఆపదలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు, తమ ప్రాణాలకు సైతం తెగించి నిస్వార్థంతో, ధైర్యసాహసాలు ప్రదర్శించిన బాలబాలికలను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం జాతీయ సాహస బాలల పురస్కారాలను ఇవ్వసాగింది. ఈ అవార్డును ప్రతి ఏటా అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించిన బాలబాలికలకు ఇస్తారు. 2009కి గాను ప్రతిష్ఠాత్మకమైన ఈ పురస్కారానికి 21 మంది ఎంపికయ్యారు. అసలు ఈ అవార్డు ఎప్పటి నుంచి ఇస్తున్నారు? ఎలా ప్రారంభమయ్యాయి? ఇందులో ఎన్ని రకాలున్నాయి? ఈ అవార్డుకు ఎలా ఎంపికవుతారు? ఇప్పటికి ఎంతమందికి లభించింది? వంటి అనుమానాలు మీలో కలిగే వుంటాయి. మరి ఆ వివరాలు చెప్పకోకుండా ఎలా!

తొలి సాహస బాలుడు హరీష్ చంద్ర

భారత ప్రభుత్వం, ఇండియన్ కౌన్సిల్ ఫర్ చైల్డ్ వెల్ఫేర్ (ఐసిసిడబ్ల్యు) భారతదేశానికి చెందిన పిల్లలకు, వారి ప్రతిభా పాటవాలను, ధైర్యసాహసాలను గుర్తించి ప్రతి ఏటా సాహసబాలల పురస్కారాలు ఇస్తుంటారు. 16 ఏళ్లలోపు 24 మంది బాలలకు ఇస్తారు. ఇందులో 5 కేటగిరీలున్నాయి. సంజయ్ చోప్రా, గీతా చోప్రా, బాపూ గయాధని అవార్డు, భారత్ అవార్డ్, నేషనల్ బ్రేవరీ అవార్డు వున్నాయి. ఈ అవార్డులను సాధారణంగా నవంబర్ 14 బాలల దినోత్సవం రోజున ఇస్తారు. ప్రధానమంత్రి రిపబ్లిక్ డే సందర్భంగా ప్రదానం చేస్తారు. భారతదేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ రెడ్‌ఫోర్డ్ దగ్గర రామలీలా గ్రౌండ్స్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ అలంకరించిన షామియానాకు కరెంట్ షార్ట్ సర్క్యూట్ వల్ల నిప్పంటుకుంది. అక్కడేవున్న హరీష్ చంద్ర అనే 14 ఏళ్ల పిల్లవాడు ఎంతో సమయస్ఫూర్తితో, ధైర్యంతో ముందుకొచ్చాడు. తన దగ్గర వున్న కత్తితో షామియానాకు కట్టిన తాళ్లను తొలగించి అందులో చిక్కుకున్న వందలాది ప్రజల ప్రాణాలు కాపాడాడు. ఆ చిన్నారి చూపిన అసమాన ధైర్యసాహసాలకు, నిస్వార్థానికి, త్యాగానికి మురిసిపోయిన నెహ్రూ ఆ పిల్లవాడి స్ఫూర్తితో బ్రేవరీ అవార్డును స్థాపించి దేశవ్యాప్తంగా ఇవ్వాలని ఆదేశించాడు. ఈ అవార్డులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనుంచి, ప్రభుత్వ విభాగాల నుంచి జిల్లా పరిషత్‌ల నుంచి, స్కూల్ అథారిటీస్ నుంచి, బాలల సంక్షేమ మండలి నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎంపిక చేస్తారు. ఇప్పటి వరకు 756 మంది బాలబాలికలకు ఈ అవార్డులు అందాయి. వీరిలో 541 బాలురూ, 215 బాలికలూ.

గుమ్మడి పెద్దరికానికి ఒరవడి

ఓ మంచి నాన్నంటే ఎలా వుంటాడు?

సాత్వికుడైన తెలుగు పెద్ద మనిషి ఎలా వుంటాడు?

సంస్కారం మూర్తీభవించిన ఒక పరిణత మనస్కుడి ప్రవర్తన ఎలా వుంటుంది?

కుటుంబ భారం గుంభనంగా మోసే పెద్దన్న లేదా బతుకు బరువుతో కుంగిపోతూ కూడా పరువు కోసం పాకులాడుతున్న ఒక మర్యాదస్తుడు , రాజనీతి దురంధరుడైన ఒక మహామంత్రి, కారుణ్యం ఉట్టిపడే రుషి పుంగవుడు, వ్యాత్సల్యం పొంగిపొర్లే గురువరేణ్యుడు, భక్తి ప్రపత్తులకు మారుపేరైన భాగవతోత్తముడు ఎలా వుంటాడు?

ఇంకెలా వుంటాడు? గుమ్మడి వెంకటేశ్వరరావులానే!

అన్నట్టు మేకవన్నె పులి లాంటి ఘరానా వంచకుడు, అహంభావం కరుడుగట్టిన కులీన కుటుంబీకుడు, మూర్ఖత్వాన్ని వదులుకోలేని ఛాందసుడు ఎలా వుంటాడు?

ఆశ్చర్యం అదీ గుమ్మడి లాగానే!

బాపూ బొమ్మ లాటి అమ్మాయి అన్నట్టే గుమ్మడి లాటి నాన్న అంటే అర్థమై పోయేంతగా తెలుగు గుండెలలో చోటు చేసుకున్న కళా కోవిధుడాయన.

హీరోలే తారలన్న భావనను తిరగరాసి- అగ్ర నాయకులతో పాటు అనివార్యంగా తన ముద్ర కూడా గుర్తుకు వచ్చేంతగా అలరించిన ప్రతిభా సంపన్నుడాయన.

వయసును ఓడించిన వాడు, తెలుగు తెరపై మమకారాలు పండించిన వాడు, మణిదీపాలు వెలిగించిన వాడు, కుటుంబ జీవిత మాధుర్యాన్ని కురిపించిన వాడు గుమ్మడి.

గుమ్మడి అంటే గుండె నొప్పి అని ప్రేమగా అంటున్న తెలుగు వారి గుండెలో గూడు కట్టుకున్న సహజ నటుడు చివరకు ఆ గుండెనొప్పితోనే హఠాత్తుగా నిష్క్రమించాడు.

లెక్కకు మిక్కుటంగా తాను ధరించిన వైవిధ్య భరితమైన పాత్రలను మిగిల్చి పోయాడు.

- తెలకపల్లి రవి

నటీనటులు, కళాకారులు, రచయితల గొప్పతనం ఏమిటంటే వారు తెలియకుండానే మనకు చిరపరిచితులై పోతారు. మన భావధారలో భాగంగా మారిపోతారు. తెలుగు సినిమాకు సంబంధించినంత వరకూ అక్కినేని, ఎన్టీఆర్, ఎస్వీఆర్, సావిత్రి, గుమ్మడి ఆ కోవలో ప్రథములుగా వుంటారు. కనీసం రెండు తరాల ముందు వరకూ వారిని ప్రతి తెలుగు కుటుంబం తమలో ఒకరిగానే పరిగణించింది.

తొలిరోజులు..

గుమ్మడిగా ఇంటిపేరుతో పాతుకుపోయిన వెంకటేశ్వరరావు కళా సాహిత్యాలకు కమ్యూనిస్టు భావజాలానికి ఆటపట్టయిన గుంటూరు జిల్లా కొల్లూరు సమీపంలో పుట్టారు. స్వగ్రామం రావి కంపాడు. 1927 జులై 9న జన్మించిన ఆయన తండ్రి పేరు బసవయ్య, తల్లి బుచ్చెమ్మ. చిన్నప్పటి నుంచి స్నేహశీలిగా అందరి అభిమానాన్ని చూరగొన్నారు. చదువు మీద కన్నా నాటకాలపైన ఆసక్తి జాస్తి. స్కూల్ ఫైనల్ చదివే 15 ఏళ్ల వయసులోనే పండు ముదుసలి వేషం కట్టి ఓహో అనిపించి బహుమానం సంపాదించారు. అప్పటి పద్ధతుల ప్రకారం 1945లోనే లక్ష్మీ సరస్వతితో వివాహమైంది. కొల్లూరు హైస్కూలులో చదువు పూర్తవగానే గుంటూరు హిందూ కాలేజీలో చేరారు. గుంటూరులో భావి కమ్యూనిస్టు నాయకులు చాలా మంది చదువుతున్నారు. అప్పట్లో వక్తృత్వ పోటీల్లో బాగా రాణించాడు. స్టూడెంట్ ఫెడరేషన్‌లో పనిచేయడం మొదలెట్టాడు. చండ్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, మోటూరు హనుమంతరావు వంటి వారి ప్రేరణ బాగా పనిచేసింది. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా కృషి చేయడం మొదలెట్టాడు. మొత్తంపైన ఎఫ్ఎతో చదువుకు స్వస్తి పలికి స్వగ్రామం చేరాడు. వ్యవసాయం మొదలు పెట్టినా మనసు రంగస్థలంపైకే లాగింది. ప్రముఖ గాయకుడు మాధవపెద్ది వెంకట్రామయ్య దుర్యోధనుడుగా తను కర్ణుడుగా 'వీరాభిమన్యు' నాటకం ప్రదర్శించారు. ఆంధ్ర నాట్యమండలి స్థాపించి అనేక నాటకాలు వేసేవారు. ఉద్యోగావకాశాలు వచ్చినా కాదనుకుని స్వతంత్ర జీవనం కోసం తెనాలి గాంధీ చౌక్‌లో వ్యాపారం మొదలెట్టారు. కాని వ్యాపారం కన్నా వ్యాపకాలే ఎక్కువై అదీ మూలపడింది. ఆ దశలోనే ఒకటి రెండు సినిమా అవకాశాలు వెతుక్కుంటూ వచ్చి వెనక్కు పోయాయి. గుమ్మడి పెద్దగా పట్టించుకోలేదు

ఎస్వీఆర్... గుమ్మడి..

తెలుగు తెరకు ఎన్టీఆర్ ఏఎన్నార్‌లు మూల స్తంభాలైనట్టే క్యారెక్టర్ పాత్రల్లో ఎస్వీఆర్ గుమ్మడి రెండు స్తంభాలు. అయితే ఇందులో ఎస్వీఆర్ ధాటి హెచ్చు. ఆయన విగ్రహం, కంఠస్వరం, అనుభవం అన్నీ ఇందుకు కారణం. గంభీర విగ్రహం గల ఎస్వీరంగారావు, (మిక్కిలినేని కూడా) ఎన్టీఆర్ చిత్రాల్లో వుంటే కాస్త మృదువైన శాల్తీ గనక గుమ్మడి అక్కినేని కాంబినేషన్‌లో ఎక్కువగా కనిపించేవారు. అయితే ఎస్వీఆర్-గుమ్మడి సంబంధం ఎప్పుడూ ఆసక్తికరంగా వుండేది. తన ఆత్మకథలో కూడా గుమ్మడి పలుచోట్ల ప్రశంసాపూర్వకంగా ఆయన ప్రస్తావన తీసుకొస్తారు. అందులో ఒకింత విమర్శ కూడా.. హరిశ్చంద్రుడుగా ఎస్వీఆర్ విశ్వామిత్రుడుగా గుమ్మడి నటించినప్పుడు ఆయన కాళ్లు కడగడానికి ఎస్వీఆర్ సిద్ధం కాకపోవడం అందులో ఒకటి. చివరకు మరెవరితోనే కడిగించి ఆ సన్నివేశం పూర్తి చేశారు. ఇందుకు భిన్నంగా మహానటుడు చిత్తూరు నాగయ్య ఉదంతం చెబుతూ ఆయన గొప్పనటుడైనా ఒదిగి వుండేవారని పేర్కొంటారు. నాగయ్య తీసిన యోగి వేమన చూసి ముమ్మిడి వరం శివబాలయోగి ధ్యానంలోకి వెళ్లాడని ఒక కథ.. నాగయ్య మరో గొప్ప చిత్రం పోతనను గుమ్మడితో తీస్తే పెద్ద ఆదరణ పొందలేదు. దానిపై గుమ్మడి తన చిత్రం చూపిస్తే బాలయోగి లేచి వస్తాడని చమత్కరించేవారు.అయితే నాగయ్య అలా అనొద్దని ఆయనను కోప్పడడం విశేషం.ఎన్టీఆర్ మంచి తొలి రోజుల్లో చాలా ప్రోత్సాహం పొందిన గుమ్మడి ఆయన ముఖ్యమంత్రి అయ్యాక పురస్కారాలు కూడా అందుకున్నారు.అయితే ఎన్టీఆర్ 'బ్రహ్మర్షి విశ్వామిత్ర' తీస్తున్నప్పుడు అందులో వశిష్టుడెవరనేది తేలలేదు. ఆయనకు దీటుగా వుండాలంటే నేనే వేయాలి.. ఇంత వరకూ అడగలేదు, చూద్దాం అని ముందే అన్నారు. తర్వాత తనే వేశారు కూడా..



'భక్త పోతన'లో ఎస్వీఆర్‌తో...

గాని ఆయన నేస్తుడూ, భాగస్తుడూ అయిన వట్టికూట రామకోటేశ్వరరావు తట్టుకోలేకపోయాడు.తమిళనాడు టాకీస్ సంస్థ కొత్త వారితో చిత్రం తీస్తూ దేవదాసు నిర్మాత డిఎల్ నారాయణ ద్వారా గుమ్మడి గురించి విని పిలిపించారు.ఆ చిత్రమే అదృష్టదీపుడు. అందులో ఆయన హీరో. తర్వాత గోపీచంద్ తీసిన 'పేరంటాలు'లోనూ చిన్న వేషం కట్టాడు గాని పెద్దగా కదలిక రాలేదు. వున్న సొమ్ము హరించుకుపోతున్నది. అప్పుడు గుమ్మడి టి.నగర్‌లోని మోడరన్ కేఫ్ లాడ్జిలో వుండగా అక్కడే ఆయన నిర్మాతల ఆఫీసుతో పాటు పక్కనే ఎన్‌టిఆర్ గది కూడా వుండేది. ప్రసిద్ధ సంస్థ విజయా వారి చిత్రాలన్నిటికీ హీరోగా ఒప్పందం కుదుర్చుకున్న ఎన్టీఆర్ కన్నా పెద్దగా రికాణా లేని గుమ్మడి ఎక్కువ ఖర్చు చేస్తున్నాడని విని ఆయనే మందలించారు. మార్చారు.

స్నేహమే తోడుగా..

తర్వాత కూడా గుమ్మడికి ఒకటి రెండు హీరో వేషాలు తగిలినా చివరి వరకూ వెలగలేదు.చిన్నా చితక వేషాలేస్తూ రామారావు గోపీచంద్ వంటివారితో దోస్తీ చేస్తూ ఆయన కాలక్షేపం చేశారు. విజయా చిత్రాలలో విపరీతమైన జనాకర్షణ సంపాదించిన ఎన్టీఆర్ రాయలసీమలో కరువు వచ్చినపుడు ఆదుకునేందుకోసం పర్యటన, ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో వారితో కలిసి పనిచేసిన గుమ్మడి నందమూరి సోదరులకు దగ్గరయ్యారు. వేషాలు సరిగ్గా రాలేదనే నిరుత్సాహంతో గుమ్మడి ఇంటి దారి పట్టినప్పుడు రామారావే ఆపి తన స్వంత చిత్రం పిచ్చిపుల్లయ్యలో వేషం ఇచ్చారు. అంతకంటే ముఖ్యంగా తోడు దొంగలు లో తనతో సమానమైన పాత్ర ఇచ్చి ప్రోత్సహించారు. ఈ రెండూ కొంత వైవిధ్య భరితమైన చిత్రాలు. మరీ ముఖ్యంగా 'తోడు దొంగలు'లో ఇద్దరూ వయసు మళ్లిన పాత్రలే వేశారు. తమ మిల్లులో ప్రమాదవశాత్తూ చనిపోయిన కార్మికుడికి నష్టపరిహారం ఎగరగొట్టేందుకు పాచిక వేయడం తదనంతర పరిణామాలు. ఎన్టీఆర్ తర్వాత అపరాధ భావనలో కూరుకుపోవడం ఈ చిత్ర కథ. దీనికి అవార్డులు, అభినందనలు వచ్చాయి గాని డబ్బులు రాలేదు. దాంతో ఎన్టీఆర్ తర్వాత వ్యాపార ఫక్కీలో 'జయసింహ' తీస్తూ అందులో గుమ్మడికి అంజలీ దేవి తండ్రి పాత్ర ఇచ్చారు. అది బాగా ఆకర్షించగా ఆ వెంటనే అక్కినేని, సావిత్రి, జగ్గయ్య తదితరులతో తీసిన 'అర్ధాంగి' వచ్చింది.ఇందులోనూ గుమ్మడి అమాయకుడైన హీరో, దుష్టుడైన తమ్ముడికి తండ్రిగా నటించాడు. ఇద్దరు హీరోల మధ్య అవకాశాలెలాగూ రావు గనక క్యారెక్టర్ పాత్రల్లో స్థిరపడటం మంచిదన్న సలహాలూ వచ్చాయి.దాంతో తెలుగు తెరకు ఒక గొప్ప నాన్న దొరికాడు!

సాంఘికాలకు సమాంతరంగా 'సతీ తులసి, సత్య హరిశ్చంద్ర(విశ్వామిత్రుడు), మాయాబజార్' వంటి పౌరాణికాల్లోనూ ఆయన ప్రతిభ ప్రదర్శించాడు. ఏ పాత్ర వేసినా సహజసిద్ధమైన నటన కనపరుస్తూ పరిశ్రమనూ ప్రజలనూ కూడా ఆకర్షించారు. 'మాయా బజార్'లో భోళా శంకరుడి వంటి బలరాముడి పాత్రలో అటు కోపం ఇటు శాంతం పెద్దరికం, పొగడ్తలకు లొంగే ముఖప్రీతి వంటి లక్షణాలన్నీ అవలీలగా చూపించి ఆ కళాఖండంలో తనూ ఒక మణిపూసగా మిగిలిపోయాడు.

ప్రచ్ఛన్న ప్రతినాయకుడు...

సమవుజ్జీ సహనాయకుడు

నాణ్యమైన నటనతో పెద్దరికపు పాత్రల్లో రాణిస్తూనే గుమ్మడి మేకవన్నె పులి తరహా విలనిజం కూడా పండించి చూపించారు. ఏది నిజం చిత్రంలో ఆయన ధరించిన పాత్ర అందుకు నాంది పలికింది. నమ్మిన బంటు కూడా ఆ వరవడిని మరింత దృఢతరం చేసింది. అందమైన విగ్రహం గల గుమ్మడి హీరోలకు దీటైన పాత్రల్లో అనేక చిత్రాలు నటించారు. పల్లెటూరి కథల్లో పెద్దన్నయ్యగానో గ్రామ సర్పంచిగానో ఆయన వేసినప్పుడు నాయక లక్షణాలు ఉట్టిపడుతుంటాయి. ఇక కథాపరంగా కూడా అక్కినేని, ఎన్టీఆర్‌లు ఇద్దరితోనూ సమానంగా కనిపించిన చిత్రాలనేకం. ఆయనకు రాష్ట్రప[illegible] తెచ్చిపెట్టిన అద్భుత చిత్రం 'మహామంత్రి తిమ్మరుసు'లో ఆయనే కథానాయకుడు. ఆ చిత్రంలో కృష్ణదేవరాయలుగా నటించడం ఆయన పట్ల ఎన్టీఆర్ స్నేహభావనకు

సుందరయ్య అంటే ఎనలేని గౌరవం..

వామపక్షాల పట్ల అభిమానం గల గుమ్మడి కమ్యూనిస్టు నాయకులను ఎంతగానో గౌరవించేవారు. ప్రత్యేకించి సుందరయ్యను గురించి ఎప్పుడూ చెప్పేవారు. కాని ఒకసారి రైలులో వెళ్తున్నప్పుడు లైటు సరిగ్గా లేకపోవడంతో పై బెర్తుపై వున్న సుందరయ్యతో ఒకింత వాగ్వివాదం జరిగింది. తర్వాత ఆయన సుందరయ్య అని తెలుసుకొని ఎంతో బాధపడ్డారు. సైగా తన జీవితంలో మరచిపోలేని చేదు జ్ఞాపకంగా దాన్ని పదే పదే పేర్కొంటూ వచ్చారు.

గుమ్మడి, సి.నారాయణ రెడ్డి, నేరెళ్ల వేణు మాధవ్, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి మంచి మిత్రులు. తమను తాము ఇష్ట చతుష్టయంగా వారు చెప్పుకుంటారు.

తార్కాణం. 'రాయా' అంటూ గుమ్మడి, 'అప్పాజీ' అంటూ రామారావుల ద్వయం చూస్తుంటే నిజంగానే అలనాటి రాయలవారి వైభవం సాక్షాత్కరిస్తుంది. కాల వైపరీత్యంలో రాయలు అప్పాజీ కళ్లను పొడిపించిన తర్వాత 'చరిత్ర ఎరుగని మహాపాతకము మా దేశానికి పట్టినదా' అన్న విషాదగీతం.. భరించలేని వేదనతో అప్పాజీ శిక్ష తప్పించాలని రాయలు పరుగున వెళితే అప్పటికే కళ్లు పోయిన మహామంత్రి తన మొహం చూపించకుండా కొప్పడి పంపేయాలని చూసే సన్నివేశంలో మహానటుల అభినయం కళ్లు చెమరింపచేస్తుంది. గుమ్మడి పెద్దరికపు పాత్రల్లో స్థిరపడిన తర్వాత కూడా హీరో కృష్ణ తీసిన పండంటి కాపురం, ఎన్టీఆర్ కథానాయకుడుగా నటించిన పవిత్ర హృదయాలు వంటి చిత్రాల్లో హీరో తరహా పాత్రలు వేసి ఔననిపించుకున్నారు. ఈ రెండింటిలోనూ ఆయన పక్కన జమున కనిపిస్తారు.

సౌజన్యం..వైవిధ్యం....

గుమ్మడి నటించిన పాత్రలను పరిశీలిస్తే ఆయన అత్యధికంగా సౌజన్యం, సాత్వికత నిండిన పాత్రల్లో కనిపిస్తారు. కుటుంబ పెద్ద, యజమాని, తండ్రి, తాత, మామయ్య, మహారాజు, మంత్రి, గురువు, యోగి, డాక్టర్, మేధావి, పోలీసు అధికారి వంటి రకరకాల పాత్రల్లో ఆయన 400 పైగా చిత్రాలు నటించారు. ఏ పాత్ర వేసినా చక్కగా ఇమిడిపోయి పాత్రోచితమైన నటన కనపరుస్తారు.అదే సమయంలో తన ముద్రను వదలకుండా కాపాడుకుంటారు. అక్కినేనికి తను తండ్రిగా చాలా చిత్రాల్లో నటించినా ఆయనే తనను తండ్రిలా కడుపులో పెట్టుకుని సలహాలిచ్చారని గుమ్మడి అంటుండే వారు.అయితే ఆయనకు మొదటి మిత్రుడు మాత్రం ఎన్టీఆరేనని తెలుసుకున్నాం.అప్పట్లో సినిమా పరిశ్రమలో ఎన్టీఆర్, ఏఎన్నాఆర్‌లు రెండు స్తంభాలుగా వున్న పరిశ్రమ స్వరూపం కూడా ఈ పరిస్థితికి కారణమై వుండొచ్చు. కాని అంత సన్నిహితంగా వుండే అక్కినేనితో ఒక వ్యాపార విషయంలో స్వల్పమైన మనస్పర్ధలు వచ్చినందుకు గుమ్మడి చాలా బాధపడ్డమే కాక దాన్ని తన జ్ఞాపకాలలో కూడా రాశారు.

మళ్లీ గుమ్మడి పాత్రల దగ్గరకు వస్తే- ప్రధానంగా కరుణ రసానికి గుర్తుగా మిగిలిపోయిన ఆయన వాస్తవంలో నవరసభరితమైన నటనకు చిరునామా వంటివారు. నవ్వుల నజరానా మిస్సమ్మ చిత్రంలో హీరో హీరోయిన్లను వుత్తుత్తి ఇంటర్వ్యూకు పిలిచే అతి(థి) పాత్రలోనే కనిపించినా హాయిగా అలరిస్తారు. తర్వాత కాలంలో 'పెళ్లిసందడి' వంటి సినిమాల్లోనూ ఇదే హాస్యం. 'తాత మనవడు'లో కాస్సేపు మారువేషం కట్టి నవ్వించడం.. బాపు చిత్రం పెళ్లిపుస్తకంలో 'నేనూ..' అని సాగదీసే యజమానుడిగానూ అలాగే నటించారు. కోపానికి మారుపేరైన దుర్వాసుడు, విశ్వామిత్రుడు వంటి పాత్రల్లోనూ ఆయన గొప్పగా నటించారు. అదే సమయంలో కరుణ రసపూరితమైన వశిష్టుడు, భీష్ముడు, దశరథుడు,జనకుడు వంటి పాత్రలకూ సరిపోయారు. 'మర్మయోగి'లో మారువేషంలో మోసకారి రాణి ఆటకట్టించే పాత్ర... 'భూమికోసం' లో 'ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోకుమా' అని పాడుతూ ప్రజలను కదిలించే పాత్ర... 'అల్లూరి సీతారామరాజు'లో గాము గంటం దొరగా ఆయన కుడిభుజమై పౌరుషం కురిపించడం..

ఆయన సనాతనాచార పాత్రలకు ప్రత్యేకంగా పేరొందారు. వాటిలో అగ్రస్థానం 'జయభేరి'లో విశ్వనాథశాస్త్రి. సంప్రదాయానికి భయపడి ఎంతో ప్రియమైన తమ్ముడిని వదులుకోలేక ఆదరించలేక అల్లాడే అన్నగా ఆయన నటన అమోఘం. బాలచందర్ తీసిన 'జీవిత రంగం'లో తమను పోషించేందుకై దారి తప్పిన కూతురి వైనం తెలిసి గుండెపగిలే తండ్రిగానూ, చాలా ఏళ్లతర్వాత వేజెళ్ల అనే కొత్త దర్శకుడు తీసిన 'మరోమలుపు'లో జరుగుబాటు లేకున్నా ఆచారాన్ని వదులుకోలేక అల్లాడి ఆఖరులో కళ్లు తెరుచుకునే పూజారిగానూ పాత్రకు ప్రాణం పోశారు. అదే దర్శకుడు తీసిన ఈ చదవులు మాకొద్దు లోనూ అదే తరహా పాత్ర వేశారు. కె.రాఘవేంద్రరావు తొలి ప్రయోగం 'జ్యోతి'లో వయసు మళ్లిన వాడై నాయిక జయసుధను పెళ్లి చేసుకుని అయోమయంలో అల్లాడ్డం..

విలనిజానికి వస్తే - 'చిట్టి చెల్లెలు'లో తన అల్లుడినే తెలియక కాల్చిపారేసే నేర చరిత్రుడు తర్వాత నిజం తెలిసి కుమిలిపోయే పాత్ర.. 'రాజమకుటం'లో పినతండ్రిగా వుంటూనే గోతులు తవ్వేపాత్ర..'లక్షాధికారి'లో మేకవన్నె పులిలా తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టే పాత్ర. జమీందారు ఆస్తిని కాజేయడానికి ఉచ్చుపన్నిన ఇద్దరు మిత్రుల పాత్ర,అంతస్తుల కోసం ప్రేమలనే గాక కన్న కొడుకునే బలిగొన్న జమీందారుగా బాబు చెప్పాలంటే లెక్క లేనన్ని..

ఘర్షణాత్మక పాత్రల్లోనూ ఆయన బాగా మెప్పించారు. అంతస్తులులో ఒకప్పటి తన కూతురును దగ్గర చేర్చుకోవడానికి ఆరాటపడటం... 'మా ఇంటి మహాలక్ష్మి'లో భార్యపై అనుమానం పెంచుకున్న నడివయసు భర్త... ..'మూగమనసులు' లో స్వచ్ఛమైన కూతురు, గయ్యాళి భార్య, మోసకారి బావమరిది మధ్య నలిగిపోయే పాత్ర, 'కృష్ణవేణి'లో మతి చలించిన మంచి కూతురు వాణిశ్రీ కాపురం కూలిపోతుంటే భరించలేని తండ్రి పాత్ర.. ఏది వేసినా గుమ్మడి గుమ్మడే అనిపించుకున్నారు. 'బహుదూరపు బాటసారి'లో తన కొడుకు(అక్కినేని)ను అతని కొడుకులు కొల్లగొడుతుంటే భరించలేని తాత పాత్ర, 'ఆదర్శకుటుంబం, కులదైవం, దసరా బుల్లోడు, ఆడవాళ్లే అలిగితే ...' ఇలా చాలా చిత్రాల్లో ఉమ్మడి కుటుంబ పెద్దగా, పెద్ద కొడుకుగా ఆయన ఘర్షణాత్మక పాత్రలలో జీవించారు.

గుమ్మడి నటనా చాతుర్యం ఎంత గొప్పదంటే ఇతర భాషల్లోంచి పునర్నిర్మించేప్పుడు అందులో గొప్ప గొప్ప క్యారెక్టర్ నటులు ధరించిన పాత్రలేవైనా ఆయనకే వస్తాయి. ఆఖరుకు తొలి తరం మహానటుడు అశోక్ కుమార్ కోరి కోరి ఆయనతో హిందీలోనూ వేషం కట్టించాడు. ఆయన సరసన ఎక్కువగా సూర్యకాంతం, శాంతకుమారి, కన్నాంబ,హేమలత, అంజలీ దేవి వంటి వారు కనిపించేవారు.

గుమ్మడి మొత్తం 400చిత్రాల్లో నటించారు. ఆయనకు ఏడుగురు సంతానం వున్నారు. కాని కళాభిమానులు మాత్రం అసంఖ్యాకంగా వున్నారు. ఆయనను ఓ మంచి నాన్నగా వారెప్పుడూ గుర్తుంచుకుంటారు. ✶



'శభాష్ రాముడు'లో ....

సత్కారాలు.. పురస్కారాలు..

గుమ్మడి నట జీవితంలో పురస్కారాలకు కొదవే లేదు. 'ఏది నిజం' ఉత్తమ చిత్రంగా కేంద్ర ప్రభుత్వ అవార్డు పొందినప్పుడు అందులో విలన్‌గా నటించిన గుమ్మడి దాన్ని తీసుకున్నారు. 'మహామంత్రి తిమ్మరుసు'కు ఉత్తమచిత్రంగా కేంద్ర పురస్కారంతో పాటు రాష్ట్రపతి రజత పతకం.. పదండి ముందుకు చిత్రం కోసం రష్యా వెళ్లటం.1989లో తెలుగు విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్... తెలుగు చిత్ర రంగానికి విశిష్ట సేవలందించిన పెద్దలకిచ్చే రఘుపతి వెంకయ్య అవార్డు 1999లో అందుకున్నారు.



గుత్తి కాకరకాయ

కావలసిన పదార్థాలు

కాకరకాయలు - పావుకేజీ
శనగపప్పు పొడి(పుట్నాల పొడి) - 1టేబుల్ స్పూను
కారం - 1టేబుల్ స్పూను
అల్లం - కొంచెం
జీలకర్ర - కొంచెం
ఉప్పు - తగినంత
నూనె - అరకప్పు
ఉల్లిపాయలు - 4
దనియాలు - 1టీ స్పూను

తయారు చేసే పద్ధతి

కాకరకాయలు శుభ్రంగా కడిగి వాటికి ఒకవైపున చాకుతో గంటు పెట్టాలి. ఉల్లిపాయలు, దనియాలు, అల్లం మెత్తగా నూరి దానిలో శనగపప్పు పొడి (పుట్నాలపొడి), కారం, ఉప్పు వేసి కలిపి ముద్దగా చేయాలి. ఈ ముద్దని కొంచెం కొంచెం తీసుకుని కాకరకాయల్లో కూరాలి. ఇలా అన్ని కాయలనూ రెడీ చేసుకుని మూకుడులో నూనె పోసుకుని బాగా కాగనివ్వాలి. అందులో ఈ కాయల్ని వేసి వేయించాలి. మధ్యమధ్యలో కొద్దిగా ఉప్పు కలిపిన నీళ్ల జల్లుకుంటే బాగా వుడుకుతాయి. కాకరకాయలు ఉడుకుతున్నప్పుడు నీళ్లూరుతాయి. ఈ నీళ్లన్నీ యింకిపోయిన తర్వాత దింపాలి. దీన్ని వేడిడేడి అన్నంలో కలుపుకుని తింటే చాలా రుచిగా వుంటుంది.


గుత్తి కాకరకాయ

చిలగడ దుంప కూర

కావలసిన పదార్థాలు

చిలగడ దుంపలు - పావుకేజీ
కొబ్బరి - పావుచిప్ప, టమాటాలు - 2
ఉల్లిపాయలు - 2.
కారం - 1టీస్పూను
కొత్తిమీర - కొద్దిగా. కరివేపాకు - 2 రెమ్మలు
లవంగాలు - 5
వెల్లుల్లి - 2 రెబ్బలు
నూనె - 2 టేబుల్ స్పూన్లు
ఉప్పు - సరిపడా
ఎండుమిర్చి - 2
పచ్చిమిర్చి - 4

తయారుచేసే పద్ధతి

చిలగడ దుంపలను(గెనుసుగడ్డ/మొరంగడ్డ) కొద్దిగా ఉప్పు వేసి ఉడికించి ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. మూకుడులో నూనె వేసి బాగా మరిగాక ఉల్లిపాయ ముక్కలు, చితక్కొట్టిన వెల్లుల్లి రెబ్బలు, ఎండుమిర్చి, పచ్చిమిర్చి వేసి వేయించాలి. తర్వాత కరివేపాకు, టమాటా ముక్కలు కూడా వేసి వేయించాలి. అవి వేగాక ఉడకబెట్టిన చిలగడ దుంప ముక్కలు, కొబ్బరిపొడి, ఉప్పు, కారం, కొత్తిమీర లవంగాలు వేసి బాగా కలిపి రెండు నిమిషాలు ఉంచి దింపేయొచ్చు.


చిలగడదుంప కూర

దొండకాయ మసాలా కూర

కావలసిన పదార్థాలు

దొండకాయలు - పావుకేజీ
చింతపండు - నిమ్మకాయంత
కారం - 1టేబుల్ స్పూను
ఉప్పు - తగినంత
పసుపు - చిటికెడు
కొబ్బరి పొడి - 50గ్రా
నువ్వుల పొడి - 50గ్రా
ఉల్లిపాయలు - 2
పచ్చిమిర్చి - 4
జీలకర్ర - 1 స్పూను
అల్లంవెల్లుల్లి పేస్ట్ - 1స్పూను
నూనె - 1టేబుల్ స్పూను

తయారు చేసే పద్ధతి

దొండకాయల్ని నిలువుగా నాలుగు ముక్కలుగా కోయాలి. కొబ్బరి, నువ్వులు, జీలకర్ర, పచ్చిమిర్చి, ఉల్లిపాయలు వేయించి రుబ్బుకోవాలి. మూకుడులో నూనె వేసి దొండకాయల్ని కొద్దిగా వేయించి రుబ్బుకున్న కొబ్బరి నువ్వుల పేస్టును, అల్లం వెల్లుల్లి పేస్టును అందులో వేసి పచ్చివాసన పోయేలా వేగనివ్వాలి. తర్వాత అందులో చింతపండు రసం పిండుకోవాలి. రసం చిక్కగా వచ్చేవరకు ఉడకనివ్వాలి. చివరలో కొద్దిగా కొత్తిమీర వేస్తే బావుంటుంది.


దొండకాయ మసాలా కూర

తెలగపిండి మునగాకు కూర

కావలసిన పదార్థాలు

తెలగపిండి - పావుకేజీ,
ములగాకు - 2 కప్పులు
వెల్లుల్లి - 1పాయ
ఉల్లిపాయ - 1
జీలకర్ర - 1టీస్పూను
ఆవాలు - 1టీ స్పూను
శనగపప్పు -1 స్పూను
ఎండుమిర్చి - 2
ఉప్పు - తగినంత
నూనె - 1 టేబుల్ స్పూను
పచ్చిమిర్చి - 4

తయారు చేసే పద్ధతి

తెలగపిండిని పొడి చేసుకోవాలి. మునగాకును మరుగుతున్న నీళ్లలో వేసి తీయాలి. తెలగపిండి, మునగాకు కలిపి కొద్దిగా నీళ్లపోసి ఉప్పు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలను వేసి బాగా వుడికించాలి. శనగపప్పు, ఎండుమిర్చి, వెల్లుల్లి, ఆవాలు, జీలకర్ర నూనెలో వేయించాలి. బాగా చిటపటలాడుతున్నప్పుడే అందులో ఉడికించిన తెలగపిండి, ములగాకును వేసుకోవాలి. తెలగపిండిలో ఎంత నూనె పోసినా కనిపించదు. అన్నంలో ఈ కూర వేసుకున్నప్పుడు కొద్దిగా నూనె వేసుకుంటే కూరకు మరింత రుచి వస్తుంది.


తెలగపిండి మునగాకు కూర

★

సీరియల్

వియత్నాం గెరిల్లా

జరిగినకథ:

హావ్ అనాథ. చిన్నతనం నుంచీ కష్టపడి పనిచేసేది. యుక్తవయసు వచ్చాక ఓ నావికుడి ప్రేమించి పెళ్లాడుతుంది. వారికి ఓ పాప పుడుతుంది. ఓరోజు బీచ్‌లో జరిగిన సంఘటన ఆమె మనసులో పెనుతుఫానునే సృష్టిస్తుంది. ఆ రోజు ఫ్రెంచి సైనికులు కొందరు తుపాకులు చేతబట్టి జనాలను వేటాడసాగారు. ఒడ్డున వున్న నావలమీద కాల్పులు జరిపారు. వాటికి నిప్పంటించారు. తర్వాత వారిలో ఒకడు హావ్‌ను వెంబడించాడు. హావ్ మామ ఆమెను అక్కడినుంచి పారిపొమ్మని చెప్పాడు. ఆమె పరిగెడుతుంది. దాక్కుంటుంది. అయినా వారి బారినుంచి తప్పించుకోలేకపోతుంది. వారి కామదాహానికి బలైపోతుంది. మానసికంగా, శారీరకంగా గాయపడ్డ హావ్ ఏడ్చుకుంటూ కూర్చుండిపోతుంది... ఆ తర్వాత

మూలం: బుయ్‌డక్ ఆయ్

తెలుగు: కొల్లి సత్యనారాయణ

(3వ భాగం)

మామయ్య కేకలు వేస్తూ నా వెనకాలే పరుగులాంటి నడకతో వస్తున్నాడు. తొందర్లోనే నన్ను చేరుకున్నాడు. నేను ఎంతోసేపు పరుగెత్తలేకపోయాను. మొదలు నరికిన చెట్టులా ఇసుకలో కూలబడ్డాను. మామయ్య వచ్చి నాపక్కన కూర్చుని నా భుజంపై చెయ్యి వేసి ఊపుతూ "అమ్మాయ్ - పిచ్చి యేమన్నా ఎక్కిందా? జరిగిందేదో జరిగిపోయింది. అది నీ తప్పుకాదు. అందుకు నిందించవలసింది నన్నే. ముసలివాడినైనా బుద్ధిలేనివాడిని...."

అతని కళ్లు నీళ్లతో నిండాయి. గాలికి గడ్డం ఊగుతోంది.

తన కన్నీళ్లను అణచుకుంటూ, "నీ భర్తతో చెబుతా, నిన్ను ఏమీ అనకుండా చూస్తా, కూర్చో. పాపను తీసుకో. నీకు పాప, భర్త ఉన్నారు... హాని తల పెట్టుకోకు. నువ్వు ఏ అఘాయిత్యానికి పాల్పడినా వారికి చాలా హాని చేసిన దానివౌతావు. ఇదిగో పాప. పాలివ్వు. లేకపోతే మళ్లీ ఏడుస్తుంది. పసిది. ఆకలేస్తోంది. సోష వస్తుంది" అని ఓదార్చసాగాడు మామయ్య.

ఆ మాటలతో నా కళ్లంట నీరు కారసాగింది. ప్రతి కన్నీటి చుక్కా నాలోని బాధను కొంత తగ్గించింది. ఏడుస్తూనే లేచి కూర్చుని పాపను తీసుకున్నాను. భర్తను, పాపను గురించి మామయ్య అన్న మాటలు నన్ను మేల్కొలిపాయి. నిద్ర వచ్చింది కాబోలు పాప ఏడ్వసాగింది. పాప వంక చూడగానే నా కళ్లనిండా నీళ్లు తిరిగాయి. పాప అందంగా వుండడమే కాదు, ఏడ్పించదు. పాలిచ్చిన తరువాత మామూలుగా మల్బరీ ఆకులు కోసుకువచ్చేందుకు వెళ్లేదాన్ని. తిరిగి వచ్చేవరకు తాతయ్యతో కేరింతలు కొడుతూ ఆడుకునేది. తెల్లవారుజామున పాలు ఇవ్వక ముందు, "నీ తల్లి కష్టపడుతోంది. తన ప్రియమైన బిడ్డను కష్టపడనిస్తుందా! లేదు. లేదు. తల్లిపైన కోప్పడకు" అని నాలో నేనే అనుకునేదాన్ని.

అస్తమిస్తున్న సూర్యుని కిరణాలు పడి ఆ లేత బుగ్గలు మరింత ఎరుపెక్కాయి. కళ్లు మూసుకుని వుంది. పసిపాపల వద్ద వుండే కమ్మని వాసన వెదజల్లుతోంది. చీకట్లు అలముకున్నాయి. తుపాకులు పేలిన శబ్దం విన్పించటంలేదు. పంట పొలాల నుండి, గ్రామంలోనూ ఇంకా పొగ వస్తూనే వుంది. అప్పుడప్పుడు అడవి కోళ్ల అరుపులు మాత్రం విన్పిస్తున్నాయి. నెమ్మదిగా సముద్రం పొంగుతోంది. అలలు ఒకదానినొకటి తరుముతున్నాయి. విరిగి పోతున్నాయి. నురగలు కక్కుతున్నాయి. అలల తాకిడికి నావలు ఉయ్యాలలూగుతున్నాయి. అడవి కోళ్ల అరుపులు విని మామయ్య లేచి నిలబడ్డాడు. సముద్రం పొంగుతుందనగా అడవి కోళ్లు అరుస్తాయి. అప్పుడు నావ సముద్రం లోపలికి తీసుకెళ్తారు. ఆరోజు నావల్ని నెడుతున్న సూచనలు కానరాలేదు. ఆయన బాధపడుతున్నాడని నాకు తెలుసు. అతని జీవితంలో ఇటువంటి దుర్ఘటన చూసి వుండడు. ఆ సంఘటనకు అతని మనస్సు వికలమైంది.

శత్రుమూకలు వెళ్లి పోతున్నదీ లేనిదీ ఎదురు చూడడంతో అతని కళ్లు నొప్పి పుడుతున్నాయి. ఇళ్లు, పంటలు తగలబెట్టి, స్త్రీలను చెరిచి, చేపల్ని దోచుకుని బండ్లకెత్తుకుని శత్రుమూకలు వెళ్లిపోయాయి. దూరంగా పోతున్న ఆ బండ్ల కదలికలను నేను చూస్తూనే వున్నాను. లేచి నడవడంలో మామయ్య సహాయం చేశాడు.

"అమ్మాయ్, వెళ్దాం పద" అని బయలు దేరాడు. పాపను ఎత్తుకుని అతనిని అనుసరించాను. పొట్టనిండా పాలు తాగి పాప నిద్రపోసాగింది. మల్బరీ పొలాల్నుండి అరుపులు, ఏడ్పులు వినబడుతున్నాయి.

భయంతో ఉదయం పారిపోయిన పశువులు విచారంతో వున్నట్లు మెడలు వంచుకొని నెమ్మదిగా ఇళ్లకు తిరిగి వస్తున్నాయి.

3

ఆ వేసవి కాలపు యుద్ధం మా గ్రామాన్ని సర్వ నాశనం చేసింది. నన్ను శిక్షించింది. మొదట్లో ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన నన్ను వెన్నాడింది. ఉరేసుకోవడం కానీ, సముద్రంలో పడి చనిపోవడం కానీ తెలివి తక్కువ పని అని నెమ్మది మీద తెలుసుకున్నాను. చావటం ప్రతీకారం తీర్చుకోవడం కాదు. పైగా పాపకు అన్యాయం చేయడం, భర్తను క్షోభ పెట్టడం. అవమానంతో ఒక సంవత్సరం బాధపడ్డాను. సైనికుని భార్య ప్రసవ వేదనతో బాధపడుతుంటే సహాయం చేయడానికి గెరిల్లాల స్థావరమైన 'హీప్'లో ప్రాంతానికి వెళ్లాను. తిరిగి వచ్చేసరికి చాలా పొద్దుపోయింది. వరండాలోకి వెళ్లేటప్పటికి ఇంట్లో నుండి మాటలు వినబడుతున్నాయి. గొంతు గుర్తుపట్టాను. నా భర్త

తిరిగి వచ్చాడన్నమాట! గుండె దడదడలాడింది. మరింత నీరసం వచ్చింది. భయం, సంతోషం నన్ను ఆవహించాయి. మొదటిసారిగా నా భర్త పాపను చూసినందుకు ఆనందం కలిగింది. మేమిద్దరం పరస్పరం చూసుకుని చాలా కాలమైంది. కానీ నాకు జరిగిన అవమానం గుర్తుకు వచ్చి ఎంతో ఆందోళనపడ్డాను. లోనికి వెళ్దామని అనేక పర్యాయాలు ప్రయత్నించాను. ధైర్యం చాలలేదు. "నీ కోడలు ఎక్కడికెళ్లింది" అని మామయ్యను నా భర్త అడగటం వినిపించింది. "పురుడు పోయటానికి 'హేవ్'లోకి వెళ్లింది" అని మామయ్య సమాధానం చెప్పాడు.

తర్వాత నా భర్తకు మామయ్య నా గదిని చూపిస్తున్నట్లు అర్థమైంది. "దోమతెరను తొలగించి పాపను చూడు" అన్నాడు మామయ్య.

గుండెలు బిగబట్టి వింటున్నాను. నా భర్త కూడా నా మాదిరిగానే ఉద్రేకపడుతూ వుంటాడు. తన బిడ్డను చూసుకుని ఆనందపడి వుంటాడు. పాప నిద్రపోతున్నప్పుడు ఆ ముద్దు మోము చూస్తూ కాలం తెలియకుండా గడిపాను. ప్రశాంతంగా మూసుకున్న ఆ కళ్లు, లేత గులాబిరంగు బుగ్గలు, నవ్వుతూ వున్న పెదాలు గుర్తుకొచ్చాయి. చాలా ఆనందమైంది. మచ్చలేని....

నా భర్త పొందుతున్న ఆనందాన్ని ఊహించుకుంటూ బయటే వుండిపోయాను. హఠాత్తుగా పాప ఏడుపు వినిపించింది. పాపను నా భర్త ఎత్తుకుని వుంటాడు. కొత్త మనిషిని చూసి పాప ఏడ్చి వుంటుందనుకున్నాను. మామయ్య పగలబడి నవ్వుతూ, "నేను ఎత్తుకోను, మీ నాన్న, అతణ్ణి నీవు ఎరగవు" అన్నాడు.

పాప ఏడ్పు మానిన తర్వాత ముద్దు పెట్టుకున్న శబ్దం వినపడింది. పాపను ముద్దాడుతూ గది బయటికి రాబోతుండడం గోడ కంతలో నుండి చూశాను.

"బాగా పాకులాడుతుంది" అన్నాడు మామయ్య. "పగలంతా అల్లరి చేయకుండా ఆడుకుంటుంది. ఇసుకలో దొర్లుతుంది కూడా. మట్టిలో ఆడడం మంచిది కాదని చెబితే అన్నింటికీ అలవాటు కావాలిలే అంటుంది నీ భార్య" అన్నాడు మామయ్య.

"పేరేమి పెట్టారు?"

"ప్రత్యేకంగా పేరు పెట్టలా. నీ నిర్ణయం కోసం ఎదురుచూస్తోంది. ఒకసారి ఒక పేరుతో పిలిస్తే మార్చడం కష్టం. అందుకని తాత్కాలికంగా 'హేయ్' అని పిలుస్తున్నాం.

'హేయ్' అని పిలుస్తున్నందుకు కాబోలు నా భర్త నవ్వడం విన్పించింది. 'హేయ్' అంటే మొదటి బిడ్డ. మొదటి కూతురు అని నేను తలచాను.

"ఎప్పుడు తిరిగి వస్తుంది?"

"ప్రసవించగానే వస్తానంది"

"హేవ్‌లో పురుడు ఎవరికి?"

"ఒక సైనికుని భార్య ప్రసవ వేదన పడుతోంది. ఆ చుట్టుపక్కల మంత్రసాని ఎవరూ లేరు. నీ భార్య కోసం తన సోదరిని పంపించింది. సైనికుని భార్య అని తెలిసి పోవద్దన్నాను. ఆమె భర్త ఫ్రెంచి వారికి తోడ్పడుతున్నాడు. అతణ్ణి ఆమె ఏ విధంగాను వ్యతిరేకించలేదు. ఆ ముఠా దోపిడీకి బయలు దేరినప్పుడు చాలామంది సైనికుల భార్యలు సంచులు పుచ్చుకుని బయలుదేరారు. అటువంటి వాళ్లు వాళ్ల తిప్పలు వాళ్లు పడతారు అని చెప్పాను. కానీ 'హేవ్' అందుకు ఒప్పుకోలేదు. వెళ్లి సహాయం చేయవలసిందేనన్నది. మన ఊళ్లో పార్టీ సభ్యులు మానవతా దృష్టితో సహాయం చేయాలన్నారు. తద్వారా ప్రస్తుతం శత్రువుకు సహాయపడే వారిని మార్చవచ్చునని వారి ఆలోచన కాబోలు"

"నీ భార్య గురించి ఏమైనా తెలిసిందా?". నా భర్త గొణుగుతూ "అంతా విన్నాను" అన్నాడు. ఇద్దరూ చాలాసేపు మౌనంగా వున్నారు. పాప నిద్రపోతుందనుకుంటాను. పాపను గదిలోకి తీసుకెళ్లారు. "నీవు అలసిపోయావు పడుకో. అర్ధరాత్రి అయినా నీ భార్య రాకపోతే రేపు ఉదయం వరకు రాకపోవచ్చు" అన్నాడు మామయ్య. ఆ మాట వినగానే లోపలికి వెళ్లాలనిపించింది. కాని, నన్ను ఏదో ఆవహించినట్లయింది.

"అంతదూరం వెళ్లిందా?"

"సైనికుని భార్యను దగ్గరలో వున్న గ్రామానికి తీసుకొచ్చినట్లున్నారు"

"అక్కడకు వెళ్లడం మంచిపనే. వారి పట్ల మనం సానుభూతిగా ఉన్నామని చెప్పాలి. అందువల్ల వారు ఒకరోజున మనపక్కకు వచ్చే అవకాశం వుంటుంది"

"కుక్కకాటుకు చెప్పుదెబ్బ పద్ధతిలో వుండాలి"

చాలాసేపు ఇంట్లో ప్రశాంతంగా ఉంది. నాభర్త నిట్టూర్పు వినిపించింది. "నీతో ఎవరు వచ్చారు?" మామయ్య అడిగాడు.

"బాంగ్! అతనితో కలిసి విందారగించాను".

"నీ భార్య గురించి ఏమైనా తెలిసిందా?".

నా భర్త గొణుగుతూ "అంతా విన్నాను" అన్నాడు.

ఇద్దరూ చాలాసేపు మౌనంగా వున్నారు. పాప నిద్రపోతుందనుకుంటాను. పాపను గదిలోకి తీసుకెళ్లారు. "నీవు అలసిపోయావు పడుకో. అర్ధరాత్రి అయినా నీ భార్య రాకపోతే రేపు ఉదయం వరకు రాకపోవచ్చు" అన్నాడు మామయ్య.

ఆ మాట వినగానే లోపలికి వెళ్లాలనిపించింది. కాని, నన్ను ఏదో ఆవహించినట్లయింది. అప్పుడు వెళ్తే భర్తకు విచారం కలుగజేస్తానేమోననుకున్నాను. వరండాలోని కర్రల బెంచిమీద కూర్చుండిపోయాను. అందరూ నిద్రపోయే వరకు అక్కడే కూర్చుని తరువాత నెమ్మదిగా మునివేళ్ల మీద నడుచుకుంటూ ఇంట్లోకి వెళ్లాను. ఇంట్లో దీపం రెపరెపకొట్టుకుంటోంది. నా భర్త గురకపెట్టి నిద్రపోతున్నాడు. అతణ్ణి నిద్రలేపడం నాకిష్టంలేదు. అయితే పాప పక్కన పడుకుని నిద్రపోవడం చూడాలనిపించింది. ఆయన ఇంటి నుండి వెళ్లి రెండు సంవత్సరాల తర్వాత వచ్చాడు. కానీ ఆయన దగ్గరకు వెళ్లడానికి ధైర్యం చాలడం లేదు. అంత బిడియం ఎందుకు పడ్డానో నీకు అర్థమై వుంటుంది.

దోమతెర పక్కకు తొలగించి చూసే సరికి పాప అతని చాతీమీద తలపెట్టుకుని హాయిగా నిద్రపోతోంది. చెంప ఆయన రొమ్ముకు ఆనించింది. అప్పుడప్పుడు నిద్రలో పెదాలు చప్పరిస్తోంది. ఆ పెదాల నుండి కమ్మని వాసన వస్తోంది. నా భర్త ముఖంలో లోగడకంటే గంభీరత ఆవరించినట్లు తోచింది. మనిషిలో పెద్ద మార్పు ఏమీ లేదుగానీ ఎండకు చర్మం కొంచెం నల్లబడింది. మంచం పక్కన కొంచెం సేపు నిలబడి నెమ్మదిగా ఇద్దరికీ దుప్పటి కప్పాను. ఆయన కదిలాడు. తొందరగా దోమతెర వేసి బయటికి జారుకున్నాను.

పడుకోడానికి ఇంకో మంచం లేదు. వలల గుట్ట మీద పడుకున్నాను. అలసిపోయి వున్నానేమో వెంటనే నిద్రపట్టింది. నిద్రలేచేసరికి బాగా పొద్దెక్కింది. నాకంటే పాపే ముందు లేచింది. పాప ఏడుపు వినిపించి నిద్ర లేచాను. నిద్ర నుండి పాప ఏడుపు లేపినంత తొందరగా మరే శబ్దం నన్ను లేపదు. "మ్మమ్మ"అని పాప ఏడవగానే నిద్రలేచాను. కళ్లు నులుముకుని చూసేసరికి నా భర్త పక్కన కూర్చుని వున్నాడు. కలగంటున్నానా? అనిపించింది. గత రాత్రి జరిగింది గుర్తుకు వచ్చింది. కొద్దిసేపటికి తేరుకుని "ఏమండీ..." అన్నాను గొణుగుతూ. ఇంకా భయం భయంగానే వుంది.

నా ముఖం వంక చూస్తూ, "నేను వచ్చాను. హేవ్‌లోకి వెళ్లావని నాన్న చెప్పాడు. పొద్దుబోయే వరకు ఎదురు చూశాను. నీవు రాలేదు. అలసిపోయి ఉండడం వల్ల నిద్రపోయాను"

"రాలేదు..."

"రాలేదు" అన్న మాట చాలా నెమ్మదిగా అన్నాను. "అక్కడ ఒకామె ప్రసవవేదన పడుతుంటే సహాయం చేయడానికి వెళ్లాను. తెల్లవారుజామున తిరిగి వచ్చాను" అన్నాను.

"గదిలో పడుకోకపోయావా?"

మాట్లాడలేదు. తల వంచుకుని నిలబడ్డాను.

(హేవ్‌తో భర్త ఏం మాట్లాడాడు? ఆమెను ఓదార్చాడా?)

సినిమా కబుర్లు


'నాన్ కడవుల్'లో ఓ దృశ్యం

బాలీవుడ్‌కు అవార్డుల పంట
తమిళం కూడా రొంబ సంతోష...
తెలుగే... ప్చ్...

గౌతం మీనన్

నటీనటుల విషయానికి వస్తే 'జాగ్వా' అనే మరాఠీ చిత్రానికి గాను ఉపేంద్ర లిమాయే జాతీయ ఉత్తమ నటుడుగా ఎంపికయ్యారు. అంతకంటే కూడా ప్రియాంక చోప్రా జాతీయ ఉత్తమ నటిగా రావడం ఈసారి ఎక్కువ ప్రచారం పొందింది. చాలా కాలంగా నటిస్తున్నా పెద్ద విజయాలు గాని, పురస్కారాలు గాని దక్కని ప్రియాంకలో ఇది గొప్ప ఉత్సాహం నింపింది. ఆమె మోడల్ పాత్ర ధరించిన 'ఫ్యాషన్' ముందే బాగా పేరు తెచ్చిపెట్టింది. 'ఫ్యాషన్' ప్రపంచంలోని చీకటి కోణాలను వెలుగులోకి తెచ్చిన చిత్రమిది. ఈ లోగానే విడుదలైన 'రాక్ ఆన్'లో కూడా ఆమె మంచి నటి అని నిరూపించింది. గతంలో అందాల సుందరులు ఐశ్వర్యా రాయ్, సుస్మితాసేన్ వంటివారు మంచితారలేనా అన్న మీమాంస చాలా కాలం సాగింది. ప్రియాంక కూడా ఆ సమస్యను ఎదుర్కొన్నప్పటికీ ఎట్టకేలకు బయటపడటానికి 'ఫ్యాషన్' చిత్రం సోపానమైంది. ఈ వార్త వచ్చేసరికి ఆమె 'అంజానీ అంజానీ' షూటింగ్ కోసం న్యూయార్క్‌లో వుందట. ఇదే చిత్రంలో ఆమెతో పాటు నటించిన కంగనా రౌనత్ ఉత్తమ సహాయ నటిగా ఎంపికవడం దర్శకుడు మధు భండార్కర్‌కు మరో సంతోషం. ఈమె ఇప్పటికే తెలుగు సినిమా 'ఏక్ నిరంజన్'లో నటించి తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది.

- పీపీ

56వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రకటనలో తమిళానికి పెద్ద పీట దక్కింది. బాలూ మహేంద్ర శిష్యుడైన దర్శకుడు బాల తన 'నాన్ కడవుల్ (తెలుగులో నేనే దేవుణ్ని) చిత్రానికి గాను ఉత్తమ దర్శకుడుగా ఎంపికై సంచలనం సృష్టించాడు. ఈ చిత్రం అనేక ప్రశంసలు పొంది అవార్డు వూహాగానాలలో ముందు వరసలో వున్నప్పటికీ ఆయన జాతీయ ఉత్తమ దర్శకుడుగా రావడం మాత్రం అందరి అభినందనలు పొందింది. బాల ఇదివరలో అనేక చిత్రాలు అందించినా అవార్డు పొందడం ఇదే మొదలు. బాలూ మహేంద్ర భార్య అఖిల మొదటగా బాలకు ఈ వార్త తెలియజేసినప్పుడు ఆయన ఆనందంతో పొంగిపోయాడట. అయితే అందులోనూ ఒక కొరత ఏమంటే తన చిత్రంలో చాలా బాగా నటించిన ఆర్య, పూజలలో ఒకరికైనా అవార్డు దక్కుతుందని ఆశించితే దక్కలేదని ఒకింత నిరుత్సాహం వ్యక్తం చేశాడు బాల.

బాల ఒక్కడికే గాక గౌతం మీనన్ దర్శకత్వం వహించిన 'వరణం అయరం' చిత్రం ఉత్తమ జాతీయ తమిళ చిత్రంగా ఎంపికవడం మరో సంతోషం కలిగించింది. గౌతం మీనన్‌కు ఇది మొదటి అవార్డు కావడంతో ఆనందం అవధులు దాటిందంటున్నాడు. పైగా ఈ చిత్ర కథ తన స్వంత జీవితంతో ముడిపడి వుందంటాడు. నాన్న పాత్ర తన తండ్రిని పోలి వుందట. ఇంజనీరింగ్ చదివిన తాను సినిమా రంగంలోకి వెళ్తానంటే నాన్న తేలిగ్గా ఒప్పుకోవడం ఆయనకు ఎంతో సంతోషం కలిగించిన సంగతి. సూర్య ఈ చిత్రంలో చాలా బాగా నటించాడు.ఇంతకూ గౌతం మీనన్ గత చిత్రాలు కూడా అటు కళాభిరుచితో పాటు వ్యాపారాత్మకంగానూ విజయం సాధించడం అరుదైన విశేషం. ఈయన లోగడ 'కక్కా కక్కా, మిన్నులే, వెట్టియతు వేలాయతు' వంటి చిత్రాలందించాడు. వాటితో పోలిస్తే ఇప్పుడు అవార్డు వచ్చిన 'వరణం అయరం' విజయమే తక్కువ కాని విమర్శకుల ప్రశంసలు మాత్రం పుష్కలంగా లభించాయి. ఈ అవార్డుతో పొంగి పోతున్న గౌతం పెద్ద విందు ఇస్తున్నాడట.

మళయాల చిత్రం 'బయోస్కోప్'కు జాతీయ చలన చిత్రాభివృద్ధి సంస్థ ఎన్ఎఫ్‌డిసి ప్రత్యేక జూరీ అవార్డు అందించింది. వీటితో ఇటు కన్నడ చిత్రం 'గుబచిగను' కూడా ఉత్తమ

'1940లో ఒక గ్రామం'లో...

'అంతహీన్'లో ఓ దృశ్యం

'జాగ్వా'లో...



ప్రాంతీయ చిత్రంగా ఎంపికైంది.

మొత్తంపైన దక్షిణాది భాషల్లో తెలుగుకే ఈసారి అవార్డులు తక్కువగా వచ్చాయి. తెలుగు నుంచి మొత్తం ఎనిమిది చిత్రాలు అవార్డు కోసం ఎంట్రీలుగా వెళ్లాయి. అఖండ విజయం సాధించిన 'అరుంధతి'లో సాంకేతిక నైపుణ్యానికి ప్రత్యేక దృశ్యాలకు అవార్డు లభిస్తుందని నిర్మాత శ్యాం ప్రసాద్ రెడ్డి ఆశించినా ఫలితం దక్కలేదు. గతంలో 'అంజి' చిత్రంలో ఇంతకంటే తక్కువ నైపుణ్యమే చూపినా ఆయనకు అవార్డు వచ్చిందని, ఈ సారి నిరుత్సాహం కలిగిందని అంటున్నారు. 'అరుంధతి'లో మూఢ నమ్మకాలను అతిగా చూపించిన కారణంగానే బహుశా అవార్డుకు దూరమై వుండొచ్చనేది మరో అభిప్రాయం. అలాగే క్రిష్ దర్శకత్వం వహించిన 'గమ్యం' భిన్నమైన చిత్రంగా పేరొంది అనేక భాషల్లో పునర్నిర్మాణమైంది. దానిపై ఆశలు కూడా నెరవేరలేదు. చివరకు చలం కథ ఆధారంగా తీసిన '1940లో ఒక గ్రామం' సినిమాకు ఉత్తమ ప్రాంతీయ అవార్డు లభించింది. అయితే ఈ చిత్రం విక్రేతలెవరినీ ఆకర్షించలేక విడుదలకు నోచుకోలేకపోయింది. ఈ చిత్రంలో బాలాదిత్య, శ్రీరమ్యలు ప్రధాన పాత్రలు పోషించగా నంది నరసింహ తొలిసారిగా దర్శకత్వం వహించారు. కుల వ్యవస్థ అంతరాలు ప్రధానాంశంగా తీసిన ఈ చిత్రంలో బాలాదిత్య వేదాధ్యయనం చేసే దళిత యువకుడి పాత్ర ధరించారు. తెలుగు సినిమాలకు కాకపోయినా తెలుగు వారికి ఈసారి అవార్డులు దక్కాయి. ఫిరాఖ్ హిందీ చిత్రానికి గాను ఎడిటింగ్ పురస్కారం పొందిన శ్రీకర్ ప్రసాద్, 'జోధా అక్బర్' చిత్రంలో ఒక పాటకుగాను అవార్డు పొందిన రేఖా ప్రకాష్‌లు కూడా తెలుగు వారే.

ఉత్తమ గాయనీ గాయకులుగా హరిహరన్, శ్రేయా ఘోషాల్‌లు ఎంపికైనారు.

మానవ సంబంధాలు ప్రధానాంశంగా అనిరుధ్‌రాయ్ దర్శకత్వంలో రూపొందిన బెంగాలీ చిత్రం 'అంతహీన్' జాతీయ ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. బెంగాలీలకు అవార్డులు రావడం కొత్తేమీ కాదు. వాస్తవంలో ఒకప్పుడు సత్యజిత్ రే, మృణాళ్ సేన్ వంటివారికే వరుసగా అవార్డులు దక్కుతుండేవి. తమిళ మళయాల దర్శకులు ఆ బెంగాలీ నవ్యతనూ, వాణిజ్య విలువలనూ మేళవించి మెప్పించడం మొదలెట్టాక ఈ పరిస్థితి కొంత మారింది. అత్యధిక ప్రజాదరణ పొందిన చిత్రంగా 'ఓయే లక్కీ ఓయే' (హిందీ) ఎంపికైంది. హిందీ చిత్రాలు 'ఫ్యాషన్, రాక్ ఆన్, ఫిరాఖ్, జోధా అక్బర్'లు రెండు చొప్పున పురస్కారాలు సాధించాయి. ఈ విధంగా ఈ సారి అవార్డులలో బాలీవుడ్‌దే పైచేయి అయింది. ఇది హిందీ చిత్రరంగంలో మారుతున్న ధోరణులను కూడా ప్రతిబింబిస్తోంది.

ఇక నటీనటుల విషయానికి వస్తే 'జాగ్వా' అనే మరాఠీ చిత్రానికి గాను ఉపేంద్ర లిమాయే జాతీయ ఉత్తమ నటుడుగా ఎంపికయ్యారు. అంతకంటే కూడా ప్రియాంక చోప్రా జాతీయ ఉత్తమ నటిగా రావడం ఈసారి ఎక్కువ ప్రచారం పొందింది. చాలా కాలంగా నటిస్తున్నా పెద్ద విజయాలు గాని, పురస్కారాలు గాని దక్కని ప్రియాంకలో ఇది గొప్ప ఉత్సాహం నింపింది. ఆమె మోడల్ పాత్ర ధరించిన 'ఫ్యాషన్' ముందే బాగా పేరు తెచ్చిపెట్టింది. 'ఫ్యాషన్' ప్రపంచంలోని చీకటి కోణాలను వెలుగులోకి తెచ్చిన చిత్రమిది. ఈ లోగానే విడుదలైన 'రాక్ ఆన్'లో కూడా ఆమె మంచి నటి అని నిరూపించింది. గతంలో అందాల సుందరులు ఐశ్వర్యా రాయ్, సుస్మితాసేన్ వంటివారు మంచితారలేనా అన్న మీమాంస చాలా కాలం సాగింది. ప్రియాంక కూడా ఆ సమస్యను ఎదుర్కొన్నప్పటికీ ఎట్టకేలకు బయటపడటానికి 'ఫ్యాషన్' చిత్రం సోపానమైంది. ఈ వార్త వచ్చేసరికి ఆమె 'అంజానీ అంజానీ' షూటింగ్ కోసం న్యూయార్క్‌లో వుందట. ఇదే చిత్రంలో ఆమెతో పాటు నటించిన కంగనా రౌనత్ ఉత్తమ సహాయ నటిగా ఎంపికవడం దర్శకుడు మధు భండార్కర్‌కు మరో సంతోషం. ఈమె ఇప్పటికే తెలుగు సినిమా 'ఏక్ నిరంజన్'లో నటించి తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది.

ఈ సారి చలన చిత్ర పురస్కారాలలో

డాక్యుమెంటరీలకు సంబంధించి కూడా చెప్పుకోదగ్గ విశేషాలున్నాయి. రాజీవ్ గాంధీ హత్యోదంతాన్ని యథాతథంగా పునర్నిర్మిస్తూ ఫిలింస్ డివిజన్ రూపొందించిన చిత్రానికి పురస్కారం దక్కింది. అంతకంటే సాహసోపేతమైన ప్రయత్నం మణిపూర్‌లో సైనిక దళాల అత్యాచారాలకు వ్యతిరేకంగా సాగిన సత్యాగ్రహోద్యమాన్ని ఎపిఎస్‌పిఎ 1958 పేరుతో తెరకెక్కించడం. దానికి కూడా అవార్డు రావడంతో దర్శక నిర్మాతల కృషి సఫలమైంది. ఇంగ్లీషులో వచ్చిన 'బాలీవుడ్ మెలోడీస్' పుస్తకానికి ఉత్తమ సినీ గ్రంథంగా మన్నన లభించింది.

ఇంతకూ ఈ దఫా అవార్డుల ఎంపికపై అనేక విమర్శలు కూడా వచ్చాయి. ముఖ్యంగా మరాఠీ రంగానికి ఉద్దేశపూర్వకంగానే పురస్కారమిచ్చారని, తమిళ చిత్రాలకు కూడా అలాగే రాజకీయ కారణాల వల్ల పక్షపాతం చూపారని పెద్ద దుమారం చెలరేగింది. ఒక విభాగంలో న్యాయ నిర్ణాయక బృందంలో వున్న సుధీష్ పచౌరి తనకు సిఫార్సులతో ఫోన్ కాల్స్ వచ్చాయని చేసిన వ్యాఖ్యలు ఈ వివాదాన్ని ఇంకా పెద్దది చేశాయి. అయితే అదే వేదికపై వున్న మంత్రి తమ శాఖ నుంచి ఎవరూ ఫోన్ చేయలేదని ఆయనతో స్పష్టీకరణ ఇప్పించారు.

ఎవరికి ఏ అవార్డులు వచ్చినా ఏవో విమర్శలు వుంటూనే వుంటాయి గనక దీనిపై పెద్ద తర్జనభర్జనలు అవసరం వుండదు. కాకపోతే ఈసారి న్యాయనిర్ణేతల సంఘం సినిమాలపై సెన్సార్ నిబంధనలు సరళతరం చేయాలని సిఫార్సు చేయడం కొత్త పరిణామం. ఎందుకంటే సినిమాలు చేయి దాటిపోతున్నాయని, శృంగారం శ్రుతి మించిపోతున్నదని అందరూ ఆందోళన చెందుతున్న సమయంలో సృజనకు ఆటంకం కలిగించే ఆంక్షలు వుండతగవని జ్యూరీ చెప్పడంలో పరమార్థమేమిటో వారికే తెలియాలి. ఏమైతేనేం విజేతలకు అభినందనలు.

★

'వరణం అయిరం'లో ఓ దృశ్యం

ఒరిస్సా ఆలయాలకు ప్రసిద్ధి చెందిన రాష్ట్రం. పూరీ జగన్నాథాలయం, కోణార్క్‌లోని సూర్యదేవాలయం, భువనేశ్వర్‌లోని రాజరాణి దేవాలయం ప్రపంచ ప్రసిద్ధిగాంచినవి. ఒరిస్సాకు రాజధాని, ముఖ్యద్వారం అయిన భువనేశ్వర్ పర్యాటకులను ఎంతగానో అలరిస్తుంది. అక్కడి ఆలయాలకు, వాస్తుశిల్ప శాస్త్రానికి ప్రతిష్ఠాత్మకమైన చరిత్ర ఉంది. ఆసియాలోనే అతిపెద్ద సరస్సు అయిన చిలుక సరస్సు అందమైన దృశ్యాలకు నిలయం.

లింగరాజు ఆలయం

ఊసులాడే ఆలయాలు



పూరీజగన్నాథాలయం



రథచక్రం

ఒరిస్సా అభివృద్ధికి కాస్త దూరంగా ఉన్నట్టనిపించినా చారిత్రాత్మకంగా మంచి పేరున్న రాష్ట్రమే. భారతజాతి గర్వించదగ్గ శిల్పసంపద ఉందిక్కడ. 'గోల్డెన్ ట్రయాంగిల్'గా పేరు పొందిన పూరి-కోణార్క్-భువనేశ్వర్‌లను జీవితంలో ఒక్కసారైనా ప్రతిఒక్కరూ చూడాల్సిన పర్యాటక ప్రదేశాలుగా చెప్పుకుంటారు.

పూరీజగన్నాథాలయం

ఆదిశంకరాచార్యులు నిర్మించిన నాలుగు పీఠాలలో పూరీలోని జగన్నాథస్వామి ఆలయం ఒకటి. 11వ శతాబ్దంలో దీన్ని నిర్మించారు. సుమారు 214 అడుగుల ఎత్తులో నిర్మించడం వల్ల అల్లంత దూరం నుంచి కొట్టొచ్చినట్టు కనపడుతుంది.

ప్రధాన ఆలయం చుట్టూ అనేక చిన్న చిన్న ఆలయాలు ఉంటాయి. ఈ ఆలయానికి నాలుగు వైపులా ప్రవేశ ద్వారాలున్నాయి. ఇక్కడ దైవదర్శనానికి క్యూ పద్ధతి పాటించరు. ఎప్పుడూ రద్దీగానే ఉంటుంది. ఈ ఆలయంలో ప్రతి రోజూ కొన్ని వేల మందికి అన్నదానం చేస్తారు. ప్రత్యేక దర్శనం కావాలంటే టికెట్టు కొనుక్కుని వెళ్లొచ్చు. సోదరి సుభద్ర, సోదరుడు బలరాములతో జగన్నాథుడు ఇక్కడ కొలువు తీరి ఉన్నాడు. ఇద్దరు అన్నదమ్ముల మధ్య ముద్దుల సోదరి సుభద్ర ఎంతో దర్జాగా కనిపిస్తుంది. చాలా పెద్దగా ఉండే ఆ విగ్రహాలను కొయ్యతో చేశారు. 12 సంవత్సరాలకొకసారి వీటిని కొయ్యతో తయారుచేసి పాత వాటి స్థానంలో కొత్తవాటిని ఉంచుతారట. వీటిని ఒక ఎత్తైన ఫలకం మీద ఉంచుతారు.

ఈ ఆలయం దగ్గర ఒక మ్యూజియం ఉంటుంది. దీనిలో జగన్నాథుని చరిత్రను తెలిపే పెయింటింగులనేకం ఉంటాయి. ఈ ఆలయానికి ఒక ప్రత్యేకమైన వంటగది ఉంది. ఇది ప్రపంచంలోనే పెద్దది. ఇక్కడ 56 రకాల ప్రసాదాలను తయారుచేస్తారు. ఆలయ ముఖ్య ప్రవేశ ద్వారం ఎదురుగా విశాలమైన రోడ్డు ఉంది. జూన్-జులైలో జరిగే జగన్నాథుని ఆలయంలో రథయాత్ర పండుగ పర్యాటకులకు పెద్ద ఆకర్షణగా ఉంటుంది. ఆ సమయంలో ఆలయం ఎదురుగా ఉండే రోడ్డులో ఇసుకేస్తే రాలనంత జనం ఉంటారు. ఇంకా పూరీలో గుండిచ ఆలయం, జగన్నాథ బల్లవ్ మఠం కూడా చూడొచ్చు.

సూర్యదేవాలయం

పూరీకి దగ్గరలోని కోణార్క్‌లో సూర్యదేవాలయం ఉంది. పూరీ నుంచి కోణార్క్‌కు గంటన్నర ప్రయాణం. 13వ శతాబ్దంలో కోణార్క్‌లో సూర్యుని రథం ఆకారంలో నరసింహరాజు ఒక దేవాలయాన్ని నిర్మించారు. సూర్యదేవాలయానికి ముందు ఒక నృత్య మంటపం ఉంది. దీనికి రెండు వైపులా రెండు ఏనుగులు, వాటిపై సింహాలు ఉంటాయి.

ఆలయం చుట్టూ 21 రథచక్రాలను చెక్కారు. ఒక చక్రం సమయాన్ని తెలుపుతుంది. మరోటి మానవుని జీవిత విశేషాలను తెలుపుతుంది. ఈ

విధంగా ఇవి ఒక్కోటి ఒక్కో భావాన్ని వెలిబుచ్చుతాయి. ఈ రథచక్రాలు 10 అడుగుల వ్యాసార్థంతో 8 అంగుళాల మందంతో ఉంటాయి. ఈ ఆలయగోడల మీద వివిధ దశల వారిని మెప్పించే శిల్పాలుండడం విశేషం. కింది భాగంలో పిల్లలను ఎక్కువగా ఆకర్షించే ఏనుగు, డ్రాగన్ వంటి వివిధ రకాలైన జంతువుల బొమ్మలను చెక్కారు. మధ్యభాగంలో శృంగారపరమైన శిల్పాలు, పైభాగంలో ఆధ్యాత్మిక చింతన కలిగించేవి చెక్కి ఉన్నాయి. తల్లి ఒడిలో కూర్చుని చిన్నపాప పెళ్లి ఊరేగింపుకు వెళ్తున్న శిల్పాన్ని బట్టి ఆనాడు బాల్య వివాహాలను ప్రోత్సహించిన విషయం మనకు అర్థమౌతుంది. పాశ్చాత్యులు రాజుకు జిరాఫీని బహుమతిగా ఇచ్చినట్టు, ఓ వ్యక్తి డైనింగ్ టేబుల్ మీద కూర్చుని స్పూన్‌తో తింటున్నట్టు ఉండే శిల్పాలను కూడా మనమిక్కడ చూడొచ్చు. ఒక్కో శిల్పంలో ఒక్కో భావం ఉట్టిపడుతుంది. ఈ శిల్ప సౌందర్యాన్ని చూసిన రవీంద్రనాథ్‌ఠాగూర్ ఈ విధంగా అన్నాడట. 'ఇక్కడి శిల్ప భాష మానవుడి భాషను మించిపోతుంది'.

సూర్యదేవాలయానికి మూడు వైపులా నిలువెత్తు సూర్య విగ్రహాలున్నాయి. ఇవి ఆకుపచ్చని గ్రానైట్‌తో చేసినవి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లోని సూర్యుడికి ప్రతి రూపాలుగా వీటిని చెక్కారట. రథాన్ని లాగుతున్నట్టుగా ఆలయం ముందు భాగంలో గుర్రాలను కూడా చెక్కారు.

సూర్యదేవాలయానికి వెనుక భాగంలో సూర్యుడి భార్యయైన ఛాయాదేవి ఆలయం ఉంది. ఈ గుడి పరిసరాల్లో అనేక దుకాణాలున్నాయి.

చిలుక సరస్సు

కోణార్క్ నుంచి చిలుక సరస్సుకు రెండు గంటల ప్రయాణం. ఈ సరస్సు సముద్రాన్ని తలపిస్తుంది. సరస్సు మధ్యమధ్యలో ద్వీపాలు కనిపిస్తాయి. ఒక్కో ద్వీపం విశిష్టతను బట్టి వాటికి పేర్లు పెట్టారు. 'హనీమూన్, బ్రేక్‌ఫాస్ట్, ...వంటి పేర్లు. రకరకాల పక్షుల కిలకిలరావాలతో అక్కడి వాతావరణమంతా సందడిగా ఉంటుంది. సరస్సులో ముఖ్యమైన ప్రదేశం డాల్ఫిన్ ప్రాంతం. ఒక పక్క పక్షుల బారులు, మరోపక్క డాల్ఫిన్ల కేరింతలు చూస్తుంటే .... మనసుకు హత్తుకునే ఆ వాతావరణాన్ని వదిలి రావాలనిపించదు. ఇది పక్షుల ప్రేమికులకు సర్గధామం లాంటిది. సరస్సు బంగాళఖాతంలో కలిసే ప్రదేశమూ ఎంతో అందంగా ఉంటుంది. అక్కడ మన ముందే సముద్రంలోంచి ముత్యపు చిప్పలు తీసుకువచ్చి వాటిని పగుల గొట్టి ముత్యాలను అమ్ముతారు. బీచ్ రోడ్డు పర్యాటకులతో సందడిగా ఉంటుంది. ఇక్కడ పెద్ద పెద్ద ఇసుక తెన్నెలుంటాయి. వాటిపై సైకత శిల్పాలను ఎంతో అందంగా తీర్చిదిద్దుతారు. ఇక పౌర్ణమి రోజు పిండి ఆరబోసినట్లుగా ఉండే వెన్నెలలో మెరిసే ఆ సముద్రపు దృశ్యం జీవితంలో ఎన్నడూ మరిచిపోలేని ముద్రను వేస్తుంది మనసులో. ఆ దృశ్యాన్ని ఎంతసేపు చూసినా తనివితీరదేమో.

సముద్ర తీర ప్రాంతంలోని ప్రకృతి సుందర దృశ్యాలు మనసును ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఒరిస్సాలో ఉన్న బీచుల్లో పూరీ బీచ్ చాలా బాగుంటుంది.

లింగరాజు ఆలయం

భువనేశ్వర్ ఆలయాలకు ప్రసిద్ధి. పర్యాటకులకు చక్కని ఆహ్లాదాన్ని కలిగించే ప్రదేశం. 11వ శతాబ్దానికి చెందిన లింగరాజు ఆలయం తప్పకుండా చూడవలసిన ఆలయం. 127 అడుగుల ఎత్తున్న ఈ ఆలయం శిఖరం ఆకాశాన్నంటుతుందా అన్నట్టుంటుంది. దీన్ని సున్నపు గచ్చు లేకుండా నిర్మించారట. ఈ ఆలయంలోపలి భాగాలు పర్యాటకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తాయి. ఈ ఆలయంలోకి హిందువులను మాత్రమే అనుమతిస్తారు. అందుకే లార్డ్ కర్జన్ ఆనాడే ఒక ఎత్తైన మండపాన్ని నిర్మించాడు. ఈ ఆలయానికి దగ్గరలో బిందుసాగర్ సరస్సు ఉంది. దీనికి చుట్టుపక్కల అనేక ఆలయాలున్నాయి.

భువనేశ్వర్‌కి 8 కిలోమీటర్ల దూరంలో దయా నది ఉంది. ఈ నదీ తీరంలో ధౌలి పర్వతం ఉంది. ఎప్పుడూ యుద్ధాలు చేసే అశోక చక్రవర్తి ఈ ప్రాంతంలోనే శాంతికాముకుడిగా మారాడట. ఒరిస్సాలో జరిగిన కళింగ యుద్ధం అశోకుడు బౌద్ధం స్వీకరించడానికి కారణమైంది. దేశంలోని అతిపెద్ద చారిత్రక యుద్ధాలలో ఇది ఒకటి. దానికి గుర్తుగా రాతిని తొలుచుకుని వస్తున్నట్టుగా ఒక ఏనుగును చెక్కారు. ఈ శిల్పం 3వ శతాబ్దానికి చెందినదిగా పేర్కొంటారు. ఆ కాలానికే చెందిన శాంతి స్థూపమొకటి ఇక్కడుంటుంది.

కవల కొండలుగా పేరు గాంచిన కుమార్‌గిరి, కుమారిగిరిలను ఖాండగిరి, ఉదయగిరి అంటారు. ఇక్కడి అనేక రాతి గుహలు పర్యాటకులను ఎంతగానో అలరిస్తాయి. అవన్నీ జైన సన్యాసుల కోసం 1, 2వ శతాబ్దంలో కట్టించినవి. అందులో హాతిగుంఫ (ఏనుగుల గుహ) అత్యద్భుతంగా ఉంటుంది. ఇది భారతదేశంలోని పాలి చరిత్రలో ముఖ్య నమూనాగా ఉంది. భారత దేశంలోనూ, విదేశాలలోనూ బుద్ధిజం వ్యాప్తి చెందడానికి ఒరిస్సా ప్రముఖ పాత్ర పోషించింది. ఇక్కడ బుద్ధుడి శిల్పాలు, విగ్రహాలు అనేకం ఉన్నాయి.

★

చిలుక సరస్సులో...

ఒక్కో ద్వీపం విశిష్టతను బట్టి వాటికి పేర్లు పెట్టారు. 'హనీమూన్, బ్రేక్‌ఫాస్ట్, ...వంటి పేర్లు. రకరకాల పక్షుల కిలకిలరావాలతో అక్కడి వాతావరణమంతా సందడిగా ఉంటుంది. సరస్సులో ముఖ్యమైన ప్రదేశం డాల్ఫిన్ ప్రాంతం. ఒక పక్క పక్షుల బారులు, మరోపక్క డాల్ఫిన్ల కేరింతలు చూస్తుంటే .... మనసుకు హత్తుకునే ఆ వాతావరణాన్ని వదిలి రావాలనిపించదు. ఇది పక్షుల ప్రేమికులకు సర్గధామం లాంటిది. సరస్సు బంగాళఖాతంలో కలిసే ప్రదేశమూ ఎంతో అందంగా ఉంటుంది. అక్కడ మన ముందే సముద్రంలోంచి ముత్యపు చిప్పలు తీసుకువచ్చి వాటిని పగుల గొట్టి ముత్యాలను అమ్ముతారు. బీచ్ రోడ్డు పర్యాటకులతో సందడిగా ఉంటుంది. ఇక్కడ పెద్ద పెద్ద ఇసుక తెన్నెలుంటాయి. వాటిపై సైకత శిల్పాలను ఎంతో అందంగా తీర్చిదిద్దుతారు. ఇక పౌర్ణమి రోజు పిండి ఆరబోసినట్లుగా ఉండే వెన్నెలలో మెరిసే ఆ సముద్రపు దృశ్యం జీవితంలో ఎన్నడూ మరిచిపోలేని ముద్రను వేస్తుంది మనసులో. ఆ దృశ్యాన్ని ఎంతసేపు చూసినా తనివితీరదేమో.


సూర్యదేవాలయం

క్రైమ్ కథ

చిక్కిన హంతకుడు

- యర్నాగుల సుధాకరరావు

"మీ అన్నను చంపింది చందూ అని నీవు ఎలా నిర్ధారించి అతడి కోసం వెతికివెతికి కలకత్తాలో ఉన్నట్టు తెలుసుకుని పోలీసుల సాయం కోరావు? ఈ రోజు కోర్టులో నిలబడ్డాడు నిందితుడు. కోర్టుకు కావాల్సింది బలమైన సాక్ష్యాలు. అవి సరిగ్గా లేవు. నీవేమైనా చెప్పదలుచుకుంటే చెప్పు"

"ఇతడే చందూ. పన్నెండేళ్ల క్రితం ఒక మర్డర్ చేశాడు. పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని పారిపోయాడు. వీడి చేతిలో చనిపోయింది స్వయాన నా అన్న. ఆ తరువాత ఇంటికి పెద్దదిక్కు అయిన అన్న లేనందువల్ల ఊరు వదిలి బతుకుదారి వెతుక్కుంటూ దూరంగా వెళ్లిపోయాం. మళ్లీ ఇప్పుడు ఇదే ఊరు వచ్చేశాం. అప్పటి పత్రికల క్లిప్పింగ్సు నాదగ్గర ఉన్నాయి" ఇన్‌స్పెక్టర్‌కు అర్థమయ్యేలా చెప్పాడు కిషోర్.

ఆ మాటలకు పెద్దగా ఆవులిస్తూ "ఎప్పుడో పన్నెండేళ్లక్రితం చంపేసి ఎటో పారిపోయిన చందూగాడిని పట్టుకోమని కోరుతున్నావా? ఇప్పుడు ఎవరినని పట్టుకోను. అదెప్పుడో క్లోజ్ అయిన కేసు" పేపర్ కటింగ్సు చదవకుండానే పక్కకు గిరాటేశాడు.

"సార్! నా అన్న వ్యాపారుల దగ్గర ఎకౌంట్సు రాసేవాడు. మా కుటుంబం మా అన్న రెక్కల కష్టంమీద ఆధారపడి ఉండేది. ఒకసారి వ్యాపారుల డబ్బు బ్యాగ్‌లో వేసుకుని వస్తుంటే చందూ దోచుకున్నాడు. మా అన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డబ్బు చేతికి వచ్చింది. చందూ నాలుగు నెలలు జైలుకు పోయాడు. అటునుంచి వచ్చాక కసితో అన్నను కత్తితో పొడిచాడు. రెండు రోజుల తరువాత మా అన్న ఆసుపత్రిలో చచ్చిపోయాడు" కిషోర్ అప్పటి కథనాన్ని విడమర్చి చెప్పాడు.

"ఇప్పుడా ఆ కథ ఎందుకు? విషయానికి వచ్చేయ్"

"సార్ చందూ ఒకచోట ఉండడం నేను చూశాను. అక్కడ పోలీసులకు చెబితే మా పరిధి కాదు. పైగా పన్నెండేళ్లక్రితం అని చెబుతున్నావు. మా వల్ల అయ్యే పనికాదని పొమ్మన్నారు. మరి ఆ నేరస్థుడు అలా తప్పించుకుని పోవడమేనా? మాకు న్యాయం చేయలేరా సార్? అని అడిగాను. చట్టం అలా ఉందన్నారు"

"ఇంతకీ ఎక్కడున్నాడు చందూగాడు?"

"ముంబైలో నేను కళ్లారా చూశాను. అక్కడ వాడు ఒక దాదా వద్ద ఉన్నాడు"

"అసలు వర్కవుట్ కాదు. రాష్ట్రం మారిపోయాడు. ఎందుకు కేసును తిరగతోడడం. మా చుట్టూ, ఆ ఖూనీకోర్ చుట్టూ తిరిగేకంటే నీపని చేసుకో. నాలుగు డబ్బులు గడించుకుని హ్యాపీగా ఉండొచ్చు" చెప్పి టేబుల్ మీద ఉన్న క్లిప్పింగ్సును చేత్తో కిషోర్ ముందుకు తోశాడు.

కిషోర్ బయటికి వచ్చాడు. ఏం చేయాలో పాలుపోలేదు. వెంటనే ఒక ఐడియా వచ్చింది. ఏకంగా హైకోర్టు జడ్జికి తనగోడు అంతా వెళ్లబోసుకుని ఒక లేఖ రాశాడు. వారం గడిచిపోయింది. సడన్‌గా పోలీసు వ్యాన్ వచ్చి ఇంటి ముందు ఆగింది. అందులోంచి బిలబిలమని పోలీసులు దిగారు. కిషోర్ ఆశ్చర్యపోయాడు. వారం క్రితం కలిసిన ఇన్‌స్పెక్టర్ హడావిడిగా కిందకు దిగాడు. అతణ్ని చూడగానే ఎదురెళ్లాడు.

"ఏయ్ కిషోర్ ఆ రోజు వచ్చి ఏదో చెప్పావనుకున్నాను. నాకు అప్పుడు తెచ్చిచూపిన వివరాలు కావాలి. ఆ చందూ కోసం కావాలంటే అండమాన్ వెళ్లడానికైనా సిద్ధమే. ముంబైకి ఒక టీమును పంపుతున్నాను. మీ అన్నను చంపిన చందూను అరెస్టు చేసి తీసుకొస్తాం"

ఆ పక్కనే ఉన్న మరో ఇన్‌స్పెక్టర్ గుర్రుగా చూస్తూ "నువ్వేనా కిషోర్‌వి? మామీద పైఅధికారులకు ఫిర్యాదులు చేస్తే నీ పని అయిపోతుందనుకున్నావా? మళ్లీ మేమే అక్కడికి వెళ్లి రావాలి. దొరికితే తెస్తాం లేకుంటే లేదు. పెన్ను, కాగితం ఉన్నాయి కదా అని పోలీసుల మీద ఫిర్యాదులు పెట్టేయకు. ఒకసారి అన్నీ ఆలోచించుకో! ఇక్కడ మేం తేరగా లేము, పీకలోతు కేసుల్లో మునిగి ఉన్నాం. నువ్వు పాతకాలం మర్డర్ కేసును మా మెడకు చుట్టావు" కరుకుగానే అన్నాడు.

"సార్ మీకు వివరాలు ఇచ్చానా లేదా" అని "నాకు పది నిమిషాల ముందు మీ జిల్లా అధికారిగారే ఫోన్‌చేసి మావాళ్లు వచ్చి కలిశారా అని స్వయంగా అడిగారు" వారిముందు సెల్ ఓపెన్‌చేసి ఆ నెంబర్ చూపాడు. ఆ వచ్చిన పోలీసులు గుటకలు మింగేసి ఇతరత్రా ఏమీ అడగకుండా ఇచ్చిన పత్రికల క్లిప్పింగ్సు తీసుకుని ముంబై బయల్దేరి వెళ్లిపోయారు.

ముంబై అంతా గాలించి చందూని వెతికిపట్టుకుని తీసుకొచ్చి కోర్టులో ప్రవేశపెట్టారు. మూతపడిన లాంగ్‌పెండింగ్ కేసును తిరిగి ఓపెన్ చేశారు. చందూ మీద ముంబైలో అనేక కేసులు కోర్టులో నడుస్తున్నాయి. అతడు నేరవృత్తితో బతుకుతున్నాడు. తాను పన్నెండేళ్లక్రితం మర్డర్ చేయలేదని ఆ చేసినది వేరేవాడని, అయితే తనను పోలీసులు అనుమానించి తన మీద కేసు నమోదు చేసి తన గురించి వెతికారు. దాంతో తాను భయపడి పారిపోయానని కోర్టులో చెప్పాడు. అప్పటి ప్రత్యక్షసాక్షులు నలుగురిలో ముగ్గురు ఉన్నా చందూను పోల్చుకోలేకపోయారు. ఇతడు కాడేమో అని పదేపదే చెప్పారు. నేర నిరూపణకు ఎలాంటి సాక్ష్యాలూ బలంగా పోలీసులు పెట్టలేకపోయారు. ఆ ఫైలును చెదలు తినేయడం వల్ల అప్పటి వేలిముద్రలు కూడా సరిగ్గాలేక చందూ ఏ క్షణమైనా విడుదలయ్యేలా కేసు మిగిలింది.

చివరగా కిషోర్‌ను కోర్టులో నిలిపారు. "మీ అన్నను చంపింది చందూ అని నీవు ఎలా నిర్ధారించి అతడి కోసం వెతికివెతికి ముంబైలో ఉన్నట్టు తెలుసుకుని పోలీసుల సాయం కోరావు? ఈ రోజు కోర్టులో నిలబడ్డాడు నిందితుడు. కోర్టుకు కావాల్సింది బలమైన సాక్ష్యాలు. అవి సరిగ్గా లేవు. నీవేమైనా చెప్పదలుచుకుంటే చెప్పు" అని జడ్జి అడిగాడు.

"సార్ ఒకే ఒక సాక్ష్యాన్ని ఇప్పుడు ఇక్కడే చూపగలను. సార్ మా అన్నను చంపడానికి వీడు కత్తి సర్రున దూశాడు. ఆ కత్తితో పొడిచాడు. ఆ కత్తి మీద వేలిముద్రలు నోట్ చేశారు. అయితే ఒకరకమైన పెనుగులాట కారణంగా నాలుగు వేలిముద్రలు దొరికినట్టు, బొటనవేలి ముద్ర దానిపై పడనట్టు చెప్పారు. ఒక్కసారి పరిశీలించండి సార్"

జడ్జి పాత ఫైలులో వేలిముద్ర నిపుణులు ఇచ్చిన వివరాలు చూశాడు. చెదలు తినగా మిగిలిన దానిలో నాలుగు వేలిముద్రలు ఉన్నాయి. నాలుగు వేలిముద్రలున్నట్టుగానే రాసి ఉంది. దీనివల్ల నిర్ధారణ ఎలా జరుగుతుంది అన్నట్టుగానే జడ్జి చూశాడు.

"సార్ ఈ చందూకు కుడి బొటనవేలు యాక్సిడెంటులో ఛిద్రమైంది. దాన్ని అప్పటి డాక్టర్లు ఏదో రకంగా సరిచేశారు. ఆ బొటనవేలికి కింద చర్మంతో బాటు వేలిముద్రలుండవు. కావాలంటే ఇప్పుడు పరిశీలించండి సార్! ఇతడికి ఆ వేలు ఉన్నా లేనట్టే. ఎలాంటి బరువునూ ఆ వేలు మోయలేదు. ఆనాడు నేను ప్రత్యక్షంగా మా అన్నను పొడుస్తున్నప్పుడు చూశాను. కానీ, నన్ను సాక్షిగా వేయలేదు అప్పటి పోలీసులు"

జడ్జి వెంటనే కిషోర్ చెప్పినవన్నీ పరిశీలించాక చందూను నేరం చేసినట్టు గుర్తించి, నేరం చేసి చట్టానికి దొరక్కుండా పారిపోయినందుకు అదనంగా ఆరేళ్లశిక్ష వేసి జైలుకు పంపాడు. ★



అమ్మ బొజ్జలో... అపురూపంగా...

ఈ సృష్టిలో మనం చూడలేని అద్భుతాలెన్నో! అందులో ఒక జీవి మరోజీవికి ప్రాణం పోయడమొకటి. ఫలదీకరణ చెందిన తరువాత ఒక జీవిగా రూపొందడానికి అనేక దశలుంటాయి. మెదడు, నోరు, ముక్కు, కళ్లు, కాళ్లు, చేతులు వంటి అవయవాలు నెమ్మదిగా తయారవుతుంటాయి. అవయవాలు పూర్తిగా తయారై భూమి మీద పడడానికి పట్టే వ్యవధిలో మాత్రం ఎన్నో తేడాలు. అయితేనేం! ఇప్పుడిప్పుడే ప్రాణం పోసుకుంటున్న నలుసులను చూడడం నయనానందకరం. అందుకే అరుదుగా తారసపడే ఈ అద్భుత దృశ్యాలు మీ కోసం.

బాహ్య ప్రపంచంతో ఏమాత్రం సంబంధం లేదన్నట్టు హాయిగా వెచ్చగా తమ తల్లి కడుపులో ముడుచుకున్న వాటిని చూస్తుంటే ముద్దొస్తున్నాయి! మాయా మర్మం తెలియని అమాయకత్వం వాటి బుజ్జిబుజ్జి మొహాల్లో ప్రతిబింబిస్తోంది. ఇప్పుడిప్పుడే రూపు దిద్దుకుంటున్న కుక్క, పిల్లి, కుందేలు, ఏనుగు, ఎలుక, డాల్ఫిన్, కోతి పిండాలు... ఎంత అపురూపంగా ఉన్నాయో!





చిరకాల కోరిక



చాలా చాలా కాలం క్రితం ఒక ఊరిలో ఒక రైతు ఉండేవాడు. పొద్దు పొడవగానే లేచి కాలకృత్యాలు తీర్చుకుని భార్య కట్టి ఇచ్చిన సద్దిమూట పట్టుకుని పొలానికి వెళ్లేవాడు.

రోజంతా పొలంలో కష్టపడి పనిచేసేవాడు. మధ్యాహ్నం సద్దిమూట విప్పి భార్య చేసిపెట్టిన జొన్న రొట్టెలో, జొన్న సంగటో తిని మళ్లీ పొలం పనిలోకి దిగేవాడు. సాయంత్రం కాగానే ఇంటికి తిరిగి వచ్చేవాడు. వచ్చేటప్పుడు వంటకోసం కట్టెలు కొట్టి మోపుకట్టుకుని తెచ్చేవాడు.

మళ్లీ రాత్రి భార్య ఏ జొన్నరొట్టె, సంగటో పెట్టేసరికి అతడికి ముద్ద దిగేది కాదు. రోజూ ఇదే తినాలా అనిపించేది. జీవితమంటే విసుగనిపించేది.

ఒక రోజు పొలం నుంచి తిరిగి వస్తుండగా రచ్చబండ పక్కన చింత చెట్టు కింద గారెలు వేస్తున్న ముసలామె కనిపించింది. అతడి నోట్లో నీళ్లూరాయి. అయితే చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో ఏమీ చేయలేక ఇంటికి తిరిగొచ్చాడు.

ఆ రోజు నుంచి అతడి మనసులో గారెలు తినాలనే ఆశ మొలక మొలిచి మానై కూర్చుంది. గారెలు చేసుకోవడానికి కావలసిన వస్తువులు కొనడానికి డబ్బులు పోగేయాలనుకున్నాడు. గారెలు తినాలనే కోరికను వాయిదా వేస్తూ అప్పటి నుంచి రోజూ ఇంటికి వచ్చేటప్పుడు కొన్ని కట్టెలు ఎక్కువ కొట్టుకొచ్చేవాడు. దారిలో వాటిని అమ్మి మిగతావి ఇంటికి తెచ్చేవాడు. అలా పోగు చేసిన చిల్లర కాసులన్నీ దాచేవాడు.

చలి కాలం వచ్చింది.

రైతుకు ఆ కాలంలో వేడి వేడి గారెలు తింటే బాగుంటుందనిపించింది. అతడు ఆ రోజు పొలం పనికి వెళ్లబోతూ తను దాచుకున్న డబ్బులో నుంచి కొంత తీసి గారెలకు కావలసిన సరుకులు తెచ్చి ఇల్లాలికిచ్చి "నేను పొలం వెళ్లి వస్తాను. ఈలోగా గారెలు చేసి పెట్టు. చాలా కాలంగా తినాలని ఉంది" అని పొలం వైపు వెళ్లాడు.

భార్య గారెలు చేయడానికి కూర్చుంది.

ఒక్కొక్క గారె వేయిస్తూ ఉంటే వాటి నుండి కమ్మటి వాసనకు ఆమె నోట్లో నీళ్లూరాయి. 'గారెలు ఎలా ఉన్నాయో చూద్దాం' అని అనుకుంటూ ఓ గారెను తీసుకుని కొరికింది.

బాగా రుచిగా ఉండడంతో మరో గారె తింది. అలా గారెలు వేయిస్తూ వేయిస్తూ తొమ్మిది గారెలు తింది. చివరగా వేయిస్తున్న గారె మాత్రమే మిగిలింది.

అది చూసి ఆమె గుండె గుభేలుమంది.

భర్త వచ్చి అడిగితే ఏం చెప్పాలా అని ఆలోచనలో పడింది. మిగిలిన ఒక్కగానొక్క గారె తీసి ఉట్టిమీద దాచింది.

రైతు పొలం నుంచి తిరిగి వచ్చి ఇంట్లో కాలుపెడుతూ "ఏమేయ్! గారెలు పెట్టు. ఎప్పుడెప్పుడు తిందామా అని ఉంది" అంటూ బాసింపట్టు వేసుకుని కూర్చున్నాడు.

రైతు భార్య ఉట్టి మీద దాచిన గారె తెచ్చి అతడి ముందు ఉంచింది.

రైతు కంచంలో ఉన్న గారెను చూసి ఆశ్చర్యపోయాడు. "అదేమిటి? ఒక్క గారెనే చేశావా?" అడిగాడు.

"లేదు పది గారెలు చేశాను" అంది భార్య.

"మరి మిగిలినవి ఎక్కడా?" అడిగాడు రైతు.

"గారెలు చేస్తూ ఉంటే వాసన గుమగుమలాడింది. రుచి చూద్దామని తిన్నాను" అంది భార్య నసుగుతూ.

"సరేలే? ఒక్కటి తింటే తిన్నావు. మిగతా తొమ్మిది ఎక్కడ?" అడిగాడు రైతు.

"ఒక గారె తిన్నాక చాలా రుచిగా అనిపించడంతో రెండోది తిన్నాను" అంది రైతు భార్య.

"ఏమిటి రెండో గారె తిన్నావా? కానీలే మిగతా ఎనిమిది ఎక్కడే" అడిగాడు రైతు.

"రెండోది తిన్నాక మూడోది, మూడవ దాని తరువాత నాలుగోది.... ఇలా తొమ్మిది తినేశాను" అంది రైతు భార్య.

"ఓసి నీయమ్మ కడుపు మాడా! తొమ్మిదీ తిన్నావా?"

"అవును! ఈ పదవది కూడా తిందామనిపించింది. పాపం మళ్లీ మీరు చాలా బాధపడతారని, ఒక్కటైనా మీకు పెట్టకపోతే బాగుండదని అట్టిపెట్టాను" అంది.

"ఓసి నీ ముదనష్టపుదానా! తొమ్మిది గారెలు ఎలా మెక్కావే" అని కోపంగా అరిచాడు.

"ఇదిగో ఇలా" అంటూ కంచంలో ఉన్న ఒక్క గారెను తీసుకుని రైతు భార్య నోట్లో వేసుకుంది.

రైతు నివ్వెరపోతూ భార్య వైపు చూశాడు.

అతని భార్య గారెను కర కర నమిలేసింది.

రైతు తన చిరకాల కోరిక తీరనందుకు భోరుమన్నాడు.

- రంగనాథ రామచంద్రరావు